www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 సంచిక : 33 Vol No | విజయవాడ, ఆదివారం 3 ఫిబ్రవరి 2019 | 12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00 Rs.

గోవిందరాజస్వామి ఆలయంలో 3 కిరీటాలు మాయం..?

ప్రజాశక్తి - తిరుపతి సిటి ప్రతినిధి

తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ గోవిందరాజస్వామి ఆలయంలో మూడు కిరీటాలు మాయమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఉత్సవమూర్తులకు అలంకరించే కిరీటాలు కనిపించలేదని మూడు రోజుల క్రితం అధికారులు గుర్తించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించాలంటూ ఉన్నతాధికారులకు నివేదించడంతో విజిలెన్స్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. గోవిందరాజస్వామి ఆలయంలో రహస్య విచారణను విజిఒ స్థాయి అధికారి శనివారం రాత్రి నిర్వహిస్తున్నారు.

'భరోసా'లో అపశృతులు



ముగ్గురు వృద్ధుల మృతి
గంటలకొద్దీ లబ్ధిదారుల నిరీక్షణ
ప్రజా ప్రతినిధులను నిలదీసిన స్థానికులు

ప్రజాశక్తి యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులపాటు పసుపు కుంకుమ, పింఛన్ల లబ్ధిదార్లకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'రెట్టింపు భరోసా-రెట్టింపు సంతోషం'లో తొలిరోజైన శనివారం పశ్చిమగోదావరి జిల్లాలో ఇద్దరు, చిత్తూరులో ఒకరు, పంపిణీ కార్యక్రమ వేదికల వద్ద మృతిచెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు ప్రజా ప్రతినిధులను సమస్యలపై ప్రజలు నిలదీశారు. భోజన ఏర్పాట్లు చేసినట్లుగా పెద్దఎత్తున ప్రచారం చేసిన నేపథ్యంలో కొన్ని చోట్ల ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు.

చిత్తూరు జిల్లా సదుం మండలం నడిగడ్డకు చెందిన ఆటో మస్తాన్ తల్లి షరీఫా (77) ఉదయం 8 గంటల సమయంలో పింఛను తీసుకోవడానికి వెళ్లి, 10.40 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలిలో కర్రి వెంకటరెడ్డి (65) ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో కుమారుడు సురేష్‌రెడ్డి సహాయంతో పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. తొమ్మిది గంటలకు అందరితోపాటు వేలిముద్ర వేసి ఓ పక్కన కూర్చున్నారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరుమిల్లి రాధాకృష్ణ మూడు గంటలకు వస్తారని, అప్పుడు వస్తే పింఛను ఇస్తామని అధికారులు చెప్పారు. ఇంటికి వెళ్లి తిరిగి రాలేక కుర్చీలో కూర్చున్న వెంకటరెడ్డి మధ్యాహ్నం 2 గంటల సమయంలో పక్కకు ఒరిగిపోవడంతో అక్కడున్నవారు సపర్యలు చేసే ప్రయత్నం చేయగా, అప్పటికే మృతి చెందారు. ఇదే జిల్లాలోని తాడేపల్లి గూడెంలో గొర్ల కొండయ్య(80) మూడుగంటల పాటు వేచివున్న పింఛను అందకపోవడంతో స్పృహతప్పి మృతి చెందాడు. వివిధ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలస్యంగా రావడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు. అనంతపురం జిల్లాలో ఎమ్మెల్యే యామిని బాలను, ప్రకాశం జిల్లాలో ఎమ్మెల్యే డేవిడ్‌రాజును స్థానికులు నిలదీశారు.

ఆనంద్ తెల్తుంబ్డే అరెస్టు

పూణె కోర్టు చీవాట్లు • కోర్టు ఆదేశంతో విడుదల


పూనే కోర్టు వద్ద ఆనంద్ తెల్తుంబ్డే

ముంబయి : పోలీసుల అత్యుత్సాహంపై పూణె కోర్టు తీవ్రంగా స్పందించింది. హక్కుల కార్యకర్త, గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఆనంద్ తెల్తుంబ్డేను శనివారం ఉదయం పోలీసులు అరెస్టు చేయడం చట్టవ్యతిరేకమని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలుగు వారాలపాటు అరెస్టు చేయకుండా నిరోధిస్తూ గతనెల 14న సుప్రీంకోర్టు ఇచ్చిన ప్రొటెక్షన్ గడువు ముగియకముందే పోలీసులు తెల్తుంబ్డేను అరెస్టు చేశారు. కోర్టు గట్టిగా చీవాట్లు పెట్టి, ఆయనను విడుదల చేయాలని ఆదేశించడంతో విడిచిపెట్టారు. కేరళ నుంచి వస్తున్న ఆనంద్ తెల్తుంబ్డేను మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 3.30 గంటలకు ముంబయి పోలీసులు అరెస్టు చేసి పూణె పోలీసులకు అప్పగించారు. కాగా, పూణె పోలీసులు సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించారని తేల్‌తుంబ్డే తరఫు న్యాయవాది రోహన్ నాహర్ వ్యాఖ్యానించారు. ఈ నెల 11 వరకు ఆయనకు పోలీసు అరెస్టు నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించినప్పటికీ ఆయనను పోలీసులు అరెస్టు చేయడం కోర్టు ధిక్కారమని, చట్టవ్యతిరేకమని అన్నారు. తెల్తుంబ్డే ముందస్తు బెయిల్‌ను తోసిపుచ్చిన మరుసటి రోజునే పూణె కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. భీమా కోరేగావ్ కేసుకు సంబంధించి గతేడాది ఆగస్టులో దేశంలోని పలునగరాల్లో ఏడుగురు కార్యకర్తల ఇండ్లల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఏడుగురు హక్కుల కార్యకర్తల్లో ఆనంద్ తేల్‌తుంబ్డే ఒకరు.

బిజెపి నిరంకుశ పోకడలు : సిపిఎం 8



పసుపు కుంకుమ చెక్కులను అందచేస్తున్న సిఎం చంద్రబాబు

సంక్షేమానికి మోడీ అడ్డు

- పసుపు కుంకుమ, పింఛన్ల పంపిణీ సభలో సిఎం
- బిజెపికి సహకరించే వారికి గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పనులకు మోడీ ప్రభుత్వం నిధులివ్వడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. మోడీ సర్కారు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో శనివారం నిర్వహించిన పసుపు - కుంకుమ చెక్కులు, పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సభా వేదిక వద్దకు చేరుకున్న ఆయన అక్కడ ఏర్పాటు చేసిన చేతివృత్తుల ప్రదర్శనను తిలకించారు. అనంతరం పసుపు కుంకుమ చెక్కులు, పింఛన్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం చంద్రబాబు బహిరంగ సభలో మాట్లాడారు. చివరి ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో సైతం రాష్ట్రంపై కక్షసాధించే రీతిలో మొండిచేయి చూపిందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర ప్రభుత్వం సరిగా సహకరించకపోయినా 19 రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపామన్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.1000 చేశామని, ఇప్పుడు దానిని రూ.2 వేలకు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో 13 రకాల సామాజిక పింఛన్ల కింద 54.15 లక్షల మందికి రూ.13,413 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 94 లక్షల మంది డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ కింద మూడు విడతలుగా రూ.10 వేల చొప్పున అందిస్తామని పేర్కొన్నారు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మోడీ ప్రభుత్వం సహకరించకపోయినా దానిని పూర్తిచేసి తీరుతామని, ప్రాజెక్టుకు అయిన మొత్తం ఖర్చును కేంద్రం నుండి వడ్డీతో సహా వసూలు చేసి తీరుతామన్నారు. ఈ గడ్డపై పుట్టిన వారెవరైనా బిజెపికి సహకరిస్తే తగిన రీతిలో గుణపాఠం మిగతా 9లో



నేడు హైకోర్టు భవన ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధానిలో నూతనంగా నిర్మించిన తాత్కాలిక హైకోర్టు భవనాన్ని నేడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగయి ప్రారంభించను న్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చీఫ్ జస్టిస్‌తో పాటు సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి శనివారం నాడే విజయవాడకు చేరుకున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి హైకోర్టు రిజిస్ట్రార్ జస్టిస్ సి.హెచ్. మానవేంద్రరాయ్, జస్టిస్ టి.వేణుగోపాల్, స్టేట్ లీగల్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జడ్జి పివి రాంబాబు స్వాగతం పలికారు. హోటల్‌కు చేరుకున్న ప్రధాన న్యాయమూర్తికి పోలీసులు గౌరవ వందనం చేశారు. చీఫ్ జస్టిస్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పలువురు మంత్రులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



లూటీపై నోరు మెదపరేం?

శారదా, రోజ్‌వ్యాలీ, పిఎసిఎల్ కుంభకోణాలపై మోడీ సర్కార్‌ను నిలదీసిన ఏచూరి
జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న చిట్‌ఫండ్స్ స్కామ్‌ల బాధితులకు సంఘీభావం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని చిట్‌ఫండ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. పిఎసిఎల్, శారదా, రోజ్‌వ్యాలీ చిట్‌ఫండ్ స్కామ్‌లపై లోతైన విచారణ చేపట్టాలని, సంబంధించిన వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా (జై కిసాన్..జై జవాన్..జై సంవిధాన్) పేరుతో నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శనివారం చిట్‌ఫండ్ స్కాంలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ జంతర్ మంతర్ వద్ద పదివేల మంది చిట్‌ఫండ్ బాధితులు భారీ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ఏచూరి మాట్లాడుతూ పిఎసిఎల్ స్కాంలో వేల కోట్లు లూటీ జరిగినా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని జస్టిస్ ఆర్‌ఎం లోథా నేతృత్వంలోని కమిటీ నియమించిందని, పిఎసిఎల్ స్కాంలో వేల కోట్లు లూటీ జరిగినట్లు కమిటీ నివేదిక సమర్పించిందని అన్నారు. కానీ కేంద్ర ఆర్థిక మంత్రి మాత్రం ఏరకమైన లూటీ జరగలేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. స్కాంలకు పాల్పడుతున్న వారికి మోడీ సర్కార్ అండగా ఉంటూ, వారిని ప్రోత్సహిస్తోందని విమర్శించారు. పిఎసిఎల్, శారదా, రోజ్‌వ్యాలీ కుంభకోణాల్లో ప్రజల సొమ్మును రూ.40 వేల కోట్ల మేరకు లూటీ అయిందని విమర్శించారు. చిట్‌ఫండ్‌ల పేరుతో సామాన్య ప్రజానీకాన్ని మోసం చేసిన సంస్థలు, కంపెనీల ఆస్తులను జప్తు చేయాలని భారత సర్వోన్నత న్యాయం ఇదివరకే ఆదేశించిందని, ఆ ఆస్తులను విక్రయించి చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు.. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని మిగతా 9లో


ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాచేస్తున్న చిట్‌ఫండ్ బాధితులు ఇన్‌సెట్ మాట్లాడుతున్న ఏచూరి



సిబిఐ చీఫ్‌గా శుక్లా




న్యూఢిల్లీ: సిబిఐ నూతన డైరెక్టర్‌గా రిషికుమార్‌శుక్లాను ఎంపిక చేశారు. రెండేళ్లపాటు ఆయన ఆ పదవిలో కొనసాగుతారు. 1983 బ్యాచ్ ఐపిఎస్ అధికారి రిషికుమార్‌శుక్లాను ప్రధాని నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ ఎంపిక చేసింది. కమిటీలో సభ్యుడైన లోక్‌సభలో కాంగ్రెస్ పక్షం నేత మల్లికార్జునఖర్గే అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ శుక్లాను ఎంపిక చేశారు. ప్రధానితో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోయ్ కూడా ఒకరు. ఈ పదవి కోసం 1984 బ్యాచ్‌కి చెందిన జావీద్ అహ్మద్, రజనీకాంత్‌మిశ్రా,ఎస్‌ఎస్ దేశ్వాల్ పేర్లు కూడా వినిపించాయి. ఈ నిర్ణయాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. శుక్లా గతంలో మధ్యప్రదేశ్ డీజీపీగా పని చేశారు. సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ, మాజీ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్తానా మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో వారిని ఆ శాఖ నుంచి కేంద్రం బదిలీ చేసిన విషయం తెలిసిందే. కేంద్ర నిర్ణయాన్ని తప్పు పట్టిన అలోక్‌వర్మ పదవీకాలం ముగియకముందే ఉద్యోగ విరమణ ప్రకటించి నిరసన తెలిపారు. ఈ ఏడాది జనవరి 31న ఆయన రిటైర్ కావాల్సి ఉండగా, అంతకు ముందే (జనవరి 10న) ఉద్యోగ విరమణ చేశారు. ఈ వివాదం నడుస్తుండగానే మన్నెం నాగేశ్వరరావును సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా కేంద్రం నియమించింది. ఆ నియామకాన్ని సవాల్ చేస్తూ కామన్‌కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శుక్రవారం దీనిపై విచారణ సందర్భంగా కేంద్రం తీరును సుప్రీంకోర్టు తప్పు పట్టింది. సిబిఐకి రెగ్యులర్ డైరెక్టర్‌ను వెంటనే నియమించాలని ఆదేశించింది.

అభ్యర్థుల ఎంపిక కోసం జనసేన స్క్రీనింగ్ కమిటీ 2



మదురోనే గుర్తిస్తాం

- ఐరాస స్పష్టీకరణ
- ట్రంప్ సర్కార్‌కు గట్టి ఎదురుదెబ్బ



ఐక్యరాజ్య సమితి : వెనిజులాలో రాజ్యాంగబద్ధంగా, ప్రజాతంత్రయుతంగా ఎన్నికైన అధ్యక్షుడు నికొలస్ మదురోకే తమ పూర్తి మద్దతువుంటుందని ఐక్యరాజ్యసమితి స్పష్టం చేసింది. మదురో ప్రభుత్వాన్ని కూలదోసి, విలువైన చమురు నిల్వలను తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్న ట్రంప్ సర్కార్‌కు ఇది గట్టి ఎదురు దెబ్బ. వెనిజులా అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకున్న ప్రతిపక్ష అధ్యక్షుడు గైడో ప్రపంచ సంస్థ సాయాన్ని కోరుతూ రాసిన లేఖకు స్పందనగా ఐరాస చీఫ్ ఆంటానియో గుటెరస్ ఈ విషయం స్పష్టం చేసినట్లు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ తెలిపారు. వెనిజులా విదేశాంగ మంత్రి జార్జి అరెజా నేతృత్వంలోని వెనిజులా ప్రభుత్వ ప్రతినిధి బృందాన్నే వెనిజులా అధికారిక బృందంగా తాను గుర్తిస్తున్నానని గుటెరస్ పేర్కొన్నట్లు ఆ ప్రతినిధి వివరించారు. వెనిజులాకు మానవతా సాయాన్ని పంపాలని కోరుతూ జువాన్ గెయిడో పంపిన లేఖకు గుటెరస్ స్పందిస్తూ, సాయం కోసం చేసే ఏ అభ్యర్థన అయినా వెనిజులా నేత మదురో ద్వారానే రావాలని గుటెరస్ చెప్పారు. వెనిజులాలో అభివృద్ధి కార్యక్రమాలకు మానవతా సాయం పెంచేందుకు ఐక్యరాజ్య సమితి సిద్ధంగా వుందని తెలిపారు. వెనిజులాలోని సంబంధిత పక్షాలన్నీ కలిసి విశ్వసనీయమైన రాజకీయచర్చలు జరిపి పరిష్కారం కనుగొనాలని గుటెరస్ ఆకాంక్షిస్తున్నారు.

బిల్లులు నిలిపివేత

ఫిబ్రవరి ఖర్చు కోసం ముందు జాగ్రత్త
పథకాల కోసం 15 వేల కోట్లు నిల్వ!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి

ఫిబ్రవరి నెల ఆర్థికశాఖ అధికారుల్లో గుబులు పుట్టిస్తోంది. నిధుల గండం నుంచి ఎలా గట్టెక్కాలా అన్న భయం వెంటాడుతోంది. అందుకే అవసరమైన ఎన్నికల పథకాల ఖర్చుల కోసం ఇప్పటినుంచే నిధులను దాచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దాదాపు 15 వేల కోట్ల వరకు నిల్వ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. దీనివల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులతో సహా కొన్ని బకాయిల చెల్లింపులు నిలిపివేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పెంచిన పింఛన్లు, పసుపు కుంకుమ, రుణమాఫీ, ఇళ్ల నిర్మాణం, నిరుద్యోగ భృతి తదితర పథకాల అమలులో ఎలాంటి ఇబ్బంది రాకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

పసుపు కుంకుమ కింద అదనంగా ప్రకటించిన పది వేల రూపాయల నగదులో భాగంగా తొలి విడతకు రూ.2,500 కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా. అలాగే మార్చి నెల వరకు లక్ష్యంగా పెట్టుకున్న రుణమాఫీ నిధులను కూడా ఈ నెల్లోనే విడుదల చేయాల్సి ఉంది. ఇది ఎనిమిది వేల కోట్లుగా ఉంది. వడ్డీలేని రుణాలు కోసం 2200 కోట్లు, సబ్సిడీల కింద మరికొంత నిధులను ఇవ్వాల్సి ఉంది. కరువు సహాయం ఇన్‌పుట్ సబ్సిడీగా రెండు వేల కోట్లు ఇంకా అలాగే ఉంది. ఇవి కాకుండా నిరుద్యోగ భృతి కింద వెయ్యి రూపాయలను రెండు వేల రూపాయల వరకు పెంచనున్నట్లు సమాచారం. దీనికి రూ.500 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంటున్నారు. అలాగే సామాజిక పింఛన్లను కూడా పెంచిన నేపథ్యంలో 1600 కావాల్సి ఉంటుందని అంటున్నారు. ఇలా ఒక్క ఫిబ్రవరిలోనే ఒక్కసారి ఖర్చులు పెరిగిపోవడంతో నిధుల సేకరణకు ఆర్థిక శాఖ నడుం బిగించింది. అందుకే జీతాలు చెల్లించిన తరువాత మిగిలిన, బయట నుంచి వస్తున్న మొత్తం నిధులను పై అవసరాల కోసం నిల్వ చేస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే పది వేల కోట్ల వరకు నిల్వ చేసిన అధికారులు, ఒకటి రెండు రోజుల్లోనే మిగిలిన మొత్తాన్ని కూడా సమీకరించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ ఖర్చులు మొత్తం గట్టెక్కేంత వరకు ఇతర ఖర్చులను పక్కన పెట్టాలని భావిస్తున్నారు. ప్రధానంగా నీటిపారుదల, రోడ్లు, ఇతర నిర్మాణ రంగాలకు చెందిన బిల్లులను ఆపివేస్తున్నట్లు సమాచారం.

కార్పొరేషన్ల రుణాలకు లంచాలు

ఆర్టీజీఎస్ సర్వేలో వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, కాపు కార్పొరేషన్ల రుణాల కోసం పెద్దఎత్తున లంచాలు చెల్లించాల్సి వస్తోందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఆర్‌టిజిఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. జనవరిలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం వెల్లడించిన లెక్కల ప్రకారం ఇప్పటి వరకు రూ. 1470 కోట్లతో 25,147 మందికి రుణాలు ఇచ్చినట్టు చెబుతున్నారు. మొదటి మేళాలో రూ. 193 కోట్లతో 22,477 మందికి, రెండో మేళాలో రూ. 4.45 కోట్లతో 761, మూడో మేళాలో రూ. 1273 కోట్లతో 1909 మందికి రుణాలు ఇచ్చినట్టు ప్రభుత్వం తెలిపింది. ఆర్టీజీఎస్ సర్వేలో వీరిలో 25 శాతం మంది రుణాల కోసం లంచాలు చెల్లించాల్సివస్తోందని చెప్పారు. 'అధికారులు లంచం అడుగుతున్నారు' అని వీరు చెప్పారు. ఈ సామాజిక వర్గాలనుండి 49శాతం మంది తమకు రుణాలు అందలేదని తెలిపారు.రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు గ్యారెంటీల కోసం మరి కొంత మంది ఇబ్బందులు పడుతున్నట్టు వెల్లడించారు.



మొదటి డ్రైవర్‌ను నేనే

మీరంతా నావెంటే నడవాలి
ఆటో నడిపిన చంద్రబాబు
బీమా చెల్లింపుపై అధికారులతో చర్చిస్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'రాష్ట్రానికి మొదటి డ్రైవర్‌ను నేనే.. రాష్ట్ర ప్రజలను సురక్షితంగా అభివృద్ధివైపు నడిపిస్తున్నాను. మీరందరూ నావెంటే నడవాలి' అని ఆటో డ్రైవర్లనుద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. 'మీరు ఒక ఒక డ్రైవింగ్ సీటులో కూర్చున్నారు. నేను ఇంకో డ్రైవింగ్ సీటులో కూర్చున్నా' అని అన్నారు. ఉండవల్లిలోని సిఎం గ్రీవెన్స్‌హాల్‌లో శనివారం టిఎన్‌టియుసి నాయకులు, టిడిపి రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఎవి రమణ, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, అర్బన్ టిడిపి ప్రధాన కార్యదర్శి కె.పట్టాభిరామ్‌ల నేతృత్వంలో ఆటో డ్రైవర్లు మోటారు వాహనాల జీవిత కాల పన్ను మినహాయించినందుకు ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కాకి చొక్కా వేసుకుని ఆటో నడిపారు. అనంతరం ఆటోడ్రైవర్లు మాట్లాడుతూ ప్రతి ఏటా భీమా చెల్లింపు భారమవుతోందని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సిఎం స్పందిస్తూ 'రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు సంఘంగా ఏర్పడండి. మీకు ఏ విధంగా ఇన్సూరెన్స్ అమలు చేయాలో ఆయా కంపెనీల అధికారులతో చర్చించిన తర్వాత నిర్ణయిద్దాం' అని అన్నారు. . ఆటోలకు పన్ను మినహాయింపుతో పాటు ఆటోలకు జీవితకాలం పన్ను , ట్రాక్టర్లకు త్రైమాసిక పన్ను నుంచి మినహాయింపు ఇస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుందన్నారు. ముగ్గురు నుంచి ఏడుగురు ప్రయాణించే మూడు చక్రాల ఆటోలు, సరకు రవాణా చేసే మూడు చక్రాల ఆటోలు, మూడు టన్నుల బరువు తీసుకెళ్లే సామర్థ్యం కలిగిన తేలికపాటి వాహనాలు, వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రాక్టరు ట్రయలర్లపై పన్ను మినహాయింపు నిచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.



మరో నాలుగు రోజులు చలే..

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో మరో నాలుగురోజుల పాటు చలి కొనసాగే అవకాశాలున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుందని, ఉత్తర గాలులు వీస్తున్నందున పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరగనున్నాయని విశాఖపట్నం వాతావరణ శాఖ విశ్రాంత శాస్త్రవేత్త రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. మొట్టమొదటి సారిగా ఫిబ్రవరి వరకూ చలి కొనసాగిన పరిస్థితి ఇదేనని తెలిపారు. ఇది వరకూ జనవరి మాసాంతంతో చలి తగ్గిపోయేదన్నారు. మధ్యదరా దేశాల నుంచి హిమాలయాల మీదుగా చలి గాలులు వీస్తున్నందున రాత్రిపూట ఎక్కువ చలి కొనసాగుతోందన్నారు.



చంద్రబాబును కలిసిన జపాన్ ప్రతినిధి ఎహోయీ ససకావా జపాన్‌లో కుష్టు వ్యాధి నివాసరణకు ససకావా విశేష కృషి చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తన సేవలందించేందుకు ముందుకొచ్చారు.

ప్రజ్ఞ

1.ప్రో రెజ్లింగ్ 2019 విజేత ఎవరు?
2.ఎన్‌సిసి డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియామితులయ్యారు?
3.200 వన్డేలు ఆడిన తొలి మహిళా క్రికెటర్ ఎవరు?
4.ఎన్‌పిటిపై సంతకం చేయాల్సిందేనని భారత్‌కు ఏ దేశం స్పష్టం చేసింది?
5.2019 ఆసియా ఫుట్‌బాల్ కప్ విజేత ఎవరు?

సమాధానాలు 7లో

ఆరోగ్యాన్ని కాపాడేవారికే ఓటు

- హెల్త్ మేనిఫెస్టోను విడుదల చేసిన ప్రజారోగ్య వేదిక
- ఆరోగ్యం ప్రజల హక్కుగా చట్టం చేయాలని డిమాండ్



హెల్త్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ప్రజారోగ్య వేదిక నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు 'మా ఆరోగ్యాన్ని కాపాడేవారికే మా ఓటు' అని ప్రజలు చెప్పాలనికోరింది. తద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచే విధానాలు ప్రభుత్వం తీసుకొచ్చేలా కృషి చేయాలంది. శనివారం విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో వేదిక రాష్ట్ర నాయకులు ఆరోగ్య సంబంధిత అంశాలపై 18 డిమాండ్లతో కూడిన హెల్త్ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎస్. సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్యం ప్రజల హక్కుగా గుర్తిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని రూపొందించాలన్నారు. 2017లో ప్రకటించిన జాతీయ ఆరోగ్య విధానం మేరకు ప్రజారోగ్యం పై ప్రభుత్వాలు చేసే వ్యయం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 3.5 శాతానికి, ఐదేళ్లలో 5 శాతానికి పెంచాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి తృతీయ స్థాయి వరకు ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని, అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. వైద్య పరికరాల కొనుగోలు నుంచి సిబ్బంది నియామకం వరకు పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సేవలలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని పరిమితం చేయాలని, సార్వత్రిక ఆరోగ్య రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. వేదిక రాష్ట్ర కో కన్వీనర్ టి. కామేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఆంకాలజీ విభాగాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులపై తగిన ప్రభుత్వ నియంత్రణ ఉండాలని సూచించారు. చిన్న, మధ్య స్థాయి ప్రయివేటు ఆస్పత్రులకు రక్షణ కల్పిస్తూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని సవరించాలన్నారు. అత్యవసర మందులు ప్రజలకు అందుబాటు ధరలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాటి నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించే ఔషధ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా అన్నిరకాల మందులు ఇవ్వాలని, ప్రతి మండల కేంద్రంలో జనరిక్ మందులషాపును ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది హక్కులకు రక్షణ కల్పించాలని, పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. మద్య నియంత్రణను అమలు చేయాలని, ఔషధాలు, వైద్యపరికరాలపై జిఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, అమలు చేయాలన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో వైద్య పరిశోధనలు ప్రోత్సహించాలని, వైద్య కళాశాలల్లో తగిన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవడంతోపాటు, ఆరోగ్య ప్రణాళికల రూపకల్పనలో ప్రజలను భాగస్వాములుగా చేయాలన్నారు. ఈ అంశాలపై ఓట్లు అడిగేందుకు వచ్చేవారిని ప్రశ్నించాలన్నారు. ప్రజారోగ్య వేదిక రూపొందించిన హెల్త్ మేనిఫెస్టోను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. సమావేశంలో వేదిక రాష్ట్ర కో కన్వీనర్ ఎజి. రాజమోహన్, ట్రెజరర్ ఎ. వంశీకృష్ణ, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో తెలుగు విద్యార్థులకు న్యాయసహాయం : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమెరికాలో అక్రమ అరెస్టులకు గురైన తెలుగు విద్యార్థులకు న్యాయ సహాయం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విద్య కోసం అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన తెలుగు విద్యార్థులను నకిలీ యూనివర్శిటీల్లో చేరారనే ఆరోపణలతో అరెస్ట్ చేయడాన్ని సిపిఎం ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. డెట్రాయిడ్‌లో పోలీసు అధికారుల అదుపులో ఉన్న తెలుగు విద్యార్థులకు కేంద్రం తక్షణమే న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. తెలుగు వారితో కలిపి ఈ వివాదంలో మొత్తం 600 మంది భారతీయ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాలలో బిటెక్ అనంతరం రెండేళ్ళ ఎంఎస్ కోర్సు చేయడానికి అమెరికా యూనివర్శిటీల్లో ప్రవేశాలు పొందుతున్నారని, అక్కడ నిబంధనలు తెలియక కొంత మంది చిక్కుల్లో పడుతున్నారని పేర్కొన్నారు. చదువు పూర్తి చేసిన అనంతరం ఆ యూనివర్శిటీ అనుమతిలో 3 సంవత్సరాలు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపిటి) కింద ఉద్యోగం చేసుకునే అవకాశముంది. అయితే ఆ యూనివర్శిటీలకు ప్రభుత్వ గుర్తింపు, చదువుతున్న కోర్సులకు ఓపిటి వర్తించే అంశాలపై అవగాహన లేకపోవడంతో విద్యార్థులు మోసపోతున్నారని తెలిపారు. నకిలీ యూనివర్శిటీలపై చర్యలు తీసుకోకుండా , నకిలీ వీసాలు పొంది తమ దేశంలో అక్రమంగా ఉంటున్నారని అమెరికా అరోపించడం తగదన్నారు. నేరానికి యూనివర్శిటీలే బాధ్యత వహించాలని, విద్యార్థులు కాదన్నారు. ఈ అంశాన్ని విధాన పరంగా పరిశీలించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విద్యార్థులకు న్యాయం జరిగేలా చూసి, బాధితులను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్యాయాన్ని నిలదీసేందుకే నిరసనలు

టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిలదీసేందుకే తీవ్ర స్థాయిలో నిరసనలు తెలుపుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు నలుపు రంగు దుస్తులు ధరించడం ఎప్పుడూ జరగలేదన్నారు. ఢిల్లీలో టిడిపి ఎంపిలు నల్ల చొక్కాలతో ధర్నా చేశారని తెలిపారు. . కేంద్ర బడ్జెట్ పేదలపై ఏ మాత్రం ప్రభావం చూపలేదన్నారు. ఈ బడ్జెట్ వల్ల సామాన్యులకు వరిగిందేమీ లేదన్నారు. ఇబిసి రిజర్వేషన్ల ఆదాయ పరిమితి రూ.8లక్షలుగా పేర్కొని, ఆదాయపు పన్నుకు మాత్రం రూ.5లక్షలుగా నిర్ణయించారని, ఇటువంటి వైరుద్యాలు అనేకం ఉన్నాయన్నారు. ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని మరో సంక్రాంతిగా ఆయన అభివర్ణించారు. పింఛన్ల పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులకు సూచించారు.

కోడి కత్తో.. నారా కత్తో త్వరలో తేలుతుంది

వైఎస్‌ఆర్‌సిపి నేత మహ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసు విచారణలో డొంకంతా కదులుతోందని వైఎస్‌ఆర్‌సిపి సీనియర్ నేత మహ్మద్ ఇక్బాల్ అన్నారు. కోడి కత్తి అంటూ ఎగతాళి చేస్తూ మాట్లాడిన టిడిపి నేతలకు త్వరలోనే కోడి కత్తో...నారా కత్తో తెలుస్తుందని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన...ప్రతిపక్ష నేతపై జరిగిన హత్యాయత్నం కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఐఏకు సహకరించకుండా నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేసును చంద్రబాబు, డిజిపి కలిసి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సివిల్ ఏవియేషన్ యాక్టు ప్రకారం ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం ఎన్ఐఏకు అప్పగించాలని తెలిసినా చంద్రబాబు ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. జగన్‌పై దాడి వెనుక కుట్ర కోణం ఉందని, నిందితుడు శ్రీనివాసరావును ఎవరు ప్రోత్సహించారనేది తేల్చాల్సి ఉందని ఎన్ఐఏ కూడా స్పష్టం చేయడం జరిగిందన్నారు. ఎన్ఐఏ విచారణతో డొంకంతా కదులుతుందనే చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు చేసుకుని లోకేష్‌ను పంపించారని ఆరోపించారు.

అర్‌టిసిలో జోరుగా సమ్మె సన్నాహాలు

ఎన్ఎంయు ఆధ్వర్యంలో చలో ఆర్ఎం కార్యాలయం
రేపు జెఎసి నేతృత్వంలో రాజకీయ పార్టీల సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంస్థ పరిరక్షణ, వేతన సవరణ తదితర డిమాండ్లతో జరగనున్న ఆర్‌టిసి సమ్మెకు జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. వివిధ కార్మిక సంఘాల జెఎసి రోజుకో కార్యక్రమాన్ని చేపడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున చేస్తున్న ప్రచారానికి కార్మికుల నుండి సానుకూల స్పందన వస్తోంది. విడిగా సమ్మె నోటీసు ఇచ్చిన ఎన్ఎంయు శనివారం నాడు చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సర్వీస్ కండీషన్లను మెరుగుపర్చాలని, ప్రభుత్వమే ఆర్టీసిని ఆదుకోవాలని కోరారు. కనీసం పదేళ్ల ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలని, గతంలో అంగీకరించిన మేరకు కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజీ కార్మికులకు పెను భారంగా ఉన్న సర్క్యులర్‌ను రద్దు చేయాలని, సిబ్బంది మీద పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని, ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. . రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్ఎం కార్యాలయాల వద్ద ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మరోవైపు సమ్మెకు మద్దతుగా సోమవారం రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల, ట్రేడ్ యూనియన్ల సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్టీసి కార్మిక సంఘాల జెఎసి కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్ సుందరయ్య, వి వరహాల నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

ఆర్టీసి కార్మికులకు వేతన సవరణ చేయడంతో పాటు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం లేఖ రాశారు. సమ్మె అనివార్యమైతే లక్షలాది మంది ప్రయాణీకులకు రవాణా సౌకర్యం కరువై పలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని తెలిపారు. డీజిల్ రేట్ల పెరుగుదల, ప్రయివేటు అక్రమ రవాణా తదితర కారణాల వల్ల ఆర్టీసి నష్టాల్లో ఉందని, నష్టాల్లో ఉన్న ఆర్టీసిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కార్మికులకు మెరుగైన వేతన సవరణ చేయాలని, నష్టాల పేరుతో సిబ్బంది కుదింపు యోచన విడనాడాలని, డీజిల్ పెరుగుదల భారాన్ని ప్రభుత్వమే భరించాలని, పదేళ్ల టాక్స్ హాలిడే ప్రకటించాలని కోరారు. సమ్మెను నివారించేందుకు ఆర్టీసి కార్మికుల న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు.

7 నుంచి దరఖాస్తుల స్వీకరణ

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో పోటీ చేసేందుకు అశావహుల నుంచి ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశావాహులు శాసనసభా స్థానానికి రూ.2 వేలు, లోక్‌సభ స్థానానికి రూ.5 వేలు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10వ తేదీ తరువాత దరఖాస్తులు స్వీకరించే అవకాశం లేదన్నారు. దరఖాస్తు చేసిన ఆశావహులు 10 రోజులపాటు కనీస కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుందన్నారు. జిల్లా కమిటీలు అభ్యర్థులకు సంబంధించిన పూర్తి వివరాలతో పిసిసికి నివేదిక అందజేస్తాయని, పిసిసి ఆ జాబితాను పరిశీలించి ఎఐసిసికి పంపుతుందని తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులోగా కేంద్ర ఎన్నికల కమిటీ అభ్యర్థులను ప్రకటిస్తోందని చెప్పారు. ఈ నెల రెండవ వారం నుండి ప్రత్యేక హోదా భరోసా ప్రజాయాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యాత్ర 25 పార్లమెంటరీ, 84 అసెంబ్లీ నియోజకవర్గాల మీదగా సభలు నిర్వహిస్తామని తెలిపారు.

అభ్యర్థుల ఎంపిక కోసం జనసేన స్క్రీనింగ్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే ఎన్నికల్లో ధీటైన అభ్యర్థులను బరిలోకి దింపడమే లక్ష్యంగా ఐదుగురు సభ్యులతో కూడిన స్క్రీనింగ్ కమిటీని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారు. జనసేన తరుపున పోటీ చేయాలని ముందుకు వస్తోన్న ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వాటిని కూలంకుషంగా పరిశీలించి ఆ వివరాలను పార్టీకి అందించడం ఈ కమిటీ ప్రధాన లక్ష్యమని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలిపారు. కమిటీ సభ్యులుగా శాసనమండలి మాజీ సభ్యులు మాదాసు గంగాధరం, పార్టీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అరహంఖాన్, పవన్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, పార్టీ వ్యవస్థాపక ఉపాధ్యక్షులు బి.మహేందర్‌రెడ్డి, సీనియర్ లీడర్ తమ్మిరెడ్డి శివకంర్‌లను నియమించారు. కమిటీ లోక్‌సభ, శాసనసభకు పోటీ చేయాలనుకునే అభ్యర్థుల ప్రొఫైల్స్, వివరాలను, వారి రాజకీయ నేపథ్యాన్ని కమిటీ పరిశీలిస్తుంది. అభ్యర్థికి వ్యక్తిగతంగా ఉన్న బలం, గెలిచే సమర్థత, ఎన్నికల్లో పోరాడే శక్తి, ప్రత్యర్థిని ఎదుర్కొనే సమర్థత, ప్రజాసమస్యల పరిష్కారంపైనా, సామాజిక అంశాలపై స్పందన, నిబద్ధత వంటి ఐదు ప్రధాన అంశాలను ఆధారంగా వడపోసి అర్హులైన అభ్యర్థుల జాబితాను జనరల్ బాడీకి అందజేస్తోందన్నారు. ఫిబ్రవరి రెండవ వారంలో విజయవాడలోని పార్టీ కార్యాలయం నుంచి ఈ కమిటీ పని చేయడం ప్రారంభిస్తోందన్నారు.. ఆ వివరాల ఆధారంగా తుది నిర్ణయాన్ని పార్టీ జనరల్ బాడీ తీసుకుంటుందన్నారు. విజయం సాధించే అభ్యర్థులను గుర్తించి ఎంపిక చేయడమే ఏకైక లక్ష్యంగా పార్టీ జనరల్ బాడీ పని చేస్తోందన్నారు. కూటమిలో ఇచ్చే స్థానాలను ఇదే గుర్తిస్తోందన్నారు. 2019లో జనసేన ప్రభుత్వాన్ని స్థాపించే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపిక దశలో పారదర్శకంగా, ధృడచిత్తంతో జనరల్ బాడీ పని చేస్తోందన్నారు.

తొలగించిన బీమా మిత్రలను తక్షణమే విధుల్లోకి

సిఎంకు ఎపి సెర్ప్ బీమా మిత్రల యూనియన్ వినతి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

అక్రమంగా తొలగించిన బీమా మిత్రలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, కనీస వేతనాలు చెల్లించాలని, ఇన్సూరెన్స్ సిసిలుగా గుర్తించాలని కోరుతూ ఎపి సెర్ప్ బీమా మిత్రల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.చిన్ని, కె.ధనలక్ష్మి శనివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. పదేళ్లుగా పనిచేస్తున్న బీమా మిత్రల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీమా మిత్రల యూనియన్ రాష్ట్ర కమిటి గత నెల మూడో తేదీన సెర్ప్ సిఇవో కృష్ణమోహన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించామని, సమస్యలను పరిష్కరించకపోగా యూనియన్ రాష్ట్ర నాయకులుగా ఉన్న వారిని విధుల నుంచి తొలగించారని తెలిపారు. ప్రభుత్వం బీమా మిత్రలకు నెలకు స్థిరమైన వేతనం చెల్లించాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, అధికారుల బెదిరింపులు, వేధింపులు అరికట్టాలని, పని భద్రత కల్పించాలని, 174 కేసులకు సంబంధించి ఫైనల్ రిపోర్టుతో సంబంధం లేకుండా డాక్యుమెంటు అప్‌లోడ్ చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

విషప్రయోగంతోనే హత్య

- మేనకోడలిపైనే అనుమానం!
- జయరామ్ హత్యకేసులో పురోగతి
- అదుపులో మరికొంత మంది అనుమానితులు

ప్రజాశక్తి - నందిగామ

ఎన్ఆర్ఐ, ఎక్స్‌ప్రెస్ టివి మాజీ ఎండి, కోస్టల్ బ్యాంక్ ఎండి చిగురుపాటి జయరామ్ హత్య కేసులో పురోగతి సాధించినట్లుగా నందిగామ పోలీసులు వెల్లడించారు. మరికొద్ది గంటల్లోనే నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్లుగా సమాచారం. ఈ హత్యకేసులో కీలక వ్యక్తిగా భావిస్తున్న జయరామ్ మేనకోడలు పులవర్తి మాధురి అలియాస్ శిఖా చౌదరిని నందిగామ రూరల్ సిఐ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పి త్రిపాఠి, డిఎస్పి బోస్, సిఐ రమణ ఆధ్వర్యంలో విచారించారు. విచారణలో కీలకాంశాలను పోలీసు అధికారులు రాబట్టినట్లుగా సమాచారం. హత్యకేసుగా నమోదు చేసిన వెంటనే వివిధ కోణాల్లో విచారణ చేపట్టేందుకు నాలుగు బృందాలను రంగంలోకి దింపినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాదులో పలువురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించినట్లుగా తెలిసింది. కేసులో ముఖ్యమైన వ్యక్తులుగా భావిస్తున్న శిఖా చౌదరి, ఆమె చెల్లెలు మనీష చౌదరి, శిఖా చౌదరి స్నేహితులు రాఖేష్‌రెడ్డి, శ్రీకాంత్, జయరామ్ సోదరి సుశీల, జయరామ్ కారు డ్రైవర్ సతీష్, శిఖా చౌదరి కారు డ్రైవర్ శ్రీరామ్‌లను కంచికచర్లలోని నందిగామ రూరల్ సిఐ కార్యాలయంలో విడివిడిగా విచారించారు. జయరామ్, శిఖా చౌదరీల మధ్య ఆర్థిక లావాదేవీలపై విచారించగా పోలీసులకు కీలకమైన సమాచారం అందినట్లు తెలిసింది. శిఖా చౌదరికి రాఖేష్‌రెడ్డి అనే వ్యక్తి రూ. 4.5 కోట్లు అప్పుగా ఇవ్వగా జయరామ్ తీర్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై గత రెండేళ్లుగా శిఖా చౌదరి, రాఖేష్‌రెడ్డి, జయరామ్‌ల మధ్య వివాదం కొనసాగుతున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు వద్ద జయరామ్‌కు చెందిన 10 ఎకరాల భూమిని శిఖా చౌదరి పేరిట జయరామ్ రిజిస్టర్ చేసి ఆ పత్రాలు తనవద్దే ఉంచుకున్నాడు. జయరామ్ పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి శిఖా చౌదరిని మేజర్ షేర్ హోల్డర్‌గా ఉంచిన్నట్లు పోలీసులకు కీలక సమాచారం అందింది. జయరామ్ భార్య పద్మశ్రీకి పోలీసులు ఫోన్ చేసి అడగ్గా ఆమె కూడా శిఖా చౌదరిపైనే అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు నందిగామకు శిఖాచౌదరిని రప్పించారు. ఉదయం 10 గంటలకు కంచికచర్ల రూరల్ సిఐ కార్యాలయానికి వచ్చిన జిల్లా ఎస్పి త్రిపాఠి, డిఎస్పి, సిఐలు ఆమెను పలు కోణాల్లో విచారించారు. సూర్యపేట జిల్లా పతంగి వద్ద టోల్‌గేట్‌ను జయరామ్ కారు దాటేటప్పుడు సిసి ఫుటేజ్‌లో డ్రైవర్‌తో పాటు ఒక మహిళ ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆ మహిళ శిఖా చౌదరి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాఖేష్ రెడ్డి, శ్రీకాంత్‌లకు శేఖర్‌రెడ్డితో ఉన్న సంబంధాలపై కూడా ఆరా తీస్తున్నారు. వీరందరినీ ఇప్పటికే విడివిడిగా ప్రశ్నించారు. జనవరి 30వ తేదీ మధ్యాహ్నం ఇంటి వద్ద నుండి బయలుదేరిన జయరామ్ 31వ తేదీ మధ్యాహ్నం వరకు హైదరాబాదులోని ఓ ప్రముఖ హోటల్‌లో ఫార్మా కంపెనీల ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నట్లుగా తెలిసింది. 30, 31 తేదీల్లో మిగిలిన సమయం శిఖా చౌదరి ఇంటి వద్దే ఉన్నట్లుగా సమాచారం. జయరామ్ కారులో మృతదేహంగా పడివున్నప్పుడు అతని శరీరం రంగుమారినట్లు కనిపించటంతో అతని హత్యకు విషప్రయోగం జరిగిందనే అనుమానంతో పోలీసులు అతని శరీరంలోని కీలక భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఈ హత్యలో గుంటూరు జిల్లాకు చెందిన ఒక ఎంపి సోదరుడి పేరు బలంగా వినిపిస్తుండటంతో అతన్ని కూడా విచారించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. జయరామ్‌తో గతంలో వ్యాపార లావాదేవీలు నడిపి, ప్రస్తుతం విడిగా వ్యాపారం నిర్వహించుకుంటున్న భాను, ఉద్దండ కృష్ణ అనే వ్యాపారులను కూడా విచారించనున్నట్లుగా తెలిసింది. గతంలో ఎక్స్‌ప్రెస్ చానల్ నడిపిన సమయంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జయరామ్‌పై కూడా కేసు ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిగురుపాటి జయరామ్ హత్యకేసులో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్న ఆయన భార్యపిల్లలు హైదరాబాద్ చేరుకోకపోవడంతో అంత్యక్రియలు ఆలస్యం కానున్నాయి. పొగమంచు కారణంగా అమెరికా నుండి ఇండియాకు వచ్చే విమానాలను నిలిపివేయడంతో వారు మరో రెండురోజులు ఆలస్యంగా వచ్చే అవకాశముందని తెలిసింది. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి అతని మేనమామ గుత్తా పిచ్చయ్య చౌదరికి అప్పగించారు. జయరామ్ మృతదేహం ప్రస్తుతం హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు.



సంక్షిప్తం

డిజిపి కార్యాలయాన్ని సందర్శించిన మాజీ డిజిపి దొర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని మాజీ డిజిపి హెచ్‌జె దొర శనివారం సందర్శించారు. డిజిపి ఆర్‌పి ఠాకూర్‌తో కలిసి సిబ్బంది, పోలీస్‌శాఖ ఉన్నతాధికారులతో శాఖాపరమైన విషయాలను చర్చించారు. కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో శాంతి భద్రతల అడిషనల్ డిజి రవిశంకర్ అయ్యన్నార్, శాంతి భద్రతల డిఐజి జి శ్రీనివాస్, సాంకేతిక సేవల డిఐజి సిహెచ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎన్నికల కమిటీ

ఎన్నికల నిర్వహణ కమిటీని బిజెపి ప్రకటించింది. కమిటీకి ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సభ్యులుగా ఎంపి జివిఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ మస్తాన్, షేక్ బాజి, ఆర్డీ విల్సన్, అడపా శివనాగేంద్రరావు, వాసిరెడ్డి వెంకట చైతన్య, కొమిరిశెట్టి సాంబశివరావు, యడ్లపాటి రఘునాథబాబు ఉన్నారు.

36,360 కోట్లు!
ఇది బడ్జెట్‌లో రాష్ట్ర పన్నుల వాటా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర బడ్జెట్‌లో పన్నుల వాటాగా రాష్ట్రానికి 36,360 కోట్ల రూపాయలు రానున్నాయి. ఇది గత ఏడాదికన్నా 3573 కోట్లు అదనం. ఇందులో కార్పొరేషన్ పన్నుల రూపంలో 11,775 కోట్లు రానుంది. అలాగే ఆదాయపు పన్ను ద్వారా 9803 కోట్లు, కేంద్ర అమలు చేస్తున్న జిఎస్‌టి ద్వారా 11.004 కోట్లు, కస్టమ్స్ టాక్స్ ద్వారా 2,284 కోట్లు, ఎక్సయిజ్ డ్యూటీ కింద 1,402 కోట్లు, ఆస్తి పన్ను కింద 32 లక్షల రూపాయలు రాష్ట్రానికి రానున్నాయి. కాగా, 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులుగా 32,787 కోట్లు కేటాయించగా, ఈ సారి కొంతవరకు పెరుగుదల కనిపించింది. అయితే, ఇది సాధారణ ప్రక్రియలో భాగంగా వస్తున్న నిధులేనని, పన్నుల వసూళు పెరగడంతో రాష్ట్రానికి వచ్చే మొత్తం కూడా కొంత మేర పెరిగిందని అధికారులు వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి 2.437 శాతంతో 20,583 కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

ఆలస్యం... ఆపై అసౌకర్యాలు

ఒక్కసారే రూ.3 వేలు రావడంతో కొందరు హర్షం

భోజనాలు లేక సాయంత్రం వరకూ విలవిల



తూర్పుగోదావరి జిల్లా మండపేటలో నిరీక్షిస్తున్న మహిళలు

ప్రజాశక్తి యంత్రాంగం

విశాఖ ఏజెన్సీలోని అనంతగిరిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ఆలస్యంగా వచ్చారు. మంత్రి అనంతగిరికి వచ్చేసరికి సాయంత్రం అయింది. మంత్రి రాకకోసం ఉదయం 10 నుంచి సాయంత్రం వరకూ డ్వాక్రా మహిళలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎదురుచూశారు. వీరికి ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేదు. పెదబయలు మండలంలోని పర్రెడ పంచాయతీలో డ్వాక్రా మహిళలు ఉదయం నుంచి అధికారుల రాక కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు. అధికారులు రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో నాసర్‌రెడ్డి నగర్‌కు చెందిన దళిత మహిళలు ఎమ్మెల్యే డేవిడ్‌రాజును నిలదీశారు. దళిత వాడలో నాలుగున్నరేళ్లుగా ఒక తట్ట మట్టి కూడా విధిలించలేదని, పేదల ప్రభుత్వం అని చెప్తున్న మీరు దళిత వాడపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం చెప్పాలో అర్థంకాని ఎమ్మెల్యే.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించండి రోడ్లు వేస్తామని చెప్పారు. . టంగుటూరు మండలం జయవరంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. విజయనగరం జిల్లాలో పలుచోట్ల భోజనాలు పెట్టకపోవడంతో నిరాశ చెందారు. గుమ్మలక్ష్మీ పురం, గరివిడి, సీతానగరం మండలాల్లోనూ, గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామంలోనూ పింఛనుదార్లకు భోజనాలు పెట్టలేదు. మధ్యాహ్నం వరకూ పింఛన్లు పంపిణీ చేయడంతో భోజనాలు పెడతారని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. మరోవైపు స్వీట్లు పంపిణీ చేస్తామని చెప్పినా, గ్రూపు సభ్యులందరికీ కలిపి రెండు చిన్న ప్యాకెట్లు (కొద్దిగా మిక్చర్, ఒక స్వీటు) మాత్రమే ఇవ్వడంతో 'ఇంతేనా?' అంటూ పింఛనుదారులు చర్చించుకున్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు ఎన్‌టిఆర్‌నగర్ 11వడివిజన్‌లో వృద్ధాప్య, విభిన్న ప్రతిభావంతులు, వితంతువుల పింఛన్ల కోసం బాధితులు మూడు గంటలపాటు పడిగాపులు కాశారు. ఉదయం 9గంటల నుంచే శిబిరం వద్దకు చేరుకున్నా 12గంటల వరకూ ప్రారంభించలేదు. దాంతో కొందరు వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు. ఒకేసారి రూ.3వేలు ఇవ్వడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా పుట్లూరు, పెనుకొండ, బుక్కపట్నం మండలాల్లో ఎమ్మెల్యేలు ఆలస్యంగా వచ్చారు. దీంతో ఉదయం నుంచి పింఛనుదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. పుట్లూరులో ఎమ్మెల్యే యామినీబాలకు చుక్కెదురైంది. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. కర్నూలు జిల్లాలో ప్రతి సభకు తండోపతండాలుగా వచ్చారు. అయితే వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కర్నూలు ఉస్మానియా కళాశాలలో పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా ట్రాఫిక్ స్థంభించిపోయింది. విశాఖ జిల్లా గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో కొత్తవారికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేయడంతో పాతవారు ఇబ్బందులు పడ్డారు. పాత వారికి శనివారం ఇవ్వరన్న సమాచారం లేకపోవడంతో వారంతా సాయంత్రం వరకూ నిరీక్షించారు. భోజనాల్లేక వారంతా ఇబ్బందులు పడ్డారు.

పశ్చిమగోదావరి జిల్లాలో పలుచోట్ల వీటి పంపిణీ ఆలస్యం కావడంతో మహిళలు నానా అవస్థలు పడ్డారు. మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొన్న పెనుమంట్ర సభలో కొంత గందరగోళం నెలకొంది. ఇక్కడ చాలీచాలని ప్రదేశంలో చెక్కులను పంపిణీ చేయడంతో తోపులాట జరిగింది. ఈ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలందరూ రావాలని, లేకుంటే చెక్కులు రద్దవుతాయని టిడిపి నాయకులు బెదిరించారని తాళ్లపూడి మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పోడూరులో రాత్రి 7 గంటలైనా మంత్రి రాకపోవడంతో లబ్ధిదారులు వేచి చూస్తూనే ఉన్నారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడేనికి చెందిన పార్వతి స్పృహ తప్పిపడిపోయింది. ఉంగు టూరు మండలం నారాయణ పురంలో లబ్ధిదారులు కుర్చీలు లేక జరిగిన తొక్కిసలాటలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆచంట నియోజకవర్గం పోడూరు మండలంలో పింఛన్ల పంపిణీలో మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొనాల్సి ఉండగా రాత్రి ఏడు గంటలైనా రాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. జీలుగుమిల్లిలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభం కావడంతో వృద్ధురాలు మానేపల్లి సరోజిని సభాస్థలంలోనే సొమ్మసిల్లి పడిపోయింది.

తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం ఎకె మల్లవరం, వన్నెపూడి, తాటిపర్తి గ్రామాల్లో వందలాదిమంది పింఛనుదారులు పంపిణీ కార్యక్రమం దగ్గరికి చేరుకోవడంతో తోపులాట చేసుకుంది. పలువురు పింఛనుదారులు ఇబ్బందిపడ్డారు. లబ్ధిదారులకు రూ.10 నోట్లు, రూ.20 నోట్లు పంపిణీ చేయడంతో వృద్ధులు తమ చేతిలోని డబ్బులు పడేసుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. రెండు మూడు నోట్లు తక్కువ కూడా వచ్చిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మండపేటలో పింఛనుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చినా.. సౌకర్యాలు కల్పించలేదు. కొందరు మండుటెండలోనూ, మరికొందరు పాఠశాల, కళాశాల మెట్లపైనా కూర్చోవాల్సి వచ్చింది. జగ్గంపేట మండలం రామవరం, ఇర్రిపాక, మర్రిపాక, నరేంద్రపట్నం, మల్లిశాల, మామిడాడ గ్రామాల్లో పింఛన్ల కోసం వృద్ధులు గంటల తరబడి ఎదురుచూశారు. కుర్చీలను ఏర్పాటు చేయకపోవడంతో నేలపై కూర్చుని అవస్థలు పడ్డారు. రూ.5, రూపాయి కాయిన్లను అందించడంతో వాటిని లెక్కపెట్టుకునేందుకు అవస్థలు పడ్డారు. పలువురు చిల్లర సరిపోలేదంటూ వెనక్కి రావడంతో వాటిని లెక్కించి ఇచ్చేందుకు అధికారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులకు

కర్నూలులో టిడిపి,వైసిపిల మధ్య ఘర్షణ

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం అలారుదిన్నెలో శనివారం సాయంత్రం టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో రామాంజనేయులు అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. రెట్టింపు పింఛన్ల పంపిణీలో టిడిపి నాయకులు రూ.1000 వసూలు చేస్తున్నారని వైసిపి నాయకులు నిలదీయడంతో ఇరుగ్రూపుల మధ్య మాటకుమాట పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో వైసిపికి చెందిన ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ పీరయ్యను ప్రశ్నించగా గ్రామంలో ఇరువర్గాలను విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

చంద్రగిరిలో వైసిపి,టిడిపి బాహాబాహీ



చంద్రగిరిలో టిడిపి,వైసిపిల మధ్య ఘర్షణ

చిత్తూరు జిల్లా చంద్రగిరిలో వైసిపి ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు పసుపుకుంకుమ, జాకెట్లు ఇవ్వడానికి మరో షెల్టర్‌ను సిద్ధం చేశారు. అనుమతి తీసుకునే ఈ కార్యక్రమానికి వారు సిద్ధమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమానికి ఎదురుగా ప్రైవేట్ కార్యక్రమం ఎలా జరుపుతారని ప్రశ్నించడంతో వివాదం మొదలైంది. దీంతో ఎంపిడిఒ వెంకట నారాయణ, నోడల్ అధికారి లక్ష్మి, సిఐ ఈశ్వరయ్యలు ప్రైవేట్ కార్యక్రమాన్ని తొలగించాలని కోరారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకులు ససేమిరా అనడంతో టిడిపి నాయకులు వచ్చి షెల్టర్‌ను తొలగించేందుకు యత్నించారు. దీంతో ఇరు పార్టీల నేతలు బాహాబాహీకి దిగారు. ఒకరినొకరు పిడిగు ద్దులు గుద్దారు. పోటాపోటీగా నినాదాలు చేశారు. దీంతో డిఎస్‌పి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఇరు గ్రూపులను శాంతింపజేశారు. ఈ ఘర్షణలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌కు చెందిన ఒంటె శివశంకర్‌రెడ్డి కొంత అస్వస్థతకు గురయ్యారు. చెవిరెడ్డి పసుపు కుంకుమ షెల్టర్ ధ్వంసమైంది. అనంతరం చంద్రగిరి బాలుర కళాశాల ఆవరణలోనే వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ నాయకులు మహిళలకు పెద్దఎత్తున పసుపు కుంకుమ జాకెట్లను అందజేశారు. రాయలపురంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి, వైఎస్‌ఆర్ కార్యకర్తలు మరోసారి ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకులపై విరుచుకుపడ్డారు. సిఐ ఈశ్వరయ్య జోక్యం చేసుకోవడంతో కార్యకర్తలు పరుగులు తీశారు. ఎవరిని కొడుతున్నామో అని కూడా చూసుకోకుండా సిఐ ఈశ్వరయ్య కానిస్టేబుల్స్ ధనంజయనాయుడు, బాషా, పోలీసు డ్రైవర్ హేమలాల్, మరో ఇద్దరిపై లాఠీఛార్జీ చేశారు. వీరికి దెబ్బలు తగలడంతో బోరుమన్నారు.

ఆపదమొక్కుల బడ్జెట్

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్

వెంకటేశ్వర స్వామికి ఆపదమొక్కులు సమర్పించినట్లు మోడీ బడ్జెట్ ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. శనివారం కడప రహమతీయా ఫంక్షన్ ప్యాలెస్‌లో మాజీ ఎమ్మెల్యే ఎన్.శివరామిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో కార్పొరేట్లకు రూ.80 లక్షల కోట్లు అప్పనంగా ఇచ్చారని విమర్శించారు. రైతులు, పేద ప్రజలకు వరాలు ప్రకటించి కొంగజపం చేస్తుంటే నమ్మేవారు ఎవరూ లేరని పేర్కొన్నారు. బాబ్రీ మసీదును, శబరిమలై అంశాలను ఇతివృత్తంగా తీసుకుని బిజెపి అలజడులు సృష్టిస్తూ లౌకిక వ్యవస్థను దెబ్బతీస్తోందని విమర్శించారు. రైతులకు సరైన న్యాయం జరగాలంటే స్వామినాథన్ కమిషనర్ రిపోర్టును అమలు చేస్తే సరిపోతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై అసెంబ్లీలో నిరసన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, చిత్తూరు జిల్లా కార్యదర్శి రామానాయుడు పాల్గొన్నారు.

విభజనపై చర్చకు ఎంపీలంతా పట్టుపట్టాలి

రాష్ట్ర విభజన రాజ్యాంగ విరుద్ధం : ఉండవల్లి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర విభజన రాజ్యాంగ విరుద్ధమని దీనిపై ఐదేళ్లుగా ఒక్క ఎంపీ కూడా కేంద్రాన్ని నిలదీయలేక పోయారని, కొత్త లోక్‌సభలో విభజన తీరు, హామీల అమలుపై ఎంపీలంతా చర్చకు పట్టుపట్టాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాల్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల తర్వాత కొత్త లోక్‌సభ, అసెంబ్లీలో విభజనపై చర్చించాలని కోరేందుకే విజయ వాడలో వివిధ పార్టీల నేతలతో ఇటీవల సమావేశం నిర్వహించానన్నారు. లోక్‌సభలో తలుపులు మూసేసి, ప్రసారాలు ఆపేసి సంఖ్యాబలం లేకపోయినా బిజెపి మద్దతుతో రాష్ట్రాన్ని విభజించారన్నారు. అసెంబ్లీ తీర్మా నం, 9,072 సవరణ ప్రతిపా దనలపైనా లోక్‌సభలో చర్చ జరగలేదన్నారు. విభజన విషయంలో లోక్‌సభ తప్పు చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం బడ్జెట్ సందర్భంగా కేంద్రంపై నిప్పులు చెరిగారని, అదే పని రాష్ట్ర విభజన విషయంలో చేసి ఉంటే రాష్ట్రం విడిపోయేది కాదని ఎద్దేవ చేశారు. హైకోర్టు విభజన విషయంలోనూ రాజ్యాంగ నిబంధ నలు ఉల్లంఘిం చారని, రాష్ట్ర విభజన వల్ల రాజ్యాంగా నికి అవమానం జరిగిందని ఉద్ఘాటించారు. విభజన రాజ్యాంగ విరుద్ధ మని 130 మంది సుప్రీం కోర్టును ఆశ్రయించామని, ప్రస్తుతం తనతోపాటు ఐదుగురు మిగిలారని చెప్పారు. రాష్ట్రానికి మేలు జరిగేవరకూ పోరాడతానన్నారు. విభజనపై కోర్టును ఆశ్రయించాలని సిఎంను కోరానని, ఆయన ఒప్పుకున్నారని చెప్పారు. విభజన తీరుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఎన్నికల ముందు బడ్జెట్ పెట్టి ఓటర్లను ఆకర్షించే వరాలు ఇవ్వడం ఆ వరాలు వచ్చే ప్రభుత్వంలో నెరవేరుస్తామని చెప్పాడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికల ముందు బడ్జెట్ పెట్టకుండా చట్టం తేవాలన్నారు. తాను ఎన్నికల్లో పోటీ చేయనని, ఓటు వేస్తానని చెప్పారు.

4, 5 తేదీల్లో విశాఖలో జాబ్ ఫెయిర్

రాష్ట్ర ప్రభుత్వ చొరవతో జపాన్ కంపెనీల రాక

ప్రజాశక్తి- విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో దేశంలో తొలిసారిగా జపాన్‌లోని పలు కంపెనీలు విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 4, 5 తేదీలలో 'జపాన్ జాబ్ ఫెయిర్'ను నిర్వహిస్తున్నాయని గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కెవిజిడి.బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ విభాగం, లీప్ (లుక్ ఫర్ ఎంప్లాయిస్ ఇన్ ఆంధ్రప్రదేశ్) సంయుక్తంగా జపాన్ జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన టోక్యో ల్యాబ్, డెన్సో, ఎన్‌జపాన్ కంపెనీల నుంచి 13 మంది ప్రతినిధుల ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది ఇంజినీరింగ్ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రత్యేక పోర్టల్ ద్వారా ఇప్పటికే తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. రిజిస్టర్ చేయించుకున్న 300 మంది విద్యార్థులకు గీతంలో ప్రాథమిక ఎంపికకు సంబంధించిన ఇంటర్వ్యూలను జపాన్ జాబ్‌ఫెయిర్‌లో నిర్వహిస్తారని, ఎంపికైన వారికి రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వార్షిక వేతనం లభించే అవకాశముందని తెలిపారు. ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, యుఐ, యుఎక్స్ డెవలపర్ వంటి నైపుణ్యాలకు ఈ ఎంపిక జరుగుతోందని వివరించారు. గ్లోబల్ ఎస్సెట్ కమ్యూనిటీ సైతం భవిష్యత్తులో తన నియామకాలను చేపట్టడానికి జపాన్ జాబ్ ఫెయిర్‌లో పాల్గొంటోందని తెలిపారు.

బిసిలపై చంద్రబాబు కపట ప్రేమ

బిసి చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి

ప్రజాశక్తి- భవానీపురం (విజయవాడ)

జయహో బిసి సభల పేరుతో బిసిలపై చంద్రబాబు కపట ప్రేమ చూపుతున్నారని బిసి చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ విమర్శించారు. శనివారం కొత్తపేటలోని కొరగంజి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి అన్ని విధాలుగా బీసీల వెన్ను విరిచిన చంద్రబాబు ఇప్పుడు బీసీల జపం చేయడం కేవలం ఓట్ల కోసమేనని అన్నారు. బిసిల ప్రభుత్వమని చెప్పుకుంటున్న చంద్రబాబు ఐదు రాజ్యసభ సీట్లలో ఒక్కటి కూడా బిసిలకు ఇవ్వలేదని, గతంలో ఇచ్చిన రెండు కేంద్ర మంత్రి పదవుల్లో ఒక్కటి కూడా బిసిలకు ఇవ్వలేదని విమర్శించారు. అలాగే శాసనసభ స్థానాలను జనాభా ప్రకారం కేటాయిస్తామని చెప్పి మొండిచేయి చూపించారన్నారు. మళ్లీ తనను గెలిపిస్తే బీసీలను ఉద్ధరిస్తానని చంద్రబాబు మొసలికన్నీరు కారుస్తున్నారని అన్నారు. సమావేశంలో బిసి చైతన్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు రమణయ్య, కార్యదర్శి బండి ఆదికృష్ణ పాల్గొన్నారు.

10న గుంటూరులో మోడీ పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 10న గుంటూరులో, 16న విశాఖపట్నంలో పర్యటిస్తారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మోడీ పర్యటన ఏర్పాట్లు, విజయవంతం కోసం బిజెపి రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులతో శనివారం గుంటూరులో అత్యవసరంగా సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మోడీ పర్యటనను ఆపుతామని చంద్రబాబు అంటున్నారని, ఈ లోపే టిడిపి అవినీతి, వెన్నుపోట్లను రాష్ట్ర ప్రజలకు వివరిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే మరోవైపు మోడీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. గుంటూరులో జరిగే సభలో మోడీ రాష్ట్రంలో అవినీతిపై గళం విప్పుతారని చెప్పారు.

వడ్డీ రాయితీలకు బ్రేక్!

రెండేళ్లుగా బకాయిలు పెండింగ్

అప్పుల బారిన డ్వాక్రా సంఘాలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రెండేళ్లుగా వడ్డీ రాయితీని విడుదల చేయకపోవడంతో డ్వాక్రా మహిళలు అప్పుల బారిన పడుతున్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని సర్కారు చెప్తున్న దానికి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న దానికి పొంతన లేకుండా పోతోంది. బ్యాంకులకు వడ్డీతో సకాలంలో రుణాన్ని చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీని 2016 ఏప్రిల్ నుంచి విడుదల చేయలేదు.



విజయనగరం జిల్లా జామి మండల కేంద్రానికి చెందిన ఇందిరా మహిళా పొదుపు సంఘం స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ నుంచి 2016 ఆగస్టు 30న రూ.3.50 లక్షల రుణం తీసుకుంది. 2018 డిసెంబర్ ఆఖరికి అప్పును వడ్డీతో సహా సకాలంలో చెల్లించింది. ఈ క్రమంలోనే బ్యాంకు వారి నుంచి రూ.58,768 వడ్డీని వసూలు చేసింది. సకాలంలో చెల్లించిన వాయిదాలకు సంబంధించి రూ.46,500 ప్రభుత్వం నుంచి ఆ సంఘానికి జమ కావాల్సి ఉంది. నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. మరోవైపు దేవీ స్వరూప సంఘానికి 2017 జూన్‌లో రూ.ఐదు లక్షల రుణం మంజూరైంది. ఏడాదిన్నరగా 14 శాతం వడ్డీతో సహా సకాలంలో రూ.78 వేలను చెల్లించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.71,230 రావాల్సి ఉంది. ఇంతవరకూ ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఇలా ఒక్క జామి మండలంలోనే 1,500కు పైగా సంఘాలు వడ్డీ రాయితీ కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాయి.

విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లో 40,601 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 4,47,485 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. గ్రామీణ వికాస్ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంకు ద్వారా లింకేజీ రుణాలు ప్రభుత్వం వీరికి అందిస్తోంది. రూ.రెండు లక్షల రుణం తీసుకుంటే 36 నెలల్లోనూ, ఆపైన ఎంత తీసుకున్నా ఐదు సంవత్సరాల్లోనూ రుణం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం వీటిని వడ్డీలేని రుణాలుగా చెబుతున్నా, బ్యాంకులకు మాత్రం డ్వాక్రా సంఘాలు వడ్డీతోనే రుణం చెల్లించాల్సి వస్తోంది. గ్రామీణ బ్యాంకుల్లో 13.5 శాతం, స్టేట్ బ్యాంకుల్లో 14 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. గడువులోగా రుణ వాయిదా చెల్లించిన సంఘానికి కేంద్ర ప్రభుత్వం ఏడు శాతం, రాష్ట్ర ప్రభుత్వం ఏడు శాతం కలిపి మొత్తం 14 శాతం వడ్డీ రాయితీని ఆయా సంఘాల ఖాతాలకు జమ చేయాలి. రాయితీకి అర్హత సాధించాలంటే ప్రతి నెలా పదో తేదీలోపు బ్యాంకు వాయిదాను వడ్డీతో సహా చెల్లించాలి. అత్యధిక సంఘాలు సకాలంలో చెల్లించలేక రాయితీని కోల్పోతున్నాయి. సకాలంలో చెల్లించిన వాటికి సైతం ప్రభుత్వం సుమారు రెండేళ్లుగా వడ్డీ రాయితీని విడుదల చేయలేదు. జిల్లాలోని డ్వాక్రా సంఘాలకు 2015-16లో 18.27 కోట్లు, 2016-17లో 14.92 కోట్లు వడ్డీ రాయితీ విడుదలైంది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల సంబంధించి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. డ్వాక్రా సంఘాలకు దాదాపు రూ.20 కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్లు సమాచారం.

వడ్డీలు చెల్లించలేకపోతున్నాం



బ్యాంకు రుణాలు మంజూరవుతున్నా, రాయితీలు రాకపోవడంతో బ్యాంకులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం వడ్డీ రాయితీని చెల్లిస్తేనే, మహిళలకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం వెంటనే వడ్డీ రాయితీ సొమ్మును మా ఖాతాల్లో జమ చేయాలి.

-ఎం.కృష్ణవేణి, డ్వాక్రా సభ్యురాలు, జామి

వడ్డీ లేని రుణాలు బూటకం



ప్రభుత్వం చెబుతున్న వడ్డీ లేని రుణాలు ఒట్టి బూటకం. టిడిపి అధికారంలోకొచ్చాక మా గ్రూపునకు రాయితీ అందలేదు. బ్యాంకుకు రుణ వాయిదాలు సకాలంలో చెల్లించేందుకు అష్టకష్టాలు పడుతున్నాం.

-కొట్యాడ చిన్నమ్మలు,
డ్వాక్రా సభ్యురాలు, మాధవరాయమెట్ట

త్వరలో విడుదలవుతాయి

వడ్డీలేని రాయితీ ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఐదేళ్లలో సుమారు రూ.33 కోట్లు విడుదలయ్యాయి. త్వరలో ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ విడుదలయ్యే అవకాశాలున్నాయి.

-కె.సుబ్బారావు,
డిఆర్‌డిఎ పిడి, విజయనగరం

ఎల్‌టిఆర్ భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-జంగారెడ్డిగూడెం

ఎల్‌టిఆర్, 1/70, ల్యాండ్ సీలింగు భూములను పేదలకు పంచాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు.

సంపాదకీయం

సత్యమేవ జయతే

'సత్యమేవ జయతే' అంటే... నిజం మాత్రమే గెలుస్తుంది అని అర్థం. నిజం నిప్పు లాంటిది... పట్టుకుంటే కాలుతుంది. అబద్ధం అప్పు లాంటిది.. చెప్పే కొద్దీ పెరుగుతుంది. కనుకనే 'ఇజము నెరిగిన వాడు/ నిజము చెప్పని నాడు/ ప్రజకు జరుగును కీడు' అంటాడు ఆరుద్ర. నిజం కఠినంగా వున్నా వాస్తవానికి దగ్గరగా ఉంటుంది. ఒక్కోసారి నిజాన్ని పూర్తిగా గ్రహించలేక దానికి దూరంగా ఉండిపోతామనే 'నిజము నిలువని నీడ/ నీతి యన్నది చూడ/ గాజు పెంకుల గోడ' అంటాడాయన. నిజం ఎప్పటికీ నిదురపోదు. సముద్రంలో కలిసే నదిలా అది పారుతునే వుంటుంది. నిజం తెలిసాక ఒక్కసారిగా స్థబ్ధుగా ఉంటుంది. అది తుఫానుకు ముందు ప్రశాంతత కావచ్చు... నిజాన్ని భరించలేనిమౌనం కావచ్చు. 'నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు, తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల' అని వేమన చెప్పినట్లుగా నిజం నిగారింపు తెలియాలంటే- అది బయటపడి తన గౌరవం తగ్గిపోయినా ఫర్లేదనుకునే ధైర్యవంతుల త్యాగాల ద్వారానే ప్రభవిస్తుంది.

అయినదానికి, కానిదానికి అబద్దాలు చెబుతుంటారు కొందరు. ఇలాంటివారి నుద్దేశించే ఆదికవి నన్నయ్య సత్యం గురించి చెబుతూ- 'నూరు బావుల కంటే ఒక దిగుడు బావి మేలు, నూరు దిగుడు బావులకంటే ఒక యజ్ఞం మేలు, నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు మేలు, నూరుమంది పుత్రులకంటే ఒక సత్యవాక్యం మేలు' అంటాడు. సత్యానికి నిదర్శంగా సత్యాన్ని ఆచరించి మహాత్ములైన హరిశ్చంద్రుడు, గాంధీజీ వంటివారిని ఉదహరించడం పరిపాటే. 'ప్రతివాడూ తన నిజస్వరూపం ఎవరో వొకరి ముందు బయట పెడతాడు' అని 'చివరకు మిగిలేది'లో బుచ్చిబాబు అంటాడు. అయితే, ఇప్పటి పాలకులు ఎవరోకరి ముందేకాదు... బాహాటంగానే ప్రజలందరి ముందూ తమ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. అమలుకాని వాగ్దానాలతో అరచేతిలో వైకుంఠం చూపుతున్నారు. 'లోకంలో మనుషులు తమ అవసరాలను బట్టి గోరంతలు కొండంతలు చేస్తారు. కొండంతలు గోరంతలూ చేయవచ్చు. అంతమాత్రాన వాటి నిజస్వరూపం అదే అనుకొని భ్రమపడటం తెలివి తక్కువ' అని ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు 'అభిమానాలు' నవలలో వ్యాఖ్యానించినట్లుగా- అమరావతిలో ప్లాట్లు డెవలప్ అయ్యాయని అనుకున్నా, కియో కార్లు ఎపీలో తయారయ్యాయని భ్రమపడినా, ఆంధ్రప్రదేశ్ అంతా అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని నమ్మేసినా అంతే తెలివి తక్కువ. జనాలు ఒక్కోసారి ప్రచారార్భాటంలో పడి కొన్ని విషయాలను ప్రశ్నించనంత మాత్రాన అబద్ధం నిజమైపోదు. ముస్లింలు తమకు శత్రువులు కాదని ప్రకటిస్తే ఆ ప్రకటన నిజమౌతుందా? ఒకపక్క గో గూండాల దాడులను, మందిర్ నినాదాలను సమర్థిస్తూ, ఒక మతానికి చెందిన కాందిశీకులకే పౌరసత్వ హక్కు కల్పిస్తూ, ఇంకోపక్క ప్రకటనల్లో మాత్రం దళితులు, మహిళలు అందరితో సమానమేనని చెప్తే అది నిజం అనిపించుకుంటుందా? గణాంకాల జిమ్మిక్కులతో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందని, అదే నిజమని పాలకులు చెప్తున్నా ఈ దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం, మతతత్వం ఊడలువేసిందన్నదే పచ్చినిజం. ఇది హిందూరాజ్యం అని ఎందరు గొంతు చించుకున్నా భారతదేశం లౌకికవాద దేశం అన్నదే అసలు సత్యం.

అయితే, కుందుర్తి చెప్పినట్లుగా- 'నిజం నిజంగానే భాసించదు/ నీవనే రిక్షాలో ఎక్కి/ ముసుగేసుకుంటుంది ఘోషాసుందరి'. ఈ ఘోషాసుందరి ముసుగు తొలగిస్తేనే గోరంతలను కొండంతలు చేస్తున్న వైనం కళ్లకు కడుతుంది. నిజాన్ని, సత్యాన్ని బైట పెట్టలేని భయం సగటు మనిషిలో ఉన్నంతకాలం అబద్ధం రాజ్యం ఏలుతూనే వుంటుంది. 'ఇతిహాసపు చీకటికోణం/ అట్టడుగున పడి కాన్పించని/ కథలన్నీ కావాలిప్పుడు!/ దాచేస్తే దాగని సత్యం' అని మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లుగా... నిజాన్ని నిబ్బరంగా నిర్భయంగా వెలికి తీయాలి. వైజ్ఞానిక రంగం అందించిన సమస్త సాధనాల్ని నిత్యజీవితంలో వాడుకుంటూనే వున్నాం. ఉదయం నుంచీ రాత్రి పడుకునే వరకు కంప్యూటర్, ఇంటర్నెట్, మొబైల్, సోషల్‌మీడియా వంటి సాధనాల్ని ఉపయోగిస్తూనే వున్నాం. విద్యుత్ ఉపకరణాలు లేక జీవితం క్షణం గడవదు. వైద్యరంగంలోని వినూత్న ఆవిష్కరణలతో జీవితకాలాన్ని పెంచుకుంటున్నాం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని సరికొత్త ఆవిష్కరణల ఫలాలను అనుభవిస్తున్నాం. ఇవన్నీ సత్యాలు. విజ్ఞాన ఫలితాల్ని అనుభవిస్తూనే ఆ విజ్ఞానానికి మూలమైన కార్యకారణ సంబంధమనే సూత్రాన్ని, నిక్కమైన నిజాన్ని అంగీకరించలేకపోవడం ఓ బలహీనత. 'ఒకానొక దినాన/ నాదేశపు విరాజకీయ మేధావుల్ని/ నిలవేసి ప్రశ్నిస్తారు/ అమాయకులైన అలగాజనం/ ఏం చేస్తున్నారు మీరు/ మనదేశం నింపాదిగా తీయ్యని మంటలాగా/ చిన్నగా ఒంటరిగా మరణిస్తున్నప్పుడని' ఒక అనువాదంలో శ్రీశ్రీ చెప్పినట్లుగా- భౌతిక ప్రపంచంలోని సమస్త కార్యకలాపాలకు మానవుడే కర్త అన్నది నగ్నసత్యం. ఏ దివ్యశక్తులూ ఎవరికీ కొత్త బతుకును ప్రసాదించలేవన్నదీ నిజ్జంగా నిజం. ఈ భావనను జనాల్లో ప్రోది చేయాలి. అప్పుడే కనిపించని దేవుళ్ళ నుంచి, కనికట్టు చేసే బాబాలనుంచి, అభివృద్ధి నిరోధకులైన పాలకుల అసత్యాల నుంచి ఈ దేశాన్ని, ప్రజల్ని కాపాడుకోగలం.

ఇది విషయం



అబద్ధాల వాడలో
దొంగ చరిత్ర నీడలో
పుక్కిటి పురాణాల మేడలో
జాతి సంస్కృతిని పెంచుతూ వుంది
నాగరికతను తయారు చేస్తూ వుంది
ఈ చరిత్ర మురికిబట్టను
ఉతికి ఆరేయాలి
ఈ పురాణ విష వృక్షం
నరికి పారేయాలి

- డా. కొలకలూరి ఇనాక్

మోడీ బడ్జెట్ మాయాజాలం


విశ్లేషణ

ఉన్నది లేనట్లూ, లేనిది ఉన్నట్లూ మాయ చేయడంతో బిజెపిని మించిన పార్టీ దేశంలో మరేదీ లేదు. ఇదే మాయ తాజాగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కూడా కనిపిస్తోంది. కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంటులో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెడుతున్నంతసేపూ ఆయన రైతుల మీద, మధ్య తరగతి ఉద్యోగుల మీద, అసంఘటిత కార్మికుల మీద, మహిళల మీద వరాల జల్లులు కురిపిస్తున్నట్లు ప్రసార మాధ్యమాలు ఊదరగొట్టాయి. తీరా బడ్జెట్ మొత్తం పరిశీలించిన తరువాత ఈ బడ్జెట్ ఎంతటి మాయా బజారో అర్థమవుతోంది. బడ్జెట్‌లో ఆదాయ వ్యయాలు చూపించడంలో మాయ, ప్రకటించిన పథకాల్లో మాయ, అసలు బడ్జెట్ ప్రవేశ పెట్టిన పద్ధతే పూర్తి మాయ. ఎన్నికల ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలను ఎలాంటి మాయలో పడేయడానికి ప్రయత్నిం చిందో పరిశీలిద్దాం:

సాధారణంగా ప్రభుత్వం ప్రజలకు వరాలిస్తే కార్పొరేట్ రంగం ఊరుకోదు. ఎందుకంటే బడ్జెట్‌లో వాటి వాటా తగ్గిపోతుంది. కానీ నిన్న బడ్జెట్ రాగానే స్టాక్ మార్కెట్ పెరిగిపోయిందంటేనే దానిపట్ల కార్పొరేట్ రంగం ఎంత ఆనందంగా ఉందో తెలుస్తుంది. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు గాలికి వదిలి ఈ అయిదేళ్లూ విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు సేవలో మునిగిపోయిన బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు మళ్లీ అవే తప్పుడు వాగ్దానాలు, మాయా పథకాలతో మభ్యపుచ్చడానికి ప్రయత్నిస్తోంది. మతం పేరుతో ఓట్లు గుంజడానికి కుట్రలు చేస్తోంది. తస్మాత్ జాగ్రత్త!



ఈనాడు దేశం ఎదుర్కొంటున్న రెండు తీవ్రమైన సమస్యలు 1. వ్యవసాయ సంక్షోభం, 2 నిరుద్యోగ సమస్య. నయా-ఉదారవాద విధానాలను నిండా నెత్తికెత్తుకున్న మోడీ ప్రభుత్వం దగ్గర ఈ సమస్యలకు పరిష్కారం లేదు గనుకనే జిమ్మిక్కులతోనూ, తంత్రాలతోనూ ప్రజలను మభ్యపుచ్చడానికి పూనుకున్నది.



ఎస్ వెంకట్రావు

మాయ నెం 1 : రైతులకు రూ.6000 మూడు దఫాలుగా నేరుగా వారి బ్యాంకుల్లో వేయడం. అయిదెకరాల్లోపు రైతులకు ఏడాదికి రూ.6000 ఇస్తున్నారు. అంటే నెలకు రూ.500. రోజుకు రూ.17. అయిదుగురున్న కుటుంబంలో ఒక్కొక్కరికీ ఈ పథకం ద్వారా కేంద్రం రోజుకు రూ.3.50 పైసలు ఇస్తుం దన్నమాట. రైతుల శ్రమనంతటినీ కార్పొరేట్లకు దోచిపెట్టి, మరోవైపు వారికి పావలా ఇచ్చి పరమాన్నం తినమన్నట్లుంది తంతు. వాస్తవానికి ఈ కాలంలో రైతులు ఉపయోగించే డీజిల్ ధరలను ప్రభుత్వం ఇంతకన్నా ఎక్కువ పెంచేసింది. ఇతర వస్తువుల ధరలు సరేసరి. ఈ పథకాన్ని కూడా 2018 డిసెంబర్ 1 నుండి అంటే కొత్త బడ్జెట్‌లో కాకుండా ప్రస్తుత (2018-19) బడ్జెట్‌లో అమలు జరుపుతానంటోంది. 2019-20 బడ్జెట్ ప్రవేశ పెడుతూ 2018-19లో కేటాయింపులేంటి? ఇదొక జుమ్లా (మాయ). కొత్త బడ్జెట్‌లో కేటాయిస్తే నిధులను ఏప్రిల్ తరువాత విడుదల చేయాలి. అంటే రైతులకు చెక్కులు ఏప్రిల్ తరువాత ఇవ్వాల్సి వస్తుంది. అప్పటికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే స్తుంది గనుక ఇవ్వడానికి లేదు. అంటే ఎన్నికల కోడ్‌ను తప్పుకోడానికి బిజెపి ప్రభుత్వం ఆడుతున్న మాయా నాటకమన్న మాట ఇది. ప్రస్తుత బడ్జెట్‌లోనైనా ఈ పథకానికి కేటాయించిన నిధులు రూ.20,000 కోట్లు చూపించారా అంటే అదీ లేదు. 2018-19 మొత్తం ఖర్చుల రివైజ్డ్ అంచనాల్లో ఈ మేరకు పెంచినట్లు లేదు. ఇదొక మాయ.

మాయ నెం 2 : అసంఘటిత రంగ కార్మికులకు 'ప్రధాన మంత్రి శ్రమ-యోగి మాన్‌ధాన్' పథకం కింద 60 ఏళ్లు నిండిన వారికి రూ. 3,000 పింఛన్ ఇస్తామంటున్నారు. ఇదో పెద్ద మాయ. దీని కింద ఏడాదికి 18 ఏళ్లు నిండిన వారు రూ.55, 29 ఏళ్లు నిండిన వాళ్లు రూ. 100 చెల్లిస్తే వారికి 60 ఏళ్లు దాటిన తరువాత రూ. 3000 పింఛన్ ఇస్తారట. 10 కోట్ల మంది కార్మికులు ఈ పథకంలోకి వస్తారంటున్నారు. నెలకు రూ.15,000 ఆదాయం లోపు వారికే ఇది వర్తిస్తుంది. ఈ పథకం కింద ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు. కానీ 10 కోట్ల మంది ఏడాదికి రూ.100 చెల్లిస్తే ప్రభుత్వానికి రూ.1000 కోట్లు చేరుతుంది. అంటే కార్మికుల దగ్గర రూ.1000 కోట్లు కొట్టేసి వారికి రూ.500 కోట్లు ఇస్తుందన్నమాట. ఇదో దోపిడీ. ప్రతి ఏడాదీ ఇలా కట్టుకుంటూ పోతే 60 వయస్సు వచ్చిన తరువాత వారికి ఏడాదికి రూ.3000 వేలు పింఛన్ ఇస్తుంది. 30 ఏళ్ల కార్మికునికి 60 ఏళ్ల వయసు రావడం అంటే 30 ఏళ్ల తరువాత అన్నమాట. 30 ఏళ్లలో వస్తువుల ధరలెలా పెరుగుతాయో, రూపాయి విలువ ఎంత పడిపోతుందో మనకు తెలియందేమీ కాదు. అప్పుడు అసంఘటిత కార్మికులకు వచ్చే పింఛన్ ఒక పూట భోజనానికైనా సరిపోతుందా?

మాయ నెం 3 : మధ్య తరగతి ఉద్యోగులకు పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.5 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచడం. ఉన్నంతలో ఇది కొంత ఊరట ఇచ్చేట్లు కనిపిస్తోంది. కానీ ఇందులో కూడా కొంత మాయ ఉంది. ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో పన్ను స్లాబుల్లో ఏ మార్పూ చేయలేదు. ఆదాయపన్ను రిబేటు సీలింగ్‌ను రూ. 3.5 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచుతూ ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 87ఎ ను సవరిస్తామని చెప్పారు. అంటే 80సి, 80డి వంటి సెక్షన్ల కింద పన్ను రాయితీలు పోను, మిగిలిన పన్ను చెల్లించాల్సిన ఆదాయం రూ.5 లక్షల లోపు ఉంటే రూ.12,500 పన్ను రిబేటు పొందుతారు. ఆదాయం ఒక్క రూపాయి పెరిగినా వారికి ఈ రిబేటు వర్తించదు. సరే వారికైనా, ఆ మాత్రం రిబేటైనా వచ్చింది కదా అనుకోవచ్చు. కానీ మూడేళ్ల నుండి పన్ను పరిమితి పెంచాలని ఎదురు చూసిన ఉద్యోగులకు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోడీ ప్రభుత్వం ఇచ్చిన ఆపద మొక్కుల 'వరం' ఇది. కేంద్ర ప్రభుత్వం నిజంగానే ఉద్యోగులకు మేలు చేయాలనుకుంటే ఆదాయ పరిమితిని ఇంకా పెంచాలి. ఆర్థికంగా వెనుకబడిన (ఇబిసి) వారి వార్షిక ఆదాయపరిమితి రూ.8 లక్షలు దాటకూడదని కేంద్రం చెబుతోంది. అంటే రూ.8 లక్షల వరకు ఆదాయం వచ్చే వారిని పేదవారుగా పరిగణిస్తున్నప్పుడు ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం వచ్చే ఉద్యోగులను పన్ను కట్టమనడం ఏం ధర్మం?


మాయ నెం 4 : కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం చూపించిన ఆదాయ వ్యయాల లెక్కలన్నీ పెద్ద మాయ. గత ఆర్థిక సంవత్సరంలో (2017-18) ప్రభుత్వానికి రూ.21,41,975 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది (2018-19) రూ.24,57, 235 కోట్ల ఆదాయం వస్తుందని అంచనాలు పెంచి చూపించారు. వచ్చే ఏడాదికి (2019-20) రూ.27,84,200 కోట్లు ఆదాయం లక్ష్యంగా చూపించారు. ఒక పక్క గత రెండేళ్లలో మన ఆర్థిక వ్యవస్థ దివాళా తీసి ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో పెద్దగా మార్పు లేదని గణాంకాలు తెలుపుతున్నాయి. మరి బడ్జెట్‌లో ఆదాయాలు పెంచి చూపించడం మాయ కాక మరేమిటి. ఉదాహరణకు, దిగుమతుల ద్వారా మనకు వచ్చిన ఆదాయం 2017-18లో 1.28 లక్షల కోట్లయితే 2018-19లో 1.26 లక్షల కోట్లకు స్వల్పంగా తగ్గింది. ఎక్సైజ్ సుంకాల ద్వారా ఆదాయం 2017-18లో 2.58 లక్షల కోట్లయితే 2018-19లో 2.59 లక్షల కోట్లు. వచ్చే ఏడాది కూడా ఈ ఆదాయం ఇంతకన్నా పెరగదని అంచనా వేశారు. ఇక కేంద్రానికి వచ్చే మరో ఆదాయ మార్గం ప్రజల మీద వేసే పరోక్ష పన్నులు, వేతన జీవుల మీద, కార్పొరేట్ల మీద వేసే ప్రత్యక్ష పన్నులు. గత మూడేళ్లలో కార్పొరేట్లకు లాభాల మీద లాభాలు పెరుగుతున్నా వారి నుండి వస్తున్న పన్నుల్లో తేడా లేదు. కార్పొరేట్లకు ప్రభుత్వం విపరీతమైన రాయితీలు ఇస్తుండడమే దీనికి కారణం. ఇక వేతన జీవుల నుండి వచ్చే పన్నులు పెరిగే అవకాశం లేదు. ఎందుకంటే వారి పన్ను పరిధిని రూ.2.5 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచుతున్నారు గనుక పన్ను పరిధి నుండి తప్పుకునే వారి సంఖ్య పెరుగుతుంది. ప్రజల మీద వేసే పరోక్ష పన్నులను బడ్జెట్‌లో పెంచలేదు గనుక ఏ విధంగా చూసినా రానున్న సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయం పెరగదు. ఇది మన ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని సూచిస్తోంది. పరిస్థితి ఇలా ఉంటే ఆదాయం ఇబ్బిడి ముబ్బిడిగా పెరుగుతున్నట్లు చూపించడం మాయల్లో కెల్లా పెద్ద మాయ.

మాయ నెం 5 : ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యంతో ఉన్నందున తాత్కాలిక ఆర్థిక మంత్రి ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒక ప్రభుత్వం ఒక పార్లమెంటు కాలంలో అయిదు బడ్జెట్లు మాత్రమే ప్రవేశపెట్టాలి. తరువాతి బడ్జెట్ ఎన్నికల వరకు ప్రభుత్వం నడవడానికి మాత్రమే ప్రవేశపెట్టాలి. కానీ ఎన్నడూ లేనిది మోడీ ప్రభుత్వం వచ్చే ఏడాది మొత్తానికి బడ్జెట్ కేటాయింపులు చేసింది. అంటే రానున్న ప్రభుత్వం చేయాల్సిన పనిని ఇది చేసేసిందన్న మాట. ఇదొక మాయ అయితే, రానున్న ఏడాదిలో అమలు చేసే 'ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' కి ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించడం మరో మాయ.

నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇన్ని మాయలకూ, మోసాలకూ ఎందుకు పాల్పడుతోంది? ఎన్నికలంటే దానికి భయం పట్టుకుంది కనుక. ఈనాడు దేశం ఎదుర్కొంటున్న రెండు తీవ్రమైన సమస్యలు 1. వ్యవసాయ సంక్షోభం, 2 నిరుద్యోగ సమస్య. నయా-ఉదారవాద విధానాలను నిండా నెత్తికెత్తుకున్న మోడీ ప్రభుత్వం దగ్గర ఈ సమస్యలకు పరిష్కారం లేదు గనుకనే జిమ్మిక్కులతోనూ, తంత్రాలతోనూ ప్రజలను మభ్యపుచ్చడానికి పూనుకున్నది. సాధారణంగా ప్రభుత్వం ప్రజలకు వరాలిస్తే కార్పొరేట్ రంగం ఊరుకోదు. ఎందుకంటే బడ్జెట్‌లో వాటి వాటా తగ్గిపోతుంది. కానీ నిన్న బడ్జెట్ రాగానే స్టాక్ మార్కెట్ పెరిగి పోయిందంటేనే దానిపట్ల కార్పొరేట్ రంగం ఎంత ఆనందంగా ఉందో తెలుస్తుంది. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు గాలికి వదిలి ఈ అయిదేళ్లూ విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు సేవలో మునిగిపోయిన బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు మళ్లీ అవే తప్పుడు వాగ్దానాలు, మాయా పథకాలతో మభ్యపుచ్చడానికి ప్రయత్నిస్తోంది. మతం పేరుతో ఓట్లు గుంజడానికి కుట్రలు చేస్తోంది. తస్మాత్ జాగ్రత్త!

సోషల్ మీడియా

చిత్తశుద్ధి లేమి



కుంభమేళాకు రూ.4,236 కోట్లు




ఒక్క విగ్రహానికి రూ.3000 కోట్లు



రూ. 280 కోట్లు లేక పసిపిల్లల పోలియో వాక్సిన్‌కు కొరత
ఇదీ పసిపిల్లల ఆరోగ్యం పట్ల పాలకుల చిత్తశుద్ధి.

ప్రజా ధనం దుర్వినియోగం



మోడీ అధికారంలోకి వచ్చాక ప్రచారానికి ఖర్చు చేసింది - రూ.5,245 కోట్లు

విదేశీ యానానికి ఖర్చు చేసింది - రూ.1,484 కోట్లు

విగ్రహాలకు ఖర్చు చేసింది - రూ.6,489 కోట్లు

రాఫెల్ కుంభకోణంలో అంబానీలకు దోచిపెట్టింది - రూ.36 వేల కోట్లు

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

అభిప్రాయం

పాలకుల అవాకులు చెవాకులు

నిన్న 'నేను వేసిన రోడ్ల మీద నడుస్తున్నారు కాబట్టి నాకు ఓటు వేయండి అన్నారు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. నేడు '100 యూనిట్లు ఫ్రీ గా తీసుకుంటున్నారు, మీ ఆవిడ రూ.పది వేలు... మీ అమ్మ రూ.మూడు వేలు... మాకు కాక ఎవరికి ఓటు వేస్తారు అంటున్నారు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి అచ్చం నాయుడు. పథకాలు ప్రభుత్వాలు పెట్టొచ్చు కానీ అది ప్రజాధనం అన్న జ్ఞానం కూడా లేకుండా ప్రజలను వాళ్ల ఇష్టం వచ్చినట్లు నానా మాటలు అనటానికి హక్కు ఎవరిచ్చారు? ఇంటికి పన్ను, నీటికి పన్ను, ప్రతి వస్తువుకు పన్ను చెల్లిస్తున్నాం. ఇది చాలదన్నట్లు పసుపు కుంకాలుకు రూ.పది వేలు ఇస్తానని చెప్పి ఆ పసుపు కుంకాలు తుడిచేందుకు మద్యం ఏరులై పారిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. మగవాళ్ళ ఆదాయమంతా మద్యం షాపుల పాలుచేస్తోంది. ఈ ఆదాయమంతా ఎవరి సొమ్ము? ప్రజలది కాదా! ప్రజల ధనంతో ప్రభుత్వ ఖజానా నింపుతూ ఆ ప్రభుత్వం ప్రజలకు పడేసే ముష్టి ఈ పథకాలు. గత ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అది మాఫీ చేయడానికి చుక్కలు చూపించి, నేడు ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగా మరో 10 వేలు ఇస్తాను అంటున్నారు. నిజానికి డ్వాక్రా మహిళల డబ్బులు 18 వేల కోట్ల రూపాయలు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. వారి డబ్బును వారు తీసుకునే అవకాశం లేకుండా ఉంది. ఈ 18 వేల కోట్ల రూపాయల పొదుపు సొమ్ము ఏం అవుతున్నట్లు? వాటిపై వచ్చే వడ్డీ ఎవరికి చెందుతున్నట్లు అని డ్వాక్రా మహిళలు ప్రశ్నిస్తే దానికి సమాధానం చంద్రబాబు నాయుడు దగ్గర గాని అచ్చం నాయుడు దగ్గర గాని ఉందా? వారి డబ్బులనే వారికి ఇస్తూ, ఏదో అప్పనంగా ఇస్తున్నట్లు మాట్లాడుతున్నారు. ప్రజల గోళ్లూడగొట్టి వసూలు చేసిన పన్నులే ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం. ఆ సొమ్మునే నేడు ఆ ప్రజలకే తిరిగి పంచుతూ తనకే ఓట్లు వేసి తీరాలని దబాయిస్తున్నారు మన ముఖ్యమంత్రి. ఈ నాలుగున్నరేళ్ల పాలనా కాలంలో గుర్తుకు రాని పెన్షన్లు రూ.రెండు వేలకు పెంచాలని ఎందుకనిపించిందో? ఓట్ల కోసం నాటకాలు ఆడుతూ, అదేదో వారిని ఉద్ధరించే కార్యక్రమంగా చెప్పుకుంటూ అవమానిస్తున్నారు. చివరకు మంత్రులు, ముఖ్యమంత్రులు తీసుకుంటున్న వేతనాలు, అనుభవిస్తున్న సౌకర్యాలు ప్రజా ధనమే అన్న విషయాన్ని మరిచిపోతున్న అహంకారపూరిత ఈ పాలకులకు సమాధానం చెప్పే రోజు దగ్గర పడింది.


జి ప్రియాంక.

విశ్లేషణ

ఎంవిఎస్ శర్మ

జనసేన-లెఫ్ట్ కూటమి లేవనెత్తిన ప్రజా సమస్యలు

'అభివృద్ధి' అంటే ప్రజల జీవితాలలో వెలుగునింపేది. లక్షలాది మందిని నిరాశ్రయుల్ని చేసి కొద్దిమంది కార్పొరేట్లకు దండిగా వేల కోట్ల సంపదను కట్టబెట్టేది 'అభివృద్ధి' ముసుగు చాటున సాగే దోపిడీ. జనసేన-లెఫ్ట్ కూటమి ఈ దోపిడీనే ప్రశ్నిస్తోంది. ప్రజలను బలి పెట్టి సాధించే అభివృద్ధిని సవాలు చేస్తోంది.



విశాఖపట్నంలో జనవరి 25న జరిగిన జనసేన-లెఫ్ట్ సమావేశం కొన్ని ముఖ్యమైన సమస్యలను ముందుకు తెచ్చింది. పర్యావరణ పరిరక్షణ, అక్రమ, విచక్షణారహిత మైనింగ్ నిరోధం, దళిత, మహిళా, గిరిజన హక్కుల రక్షణ, భూనిర్వాసితుల పునరావాసం, నష్ట పరిహారం, మత్స్యకారుల రక్షణ, పేదల గృహ నిర్మాణం, మానవ హక్కుల ఉల్లంఘన వంటి సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడిగా పని చేస్తామని ఆ మూడు పార్టీలూ ప్రకటించాయి. మన రాష్ట్రంలో ప్రస్తుతం అభివృద్ధి పేరుతో అమలు జరుగుతున్న విధానాలను ముందుకు తెచ్చిన సమస్యలు ఇవి.

అమరావతి అభివృద్ధి పేరుతో బలవంతంగా గాని, ప్రలోభపెట్టిగాని, ముప్పైవేల ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. సిఆర్‌డిఎ విస్తరించిన అన్ని మండలాలకూ సంబంధించి భవిష్యత్తులో దీనికి ఇంకా అనేక రెట్లు భూమిని సేకరించే వీలుంది. పోలవరం, వంశధార ప్రాజెక్టుల నిర్వాసితులు లక్షలలో ఉన్నారు. పులిచింతల, తోటపల్లి తదితర ప్రాజెక్టుల నిర్వాసితులను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. వీరందరికీ 2013 పునరావాస చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాల్సి వుంది. అంతేగాక పునరావాసం కల్పించాల్సి వుంది. ఇదిగాక భావనపాడు మొదలు రామాయపట్నం దాకా కొత్త ఓడరేవుల నిర్మాణానికి, విమానాశ్రయాల నిర్మాణానికి లక్షల ఎకరాల భూమిని సేకరించే పనిలో ప్రభుత్వం ఉంది. అంతేగాక ఔటర్ రింగురోడ్డు, ఇన్నర్ రింగురోడ్డు, స్పెషల్ ఎకనామిక్ జోన్ల పేరుతో ఐటి పార్కుల పేరుతో భూ సేకరణ కార్యక్రమం పెద్ద ఎత్తున తలపెట్టి అమలు చేస్తోంది చంద్రబాబు ప్రభుత్వం. నిర్వాసితులకు సరైన పునరావాసం గాని, నష్టపరిహారం గాని లేకుండానే ముందుకు సాగుతున్నది ఈ ప్రభుత్వం. దానికి వీలుగా పునరావాస చట్టాన్నే అన్యాయంగా సవరించింది. ఈ భూసేకరణ యజ్ఞంలో సమిధలౌతున్నదెవరు? పేదలే. మరీ ముఖ్యంగా అసైన్డ్ భూములు గల దళితులు, గిరిజనులు, చేతివృత్తుల వారు, వ్యవసాయ కూలీలు. ఎన్నికల ముందు చాలా మందికి సంక్షేమ పథకాల పేరుతో చంద్రబాబు వరాలను గుప్పిస్తున్నట్లు పైకి కనపడుతోంది. కాని నిజానికి లక్షలాది కుటుంబాలకు ఆధారం లేకుండా చేసి రోడ్డు మీదకు నెట్టి వారిని ఆదుకుంటున్నట్లు పోజు పెట్టిన కార్యక్రమం ఈ పెన్షన్ల పందేరం. దీనిని నిగ్గదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం ఆ బాధ్యత నెరవేర్చకపోగా తాను ప్రకటించిన 'నవరత్నా'లను చంద్రబాబు కాపీ కొట్టేస్తున్నాడని వాపోతోంది. ఈ రెండు పార్టీల ఎజెండా ఒకటేనని. చంద్రబాబు చేపట్టిన 'అభివృద్ధి' నమూనా పట్ల జగన్‌కు ఎటువంటి అభ్యంతరమూ లేదనేది తేలిపోయింది. అందుకే భూనిర్వాసితుల విషయమై నోరు మెదపడం లేదు.

'అభివృద్ధి' అంటే ప్రజల జీవితాలలో వెలుగునింపేది. లక్షలాది మందిని నిరాశ్రయుల్ని చేసి కొద్దిమంది కార్పొరేట్లకు దండిగా వేల కోట్ల సంపదను కట్టబెట్టేది 'అభివృద్ధి' ముసుగు చాటున సాగే దోపిడీ. జనసేన-లెఫ్ట్ కూటమి ఈ దోపిడీనే ప్రశ్నిస్తోంది. ప్రజలను బలి పెట్టి సాధించే అభివృద్ధిని సవాలు చేస్తోంది.

చంద్రబాబు అభివృద్ధి నమూనాలో పర్యావరణం దారుణంగా దెబ్బతింటోంది. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు విస్తరించి వున్న తీర ప్రాంతం యావత్తు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ నిబంధనలను ఇంతవరకూ ఉల్లంఘిస్తూ వచ్చారు. ఇటీవల ఏకంగా సిఆర్‌జడ్ నిబంధనలనే కేంద్రం మార్చి పారేసింది. దీని పర్యవసానంగా లక్షలాదిమంది మత్స్యకారులు తమకు సహజంగా సముద్రంపై, సముద్ర తీరంపై సంక్రమించిన హక్కులను కోల్పోయి రోడ్డున పడుతున్నారు. లక్షల కోట్ల కన్నా విలువైన మడ అడవులు, జీవ వైవిధ్యం నాశనమౌతోంది. తీర ప్రాంతపు ఇసుక అక్రమ మైనింగ్ వలన ఉప్పు నీటికి, భూమి కింద విస్తరించిన భూగర్భ మంచి నీటి జలాలకి మధ్య అడ్డు గోడలా నిలిచే సముద్ర తీరం నాశనమౌతోంది. ఇది కొనసాగి, అడ్డుగోడ బలహీన పడితే భూగర్భ జలాలు ఉప్పు నీటిమయం అవుతాయి. అప్పుడు కలిగే వినాశనం ఊహకందనంత భయంకరం! కాని తక్షణం కొద్దిమంది పొందే లాభాల కోసం పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు కార్పొరేట్లు. వారికి కొమ్ముగాస్తూ, పర్యావరణ రక్షణ కోసం పోరాడుతున్న వారిని అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేస్తున్నారు చంద్రబాబు. ఇటువంటిదే బాక్సైట్ మైనింగ్ సమస్య. ఈ మైనింగ్‌కు గతంలో రాజశేఖరరెడ్డి, ప్రస్తుతం చంద్రబాబు ఇద్దరూ అనుకూలమే. ఆ మైనింగ్‌కు అనుమతి ఇచ్చిన జివో నెం 97ను ఇప్పటికీ రద్దు చేయలేదు ప్రభుత్వం. ఈ విషయంలో జగన్‌కు వేరే విధానమేదీ లేదు. ఏక కాలంలో లక్షలాది గిరిజనులను, మత్స్యకారులను, తరతరాలకు తరగని సంపదగా కాపాడుకోవాల్సిన పర్యావరణాన్ని బలిపెట్టే విషయంలో తేడా ఏమీ లేకుండానే వ్యవహరిస్తున్నారు. ఇంత కీలకమైన అంశం గనుకనే జనసేన-లెఫ్ట్ కూటమి పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ అభివృద్ధి చేయాలని, అక్రమ మైనింగ్‌ను నిలుపుచేయాలని స్పష్టమైన విధానం ప్రకటించింది. ఎన్నికల ఆపద మొక్కుల్లో మునిగి తేల్తున్నట్లు కనిపించే చంద్రబాబు, జివో 97 రద్దును ఎందుకు ప్రకటించడం లేదు? కోస్టల్ కారిడార్‌ను, పిసిపిఐఆర్‌ను ఎందుకు ఉపసంహరించుకోవడం లేదు? రోజూ బిజెపి మీద మండి పడుతున్న చంద్రబాబు సిఆర్‌జెడ్ నిబంధనలను మోడీ దుర్మార్గంగా సవరిస్తే ఎందుకు ఖండించడం లేదు? సరిగ్గా ఆలోచిస్తే జనసేన-లెఫ్ట్ ఈ పర్యావరణ అంశాన్ని ఎందుకు ముఖ్యమైన అంశంగా పరిగణించాయో బోధపడుతుంది.

చంద్రబాబు రోజూ ప్రకటించే రకరకాల ప్రోత్సాహకాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులను సంతృప్తి పరిచేవే తప్ప నిజమైన పేదలకు గూడు కల్పించ లేకపోతున్నాయన్నది నిష్ఠుర సత్యం. ప్రకటనలు జాస్తి గానే ఉన్నాయి. కాని 4 లక్షల 82 వేల మంది పేదలు గృహ నిర్మాణ రుణాలకు దరఖాస్తు చేసుకుంటే బ్యాంకులు కేవలం ఆరువేల మందికే రుణాలిచ్చాయని లెక్కలు చెబుతున్నాయి. అందుకే జనసేన-లెఫ్ట్ పార్టీలు పేదల గృహ నిర్మాణాన్ని ఒక ప్రాధాన్యతాంశంగా తీసుకున్నాయి.

2014లో అధికారంలోకి వచ్చింది మొదలు చంద్రబాబు ప్రభుత్వం ప్రజల మీద, ప్రజా ఉద్యమాల మీద తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే వుంది. ముఖ్యమంత్రి పర్యటిస్తే చాలు ముందస్తు అరెస్టులు. జన్మభూమి సభలో లేచి ప్రశ్నించబోతే అరెస్టు. రాజధాని ప్రాంతంలో ఎటువంటి సభ జరపాలన్నా అనుమతి ఉండదు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలులో ఉన్న వాతావరణం ఉంది. ఏమిటీ అన్యాయం అని ప్రశ్నించే వారంతా అభివృద్ధి నిరోధకులు, ఓర్వలేని వారు అని చంద్రబాబు ఆడిపోసుకుంటున్నారు. తాము మాత్రం ప్రభుత్వ ధనం ఖర్చుతో ధర్మ పోరాట(!) దీక్షలు చేస్తారు. ఇంకెవరైనా ఏదైనా ప్రజా సమస్యపై చట్టబద్ధమైన ఆందోళనకు పూనుకున్నా అది మాత్రం నేరమైపోతుంది! రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు ఆగిపోతాయన్న ఓ సాకు ముందుకొస్తుంది! దళితుల మీద కామందుల దాడులు, మహిళలపై కామాంధుల అత్యాచారాలు పెరుగుతున్నాయి. గిరిజనుల హక్కులు కాలరాయబడుతున్నాయి. ఇదంతా చంద్రబాబుకు పెద్ద తప్పుగా అనిపించడం లేదు. ఈ అత్యాచారాలను ప్రశ్నిస్తే మాత్రం అది చాలా తీవ్ర నేరంగా భావిస్తున్నది ఈ ప్రభుత్వం!

ఈ విషయంలో కూడా జగన్ ప్రతిస్పందన ఏమీ లేదు. తాను అధికారంలోకి వస్తే అన్నీ పరిష్కరిస్తానన్న మాట చెప్తున్నాడే తప్ప గత అయిదేళ్లుగా అత్యాచారాలు, దుర్మార్గాలు జరుగుతుంటే పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రజాస్వామ్య హక్కుల్ని, స్వేచ్ఛను, భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని బలి చేసే విధానం 'అభివృద్ధి' అనిపించుకుంటుందా? అందుకే జనసేన-లెఫ్ట్ కూటమి ఈ ముఖ్యమైన అంశాన్ని ఎజెండాలోకి ముందుకు తెచ్చింది.

నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో స్పష్టత కలిగి వున్నందునే జనసేన-లెఫ్ట్ కూటమి కీలకమైన అంశాలను ఫోకస్ చేస్తున్నది. ప్రజలను మభ్యపెట్టి కార్పొరేట్ల దోపిడీని 'అభివృద్ధి'గా చిత్రీకరిస్తున్నారు గనుకనే చంద్రబాబు ఈ కీలక విషయాలను లేవనెత్తకుండా, వీటిపై స్పందించకుండా 'సంక్షేమం' పల్లవి ఎత్తుకున్నారు. తమదీ అదే పంథా గనుకనే జగన్ కూడా 'నవరత్న' సంకీర్తనంలో ఉన్నారు. ఈ రెండింటి అసలు బండారం బైటపెట్టడమే జనసేన-లెఫ్ట్ కూటమి పురోగమనానికి బాటలు వేయగలుగుతుంది.

జీవన the family
ప్రజాశక్తి
jeevanapageps@gmail.com
విజయవాడ
ఆదివారం 3-2-2019





సుస్వర గీతాల.. హారిణి

పాట.. వర్షంలాంటిది. మనం వినడానికి ఉపక్రమించినప్పుడు.. అది చిరు తుంపరగా మొదలై... ప్రకృతితో మమేకమవుతూ.. ఉరుములు, మెరుపుల సాక్షిగా.. ఓ అందమైన నడకలా సాగుతూ చిక్కని వర్షపు ధారవుతుంది. కొన్ని కొత్త గొంతుకల్లోని పాటలు ఇలానే.. చిరుప్రాయంలోనే చిన్నగా విచ్చుకుని.. చూస్తూ చూస్తూ ఉండగానే.. గలగలమంటూ మనల్ని మైమరపించే స్వరవిన్యాసాలవుతాయి. అలాంటి సుస్వరాల, స్వరమాధుర్యమే హరిణి పాట. 'పాడుతా తీయగా'తో వెలుగులోకొచ్చిన మరో యువగీతికే ఈ అమ్మాయి. 2012-పాడుతా తీయగా సిరీస్‌లో విజేతగా నిలిచిన ఈ యువగాయని జీవన ప్రయాణంలో రాగంతీసే ఊసులేమిటో తెలుసుకుందాం పదండి!

గతంతో పోల్చుకుంటే.. ఇప్పుడు సినిమా పాటలు వైవిధ్యమైన గళాల్లో మారుమోగుతున్నాయి. ఎప్పటికప్పుడు కొంత గొంతులూ వినిపిస్తున్నాయి. వెండితెర పాటగానూ అలరిస్తున్నాయి. అందుకు టీవీల్లో ప్రసారమయ్యే సంగీత కార్యక్రమాలే ప్రధాన కారణం. ముఖ్యంగా 'పాడుతా తీయగా' కార్యక్రమం వచ్చాక.. తెలుగునాట గాయనీగాయకుల సంఖ్య పెరిగింది. వేళ్ళపై లెక్కపెట్టే స్థితి నుంచి వందల సంఖ్యలో కొంగొత్త గళాలు ప్రేక్షకుల్ని అలరిస్తున్నాయి. ఇలా ఎక్కడెక్కడో పుట్టిన.. చిరుగళాలు సైతం.. పరిణత ప్రతిభతో దేశ, విదేశ వేదికలపైనా పాడేలా కొత్తవారిని తీర్చిదిద్దుతున్న ఘనత మాత్రం స్వరగంధర్వుడు ఎస్పీ బాలుదే. ఆయన గూటిలో పాటలు నేర్చిన అమ్మాయే యువగాయని హరిణి. ఈ అమ్మాయి పాటల పలుకు తెలుసుకోవాలంటే.. ఓ అయిదారేళ్ళు వెనక్కి వెళ్ళాల్సిందే.

అందెల రవళియై.. యుగళం గీతమై

2012 సంవత్సరంలో జరిగిన 'పాడుతా తీయగా' సిరీస్ అది. 'అందెల రవమిది.. పదములదా.. అంబరమంటిన హృదయముదా..' అంటూ సాగే ఈ పాట 'స్వర్ణకమలం' సినిమాలోనిది. ఇళయరాజా స్వరాలు కూర్చిన ఈపాటలో క్లిష్టమైన రాగచ్ఛాయలే ఎక్కువ. పైగా అయిదారు నిముషాలపాటు ఏకధాటిగా సాగిన ఈ పాటను ఒరిజనల్‌గా బాలు, వాణీజయరాం కలిసి పాడారు. 'పాడుతా తీయగా' కోసం హరిణి ఏమాత్రం తత్తరపడకుండా.. అంతే గాన పరిపుష్టితో.. ఇద్దరి గళాలను ఒకే గొంతులో పాడి ఔరా అనిపించడం ఇప్పటికీ ప్రేక్షకులకు బాగా గుర్తే. అదే క్రమంలో సెమీఫైనల్ కోసం పాడిన

'సన్నగ వీచే చల్లగాలికి.. కనులమూసినా.. కలలాయే
తెల్లని వెన్నెల పానుపై.. ఆ కలలో వింతలు కననాయే..'

అంటూ హరిణి పాడుతుంటే.. ఆ కార్యక్రమ సారథి బాలు సైతం లీలగా పాటలో లీనమవ్వడం.. పాట పూర్తయ్యాక 'నువ్వు పాడుతుంటే ఎంతో ముచ్చటేసింది.. కళ్ళు మూసుకుంటే.. ఆపాటలోని సాహిత్యపు అనుభవం కనిపిస్తుంది.. కనులు తెరిస్తే. . మాధుర్యం వినిపిస్తుంది.. రియల్లీ.. యూ జస్ట్.. జస్ట్.. పెర్ఫెక్ట్..' అంటూ అభినందనతో మెచ్చుకున్నారు.. ఇలా పాడుతా తీయగా వేదికపై చక్కటి పాటలతో మాధుర్యాన్ని పంచి.. సంగీత ప్రియుల మనసు దోచుకున్న హరిణి.. అక్కడ నుంచి బాలుగారి తోడ్పాటు, ప్రోత్సాహంతో అమెరికా, ఆస్ట్రేలియాలోనూ వెంట వెంటనే ఆమె సంగీత ప్రయాణం హాయిగా సాగిపోయింది. నిజానికి దూరదర్శన్‌తో మొదలైన హరిణి సంగీతపు నడక, తర్వాత జీసరిగమ లిటిల్ ఛాంప్స్‌తో ముందడుగు వేసి 'పాడుతా తీయగా'తో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యింది. రియాల్టీ షో పాపులారిటీ నుంచి ప్లేబ్యాక్ సింగర్‌గా సినిమాల్లో మంచి పాటలు పాడే అవకాశాలూ వచ్చాయి.

కొంగును పట్టి.. పాటను తట్టి

ఏ గొంతులోనైనా పాటలు ఊరకనే పుట్టవు. అక్కడ ఏదో విషయం ఉంటేగానీ.. గుండె గొంతుకలో పాట పల్లవించదు. నాలుగేళ్ళప్పుడే.. బుల్లిగౌను వేసుకుని దూరదర్శన్‌లో 'బాలానందం' కార్యక్రమంలో పాడ్డానికి హరిణి సిద్ధమైందంటే.. అందుకు కారణం ఇంట్లోగల సంగీత వాతావరణమే. 'తాతల నాటి నుంచీ నాన్నవాళ్ళ కుటుంబంలో అందరికీ శాస్త్రీయ సంగీతంతో అంతో ఇంతో పరిచయం, అనుబంధం ఉంది. నాన్న రవీందర్ వీణ నేర్చుకున్నారు. అమ్మ పద్మావతి గవర్నమెంట్ టీచర్. అమ్మకూ పాటలంటే ఎంతో ఇష్టం. అందుకేనేమో.. కొంగుపట్టుకుని వేలాడే వయసు నుంచే కూనిరాగాలు నాలో మొదలయ్యాయి' అంటూ తన పాటల ప్రస్థానానికి బీజం ఎలా పడిందో చెప్పుకొచ్చారు హరిణి.

'నేను పుట్టి పెరిగింది హైదరాబాదే. తర్వాత కాకినాడ వచ్చేశాం. అక్కడే స్కూల్, ఇంటర్ చదివా. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు తొలుత గరువు శేషారత్నం వద్ద శాస్త్రీయ సంగీతం అభ్యాసం ప్రారంభించా. అలా ఆవిడ దగ్గర రెండేళ్ళు నేర్చుకున్నా. హైదరాబాద్ నుంచి కాకినాడ వచ్చేశాక పెద్దాడ సూర్యకుమారి దగ్గర సంగీత శిక్షణ కొనసాగించా. ఇప్పటికీ ఆవిడే దగ్గరే నా సాధనంతా సాగుతుంది. ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి సంగీతంలో డిప్లొమో చేశా. బీటెక్ కంప్యూటర్స్ ఏడాదిన్నరపాటు చదివి.. పాటలపై మక్కువతో ఆ చదువు మధ్యలోనే వదిలేశా.' అంటూ తన శాస్త్రీయ సంగీత నేపథ్యం గురించి, తనపై పాటల ప్రభావం గురించి చెప్పుకొచ్చారు హరిణి. సంగీత కార్యక్రమాల కారణంగా బీటెక్ ఆపేసినా.. చదువు ఆపలేదు. పబ్లిక్ అడ్మిషస్ట్రేషన్లో డిగ్రీ పూర్తి చేశారు.




















నా పాటకు.. చరణం

సింగర్‌గా కెరీర్‌ని ఎంచుకున్న హరిణి.. 'పాడుతా తీయగా'లో తనతోపాటు ఫైనల్‌కి చేరిన సాయిచరణ్‌నే ప్రేమించి పెళ్ళాడ్డం విశేషం. 'మా ఇద్దరికీ 'పాడుతా తీయగా..'తోనే పాటల ప్రయాణం మొదలైంది. ఒకే సిరీస్‌లోనే కలిసి పాడాం. ఇద్దరం ఫైనల్‌కీ వచ్చాం. అయితే.. ఆ పరిచయం.. ఆ తర్వాత కూడా కొనసాగుతూ వచ్చింది. కారణం ఇద్దరమూ బాలుగారితో కలిసి ఎక్కువగా ప్రోగ్రామ్స్ చేయడం, ఇతర సంగీత కార్యక్రమాల్లోనూ కలుస్తూ ఉండటం వల్ల ఒకరి గురించి ఒకరం తెలుసుకోడానికి అవకాశం ఏర్పడింది. అలా ఒకరిపట్ల ఒకరికి ఇష్టం, ఆరాధన ఉండేది. అది ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతోనే వివాహం అయ్యింది.' అంటూ గాయకుడు చరణ్‌తోగల పరిచయాన్ని చెప్పుకొచ్చారు హరిణి.

'మేం ఇద్దరం ఒకే రంగంలో ఉన్నాం కనుక.. కెరీర్‌పట్ల ఒక అవగాహన ఉంది. అలాగే ఇందులో ఉండే సాధక బాధలు అర్థమవుతాయి. అపార్థాలు ఉండవు. ఇద్దరికీ ఇష్టమైంది పాటే కనుక.. మా మధ్య.. ఎక్కువ సంగీతపు ముచ్చట్లే సాగుతుంటాయి. అలానే చిలిపి తగాదాలు ఎలాగూ ఉండేనే ఉంటాయి. అవన్నీ సరదా కోసమే' అంటూ చరణ్ పాటల సాంగత్యం గురించి చెప్తారు హరిణి.

'కలలా.. కథలా.. ఎందుకో అలా.. నువ్వెటువెళ్ళిపోయావు
శిలలా.. మిగిలి ఉన్నానిలా.. నువ్వెపుడెదురవుతావు
ఎన్నాళ్ళయినా.. ఎన్నేళ్ళయినా.. చెరగదు నీతలపు' అంటూ.. పలు మాధుర్యమైన పాటలతో టాలీవుడ్లో సవ్వడి చేస్తున్న హరిణి గీతాల సవ్వడి.. ఎన్నాళ్ళయినా.. ఎన్నేళ్ళయినా గుర్తుండిపోయేలా సాగాలని మనమూ కోరుకుందాం!!

- గంగాధర్ వీర్ల



టీవీ వీక్షణంతో ఒంటరితనం!



టీవీ ప్రభావం పిల్లలపై ఎక్కువ పడుతుందని మనకు తెలుసు. అయితే, టీనేజ్ పిల్లలు టీవీ ముందు ఎక్కువసేపు గడపడం వల్ల వారు సమాజానికి దూరంగా పెరిగేందుకు మొగ్గు చూపుతారని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పిల్లలు సామాజికంగా ఒంటరులవుతారని అంటున్నారు. పదమూడేళ్ల పిల్లల్లో ఈ రకమైన ప్రవర్తన మరీ ఎక్కువగా ఉంటుందట! మాంట్రియల్ స్కూల్ ఆఫ్ సైకో-ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యయనకర్తలు ఈ స్టడీ చేశారు. పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదిగే కీలక సమయం ఇది.

అలాంటి వయసులో అదే పనిగా టీవీ చూడటం వల్ల పిల్లల సామాజిక సంబంధాలు దెబ్బతినే అవకాశం బాగా ఉందంటున్నారు. అంతేకాదు, తమ తోటి పిల్లల పట్ల వీళ్లు ఎంతో హింసాత్మకంగా ప్రవర్తించే అవకాశం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు. టీనేజీలో మంచి స్నేహితుల అవసరం ఎంతో ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. స్టడీలో భాగంగా నిపుణులు రెండేళ్ల వయసు పిల్లల్లో టెలివిజన్ చూసే అలవాట్ల గురించి వారి తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్నారు. అలాగే 13 ఏళ్ల ప్రాయంలో ఉన్న పిల్లల ద్వారా వారి సామాజిక అనుభవాలను తెలుసుకున్నారు. టీవీ ఎక్కువసేపు చూస్తున్న పిల్లలు ఒంటరితనం కోరుకుంటున్నారని వెల్లడైంది. వీరికి స్నేహితులు కూడా ఉండడం లేదు. వీళ్ల తమ తోటి స్నేహితుల పట్ల తీవ్రమైన కోపంతో వ్యవహరించడం గమనించారు. ముఖ్యంగా ఇటువంటి ప్రవర్తన 13 ఏళ్ల పిల్లల్లో బాగా ఉండడాన్ని గుర్తించారు. టీవీని చూడాల్సిన సమయం కన్నా ఎక్కువసేపు పిల్లలు చూస్తున్నారని తేల్చారు. చిన్నతనంలోనే పిల్లల్లో ఒకరిపట్ల ఒకరికి ఇష్టం, గౌరవం ఉండడం, ఇతరులతో మనోభావాలను పంచుకోవడం, ఒకరినొకరు మెచ్చుకోవడం వంటి సామాజిక లక్షణాలకు బీజం పడుతుంది. అవే వారిని సంపూర్ణ వ్యక్తులుగా రూపుదిద్దుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

★

జీవన సౌరభం

ఎంత ఉపయోగించినా పంచినా, అరగనిది, తరగనిది విజ్ఞానం.

మీకోసం

మధుమేహం ఉన్నవారు నిత్యం ఆహారంలో వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే మేలు.



జెట్ ఎయిర్‌వేస్‌కు ఊపిరి..!

న్యూఢిల్లీ : ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న జెట్ ఎయిర్‌వేస్ రుణాలను సశక్తి స్కీమ్‌లో పునర్ వ్యవస్థీకరించే అవకాశం ఉన్నట్లు ఎస్‌బిఐ ఛైర్మన్ రజ్నీష్ కుమార్ అన్నారు. ఈ ప్రతిపాదనను ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) పరిశీలించనుందన్నారు. ఈ మధ్య కాలంలో ఆ సంస్థ భాగస్వామి ఎతియాడ్, కన్సోరియం బ్యాంకర్ల నుంచి తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న విషయం తెలసిందే. జెట్ ప్రస్తుతం రూ.8,000 కోట్ల భారంలో ఉంది. ఇందులో కొంత మొత్తాన్ని బ్యాంకులు ఈక్విటీలోకి మార్చుకోవాలని భావిస్తున్నాయి.

డెన్వర్ ప్రచారకర్తగా మహేష్ బాబు

పురుషుల సువాసన పరిమళాల బ్రాండ్ అయినా డెన్వర్ తన బ్రాండ్ అంబాసీడర్‌గా మహేష్‌బాబును ఎంచుకుంది. ఈ ఒప్పందంతో తాము దక్షిణాదిలోని ఉన్న విస్తృతావకాశాలను అందిపుచ్చుకోవాలని నిర్దేశించుకున్నామని డెన్వర్ మార్కెటింగ్ డైరెక్టర్ సౌరబ్ గుప్తా పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణాదిలో తమకు 2 శాతం మార్కెట్ వాటా ఉందని.. మహేష్‌తో ఒప్పందం వల్ల భారీ వృద్ధిని అంచనా వేస్తున్నామన్నారు.



జనవరిలో రూ. లక్ష కోట్లు దాటిన జిఎస్‌టి వసూళ్లు



న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్ళు ముచ్చటగా మూడో సారి లక్ష కోట్ల రూపాయల మార్క్‌ను నమోదు చేశాయి. కొత్త ఏడాది నెలలో జిఎస్‌టి వసూళ్లు . 1,02,503కోట్లకు చేరాయని ఆర్థిక శాఖ శనివారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ తర్వాత అత్యధిక జిఎస్‌టి వసూళ్లు జరిగాయి. 2017 జులై నుంచి ఈ కొత్త పన్ను విధానం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. 2018 డిసెంబరులో రూ.94,725 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. కాగా 2018 జనవరిలో వసూలైన రూ. 89,825కోట్ల జిఎస్‌టితో పోల్చితే క్రితం మాసం వసూళ్లలో 14 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. క్రితం జనవరి 31 నాటికి 73.3లక్షల మంది రిటర్న్‌లు దాఖలు చేశారు. 2019 జనవరిలో వసూళ్లయిన జిఎస్‌టిలో కేంద్ర జిఎస్‌టి రూ. 17,763కోట్లు కాగా, రాష్ట్ర జిఎస్‌టి రూ. 24,826కోట్లు, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి రూ. 51,225కోట్లు, సెస్ రూ. 8,690కోట్లుగా ఉన్నాయి. గతేడాది ఏప్రిల్, అక్టోబరులోనూ వసూళ్లు లక్ష కోట్లు దాటాయి. 2018 ఏప్రిల్‌లో రూ.1.03లక్షల కోట్లు వసూళ్లు కాగా.. అక్టోబరులో రూ. 1,00,710 కోట్ల జిఎస్‌టి వసూళ్లు నమోదయ్యాయి.



ఎంఆర్‌ఎఫ్ మజిల్ జోన్ విస్తరణ..

అతిపెద్ద టైర్ల తయారీదారు ఎంఆర్‌ఎఫ్ తమ ఆరవ ఎంఆర్‌ఎఫ్ మజిల్‌జోన్‌ను హైదరాబాద్ శివారు కొత్తూరులో తెరిచింది. దీన్ని ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కోషి కె వర్గేసీ లాంచనంగా ప్రారంభించారు. ఇక్కడ పూర్తి స్థాయిలో వీల్ ఎలైన్‌మెంట్, వీల్ బ్యాలెన్సింగ్, ఆటోమోటిక్ టైర్ ఫిట్‌మెంట్ తదితర పూర్తి స్థాయి టైర్ సేవలు అందిస్తామన్నారు.

చందా కొచర్‌పై మనీలాండరింగ్ కేసు

- **ఇసిఐఆర్‌లో దీపక్, వేణుగోపాల్ పేర్లు**
- **త్వరలోనే ఇడి నోటీసులు**

న్యూఢిల్లీ : వీడియోకాన్–ఐసిఐసిఐ బ్యాంకు క్విడ్‌ప్రోకో కేసులో చందా కొచ్చర్ మెడకు మరో ఉచ్చు తగులుకుంది. తాజాగా ఆమెపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మాని లాండరింగ్ కేసును నమోదు చేసింది. ఆమెతో పాటు దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూపు అధినేత వేణుగోపాల్ దూత్‌లపై ఇడి కొరడా ఝులిపించినట్లు శనివారం అధి కారులు వెల్లడించారు. వీడియోకాన్‌కు ఐసిఐసిఐ ఇచ్చిన రుణాల జారీలో రూ.1,875 కోట్ల మోసం జరిగినందన్న ఆరోపణలపై ఇడి కూడా విచారణ ప్రారంభించింది. గత నెలలో సిబిఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇడి కొచ్చర్ సహా ఈ కేసులోని అనుమానిత నిందుతులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఇసిఐఆర్)ను నమోదు చేసింది. పోలీసు విభాగానికి ఎఫ్‌ఐఆర్ ఎలాగో.. ఇడికి ఇసిఐఆర్ అలా ఉంటుంది.



ఈ రుణ ఒప్పందంలో జరిగిన మోసంలో మానీలాండరింగ్‌కు ఉన్న అవకాశాలపై ఇడి విచారణ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి అతి త్వరలోనే ఇసిఐఆర్‌లోని వ్యక్తులకు నోటీసులు జారీ చేయనుందన్నారు. ఈ కేసులో ఇప్పటికే సిబిఐ ఎవరికైతే నోటీసులు అందించిందో వారికే ఇడి కూడా నోటీసులు ఇవ్వనుందన్నారు. సిబిఐ నోటీసులు జారీ చేసిన వారిలో చందా కొచర్, దీపక్ కొచర్, దూత్‌తో పాటు ఆయన కంపెనీలు అయినా వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఉన్నాయి. 2012లో వీడియోకాన్ గ్రూప్‌నకు ఐసిఐసిఐ బ్యాంకు రూ.3,250కోట్ల అప్పులు ఇచ్చింది. రుణం మంజూరైన కొద్ది మాసాలకే ఆ కంపెనీ చీఫ్ వేణుగోపాల్ ధూత్.. చందాకొచర్ భర్తకు చెందిన న్యూపవర్ సంస్థలో కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టింది. తుదకు రూ.9 లక్షల నామమాత్ర ధరకే రూ.64 కోట్ల ఆస్తులను దీపక్ కొచర్‌కు అందజేశారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై చాలా కొచర్‌పై చాలా ఆరోపణలు వచ్చాయి. వీడియోకాన్ గ్రూప్ రుణాల అవకతవకల వివాదం కారణంగా చందా కొచర్ గత ఏడాది అక్టోబరులో ఐసిఐసిఐ బ్యాంకు సిఇఒ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. వీడియోకాన్ రుణం కేసులో చందా కొచ్చర్ దోషేనని ఐసిఐసిఐ ఏర్పాటు చేసిన స్వతంత్ర విచారణ కమిటీ తేల్చిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌పై విచారణకు నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ స్వతంత్ర కమిటీ.. తన రిపోర్టును బుధవారం ఆ బ్యాంకుకు అందించింది. నివేదికలలో బ్యాంకునకు సంబంధించిన అంతర్గత నిబంధనలను కొచ్చర్ ఉల్లఘించారని కమిటీ తేల్చింది.

రూ.300 కోట్లతో బిక్ సెల్లో స్టేషనరీ ప్లాంట్

న్యూఢిల్లీ : స్టేషనరీ ఉత్పత్తులను అందించే బిక్ సెల్లో రూ.300 కోట్లతో గుజరాత్‌లో నూతన ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఇది ఆసియా ఖండంలోనే అతిపెద్ద స్టేషనరీ పరిశ్రమ అని బిక్ సిఇఒ గొంజల్వె పేర్కొన్నారు. దీంతో కలిపి తమకు ప్రస్తుతం ఐదు పరిశ్రమలు ఉన్నాయన్నారు. కొత్త ఫ్యాక్టరీలో 1500 మందికి ఉద్యోగాలు కల్పించామని.. ఇందులోనూ 70 శాతం మహిళలకు అవకాశం ఇచ్చామన్నారు.

ఎస్‌ఎంఇలకు స్మార్ట్ విపిఎన్ పరిష్కారాలు..

టాటా టెలి బిజినెస్ సర్వీసెస్ వెల్లడి



న్యూఢిల్లీ : ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ కనెక్టివిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ టాటా టెలీ బిజినెస్ సర్వీసెస్ (టిటిబిఎస్) ఎస్‌ఎంఇల కోసం మెరుగుపర్చబడిన సెక్యూరిటీ సర్వీసెస్, ప్రైవసీ శక్తి సామర్థ్యాలతో స్మార్ట్ విపిఎన్ పరిష్కారాలను ప్రవేశపెట్టినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. స్మార్ట్ వర్చువల్ ప్రయివేటు నెట్‌వర్క్ (విపిఎన్) అనేది ఒక పబ్లిక్ క్లౌడ్ నెట్‌వర్క్‌ను ప్రైవేటైజ్ చేస్తుందని టిటిబిఎస్ ఎస్‌ఎంఇ వైస్ ప్రెసిడెంట్ జోయ్ జీత్ బోస్ తెలిపారు. ఇది ఏ విధమైన సైబర్ ముప్పు వాటిల్లకుండా చూస్తుందన్నారు. సురక్షరీతిలో డేటా బదిలీ అయ్యేందుకు డేటా సెక్యూరిటీని అందిస్తుందన్నారు.

దివీస్ ల్యాబ్ లాభాల్లో 69% వృద్ధి

హైదరాబాద్ : ఔషద ఉత్పత్తుల కంపెనీ డివీస్ ల్యాబరేటరీస్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ 31తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 68.9 శాతం వృద్ధితో రూ.379.49 కోట్ల నికర లాభాలు సాధించింది. 2017–18 ఇదే క్యూ3లో రూ.224.66 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,054.89 కోట్ల మొత్తం రెవెన్యూ.. క్రితం క్యూ3లో 30.58 శాతం వృద్ధితో రూ.1,377.48 కోట్లకు చేరింది. రెవెన్యూలో భారీగా పెరుగుదల వల్ల లాభదాయకత పెరిగినట్లు ఆ కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ 2018తో ముగిసిన త్రైమాసికంలో ఈ కంపెనీ రెవెన్యూ రూ.1,365 కోట్లు, నికర లాభాలు రూ.397.65 కోట్లుగా నమోదయ్యాయి. 2018–19 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది మాసాల కాలంలో కంపెనీ నికర లాభాలు రూ.1,422.85 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.822.31 కోట్ల లాభాలు నమోదయ్యాయి

Divi's Laboratories Limited

ఐపిఒకు 10 పిఎస్‌యులు

- **2019–20లో మార్కెట్‌లోకి..**
- **దీపమ్ సెక్రటరీ వెల్లడి**

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరంలో 10 ప్రభుత్వ రంగ కంపెనీలు (పిఎస్‌యు) ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానున్నాయని డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ అటను చక్రబొర్తి తెలిపారు. 2019–20లో పిఎస్‌యుల్లో డిజిన్వెస్ట్ మెంట్ ద్వారా రూ.90,000 కోట్ల వాటాలను విక్రయిం చాలని కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టు కున్న విషయం తెలిసిందే. 2018–19లో రూ.80వేల కోట్ల వాటాల ఉపసంహరణ లక్ష్యాన్ని చేరకుంటామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పిఎస్‌యుల వాటాల విక్రయానికి ఎత్తుగడలు రూపొందిస్తుంది. ఇప్పటికే 10 ఐపిఒలు వరసలో ఉన్నాయని చక్రబొర్తి తెలిపారు. చాలా కంపెనీలు ఇంకా కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ లక్ష్యాన్ని చేరాల్సి ఉందన్నారు. క్రితం 10 మాసాల్లో కేంద్ర పిఎస్‌యుల్లో రూ.36,000 కోట్ల విలువ చేసే వాటాలను ఉపసంహరించు కుంది. వచ్చే నెల మార్చి ముగింపు నాటికి మరో రూ.44,000 కోట్ల వాటాలను విక్రయించాలని కేంద్రం నిర్దేశించుకుందని.. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా పెట్టుకున్న రూ.80,000 కోట్ల వాటాల ఉపసంహ రణ లక్ష్యం నెరవేరనుందని చక్రబొర్తి పేర్కొన్నారు. 2019 మార్చి కల్లా పవన్ హాన్స్‌లో కీలక వాటాలను విక్రయించను న్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.90వేల కోట్ల వాటాలను ఉపసంహరణకు ఇప్పటికే తాము ప్రణాళికలు రూపొందించామన్నారు.




సుప్రీం కోర్టు గురించి వివరించే రాజ్యాంగ అధికరణ?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు.
సెల్ : 9440262072



1. ఈ కింద పేర్కొన్న ఏ కేసులో సుప్రీం కోర్టు న్యాయసమీక్షను భారత రాజ్యాంగం మౌలికంగా పేర్కొన్నది ?
ఎ. మినర్వా మిల్స్ యూనియన్ ఆఫ్ ఇండియా
బి. బాలాజీకి స్టేట్ ఆఫ్ మైసూర్
సి. గోలక్‌నాథ్‌కి స్టేట్ ఆఫ్ పంజాబ్
డి. కేశవానంద భారతి ది స్టేట్ ఆఫ్ కేరళ

2. ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించిన కేసు ?
ఎ. సరళాముద్గల్ కేసు బి. షాబానోకేసు
సి. పన్నాలాలా బన్నీలాలా పాటిల్ కేసు
డి. పైవన్నీ

3. ప్రాథమిక హక్కుల రక్షణార్థం హైకోర్టులు మాత్రమే ఏ అధికరణం ప్రకారం రిట్‌లు జారీ చేయగలవు ?
ఎ. 226 బి. 32 సి. 228 డి. 33

4. కిందివానిలో తప్పుగా జతపరిచినది ఏది ?
ఎ. సర్కారియా కమిషన్ – 1983
బి. రాజమన్నార్ సంఘం – 1969
సి. ఆనందపూర్ సాహెబ్ – 1973
డి. పూంచి కమిషన్ – 2003

5. ఎస్సీ, ఎస్టీలకు ఏ ప్రకరణ ప్రకారం లోక్‌సభలలోనూ, రాష్ట్రాల విధానసభల్లోను రిజర్వేషన్లు కల్పించారు ?
ఎ. ప్రకరణ 330, ప్రకరణ 332
బి. ప్రకరణ 331, ప్రకరణ 332
సి. ప్రకరణ 332, ప్రకరణ 334
డి. ప్రకరణ 333, ప్రకరణ 332

6. కిందివాటిలో రాష్ట్రపతి పై ప్రవేశపెట్టే మహాభియోగ తీర్మానానికి సంబంధించి సరైనది ఏది ?
ఎ. రాజ్యాంగ నిబంధనలు 56, 61 ప్రకారం రాష్ట్రపతి రాజ్యాంగ నిబంధనలను అతిక్రమిస్తే అతనిపై పార్లమెంటులో మహాభియోగ తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు
బి. పార్లమెంటు ఉభయసభల్లో దేనిలోనైనా 14 రోజుల వ్యవధితో ముందస్తు నోటీసు జారీ చేయాలి
సి. తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత ఆ సభ చర్చించి 2/3 మెజారిటీతో ఆమోదించాలి
డి. పైవన్నీ సరైనవే

7. ఏదైనా బిల్లుపై రాష్ట్రపతి ఆమోదముద్ర వేసేందుకు కచ్చితమైన కాలపరిమితి లేదు. రాష్ట్రపతి ఎంతకాలమైనా బిల్లును తనవద్ద ఉంచుకునే అధికారాన్ని ఏవిధంగా పిలుస్తారు ?
ఎ. అబ్సల్యూట్ వీటో బి. సస్పెన్సివ్ వీటో
సి. పాకెట్ వీటో డి. క్వాలిఫైడ్ వీటో

8. భారత ఉపరాష్ట్రపతుల సరైన కాలక్రమం ఏది ?
ఎ. డా.జాకీర్‌హుస్సేన్, ఆర్.వెంకట్రామన్, బి.డి.జెట్టి, జి.ఎస్.పాథక్
బి. డా.జాకీర్‌హుస్సేన్, జి.ఎస్.పాథక్, బి.డి.జెట్టి, ఆర్.వెంకట్రామన్
సి. బి.డి.జెట్టి. డా.జాకీర్‌హుస్సేన్, జి.ఎస్.పాథక్, ఆర్.వెంకట్రామన్
డి. జి.ఎస్.పాథక్, బి.డి.జెట్టి, డా.జాకీర్‌హుస్సేన్, ఆర్.వెంకట్రామన్

9. ప్రోటెం స్పీకర్ అనగా ...?
ఎ. పార్లమెంటుకు మొట్టమొదటిసారిగా ఎన్నికైన వ్యక్తి స్పీకర్‌గా పదవిని చేపట్టడం
బి. లోక్‌సభ కొత్త స్పీకరును ఎన్నుకునేంత వరకూ తాత్కాలికంగా స్పీకరు బాధ్యతలను నిర్వహించేందుకు రాష్ట్రపతిచే నియమితుడైన వ్యక్తి
సి. రద్దయిన లేదా కాలపరిమితి ముగిసిపోయిన సభలో స్పీకర్‌గా వ్యవహరించిన వ్యక్తి
డి. సభలోని సభ్యులందరిచే స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తి

10. కిందివాటిలో ఏ సందర్భంలో ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేశారు ?
ఎ. వరకట్న నిషేధపుబిల్లు (మే 6, 1961)
బి. బ్యాంకింగ్ సర్వీస్ కమిషన్ బిల్లు (మే 16, 1978)
సి. తీవ్రవాద నిరోధక బిల్లు (మార్చి 26, 2002)
డి. పై అన్ని సందర్భాలలో

11. కింది వాటిలో శాసన మండలి/ విధాన పరిషత్‌లను కలిగి ఉన్న రాష్ట్రాలు ఏవి ?
1. ఉత్తరప్రదేశ్, 2. ఉత్తరాంచల్, 3. బీహార్, 4. జార్ఖండ్, 5. మధ్యప్రదేశ్, 6. చత్తీస్‌ఘడ్, 7. మహారాష్ట్ర, 8. జమ్ముకాశ్మీర్, 9. కర్నాటక, 10. తమిళనాడు
ఎ. 1,2,3,4,5,7 బి. 1,3,7,8,9 సి. 1,3,6,7,8,9 డి. పైవన్నీ

12. కిందివాటిలో ఏ సంఘంలో కేవలం లోక్‌సభ సభ్యులు మాత్రమే సభ్యులుగా ఉంటారు ?
ఎ. అంచనాల సంఘం బి. ప్రభుత్వ ఖాతాల సంఘం
సి. ప్రభుత్వ ఉపక్రమాల సంఘం డి. ఏదీకాదు.

13. కింది వాటిలో సరైంది ఏది ?
ఎ. నక్షత్రం గుర్తు ప్రశ్నలు – సభ్యుల ప్రశ్నలకు మౌఖిక సమాధానం లభిస్తుంది. అనుబంధ ప్రశ్నలకు అవకాశం ఉంటుంది.
బి. నక్షత్రం గుర్తులేని ప్రశ్నలు – మంత్రులు లిఖిత పూర్వక సమాధానాన్ని ఇస్తారు. అనుబంధ ప్రశ్నలకు అవకాశం ఉండదు.
సి. స్వల్ప వ్యవధి ప్రశ్నలు – అత్యవసరమైన ప్రజాప్రాముఖ్యత గల అంశంపై మౌఖికంగా అడిగే ప్రశ్నలు. అయితే 10 రోజులు ముందుగా నోటీసు ఇవ్వవలసి ఉంటుంది.
డి. పైవన్నీ సరైనవే.

14. చర్చ జరపడానికి సమయం లేనందున చర్చ జరిగినట్లుగా ప్రకటించి, బిల్లులన్నింటినీ మూకుమ్మడిగా ఆమోదించే పద్ధతి ?
ఎ. ఓట్ ఆన్ అకౌంట్ బి. ఓట్ ఆన్ క్రెడిట్
సి. గిలెటిన్ డి. లేమ్‌డక్

15. కింది వాటిలో అటార్నీ జనరల్‌కు సంబంధించి సరికానిది ఏది ?
ఎ. రాజ్యాంగంలోని 76వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి అటార్నీ జనరల్‌ను నియమిస్తాడు.
బి. అటార్నీ జనరల్ రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత కాలం పదవిలో ఉంటాడు.
సి. అటార్నీ జనరల్ భారత ప్రభుత్వానికి న్యాయసంబంధమైన విషయాలలో సలహాలనిస్తాడు
డి. పైవన్నీ సరైనవే

16. భారత రాజ్యాంగంలో వార్షిక ఆర్థిక ప్రకటన గురించి వివరించే ప్రకరణ ఏది ?
ఎ. 108వ నిబంధన బి. 109వ నిబంధన
సి. 111వ నిబంధన డి. 112వ నిబంధన

17. రాజ్యాంగంలోని ఏ అధికరణను అనుసరించి భారత రాష్ట్రపతి ఏదైనా రాష్ట్రానికి గవర్నర్‌ను నియమిస్తాడు ?
ఎ. 117వ అధికరణం బి. 123వ అధికరణం
సి. 155వ అధికరణం డి. 161వ అధికరణం

18. సుప్రీం కోర్టు గురించి వివరించే రాజ్యాంగ అధికరణం ఏది ?
ఎ. 123వ అధికరణం
బి. 124వ అధికరణం
సి. 213వ అధికరణం
డి. 214వ అధికరణం

19. రాజ్యాంగంలోని ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి సుప్రీం కోర్టు సలహా కోరవచ్చు ?
ఎ. 131వ అధికరణం
బి. 135వ అధికరణం
సి. 143వ అధికరణం
డి. 148వ అధికరణం

20. కింది వాటిలో కలకత్తా హైకోర్టు పరిధిలో లేనిది ఏది ?
ఎ. పశ్చిమ బెంగాల్ బి. అండమాన్, నికోబార్ దీవులు
సి. లక్షదీవులు డి. ఏదీకాదు

21.జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న 370వ అధికరణాన్ని రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు ?
ఎ. 15వ భాగం బి. 16వ భాగం
సి. 19వ భాగం డి. 21వ భాగం

22. 1956 రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా ఎన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి ?
ఎ. 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు
బి. 15 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు
సి. 16 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు
డి. 17 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు

23. భారతదేశాన్ని రాజ్యాంగంలో ఏ విధంగా వర్ణించారు ?
ఎ. ఏక కేంద్రం బి. సమాఖ్య
సి. అర్ధసమాఖ్య డి. రాష్ట్రాల యూనియన్

24. రాజ్యాంగ ప్రవేశిక (Preanble) ను ఎన్నిసార్లు సవరించారు ?
ఎ. ఒక్కసారి 1976లో
బి. రెండు సార్లు 1976, 78లలో
సి. మూడుసార్లు 1976, 78, 85లో
డి. నాలుగుసార్లు 1976, 78, 85, 91లో

25. భారతదేశంలో రాజకీయాధికారానికి ముఖ్య ఆధారం (Chief source) ఎవరు ?
ఎ. రాజ్యాంగం బి. పార్లమెంటు
సి. ప్రజలు డి. రాష్ట్రాల శాసనసభలు

26. కిందివాటిలో ప్రాథమిక హక్కు కానిది ఏది ?
ఎ. సాంస్కృతిక విద్యా విషయక హక్కు
బి. ప్రభుత్వోద్యోగాల్లో సమానావకాశాలు
సి. ఇష్టమైన వృత్తిని అవలంభించే హక్కు
డి. సమ్మె చేసే హక్కు

27. భారతదేశం బలమైన కేంద్రం గల సమాఖ్య రాజ్య విధానాన్ని ఏ దేశం నుంచి గ్రహించింది ?
ఎ. అమెరికా బి. కెనడా సి. దక్షిణాఫ్రికా డి. ఐర్లెండ్

28. కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడం, ఉన్న రాష్ట్రాల సరిహద్దులను మార్చే అధికారం ఎవరికి ఉంది ?
ఎ. రాష్ట్రపతి బి. పార్లమెంట్
సి. ఎలక్షన్ కమిషన్ డి. ప్రధానమంత్రి

29. ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ద్వారా ఏ ప్రాథమిక హక్కుపై ఆంక్షలు విధించవచ్చు ?
ఎ. మత స్వేచ్ఛ హక్కు బి. రాజ్యాంగ పరిహారపు హక్కు
సి. స్వాతంత్ర్యపు హక్కు డి. సమానత్వపు హక్కు

30. 24, 25 రాజ్యాంగ సవరణలు చెల్లుతాయని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెప్పింది ?
ఎ. చంపకం దొరై రాజన్ వర్సెస్ మద్రాస్
బి. గోలక్‌నాథ్ వర్సెస్ పంజాబ్
సి. కేశవానంద భారతి వర్సెస్ కేరళ
డి. బేలాబెనర్జీ వర్సెస్ బెంగాల్

31. కింది వాటిని జతపరుచుము ?
ఎ. భారత ప్రభుత్వచట్టం 1919 1. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి
బి. భారత ప్రభుత్వ చట్టం 1935 2. ప్రత్యేక నియోజకవర్గాలు
సి. మింటో – మార్లే సంస్కరణలు 3. భారతదేశ విభజన
డి. మౌంట్‌బాటన్ ప్రణాళిక 4. ద్వంద్వ ప్రభుత్వం
ఇ. క్యాబినెట్ ప్రణాళిక, 1946 5. రాజ్యాంగ సభ
ఎ. ఎ–1, బి–2, సి–3, డి–4, ఇ–5
బి. ఎ–5, బి–4, సి–1, డి–2, ఇ–3
సి. ఎ–4, బి–5, సి–3, డి–2, ఇ–1
డి. ఎ–2, బి–3, సి–4, డి–1, ఇ–5

32. సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించడం ఏ అధికార పరిధిలోకి వస్తుంది ?
ఎ. సలహా అధికారం బి. అప్పీళ్ల విచారణపరిధి
సి. ప్రాథమిక అధికారపరిధి డి. రిట్ అధికారపరిధి

33. పూర్వ సంస్థానాధీశుల ప్రత్యేక సదుపాయాలు, బిరుదులను ఏ రాజ్యాంగ సవరణ రద్దు చేసింది ?
ఎ. 24వ సవరణ బి. 25వ సవరణ
సి. 26వ సవరణ డి. 27వ సవరణ

34. రాజ్యసభలో ఉత్తరప్రదేశ్‌కి ఎన్ని స్థానాలు ఉన్నాయి ?
ఎ. 30 బి. 31 సి. 32 డి. 33

35. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ ఏర్పాటు ?
ఎ. 97వ సవరణ బి. 98వ సవరణ
సి. 99వ సవరణ డి. 100వ సవరణ

36. పార్లమెంటులోని ఏ సభలోనూ సభ్యుడు కాని వ్యక్తి మంత్రిగా నియమించబడినప్పుడు ఏ ఆర్టికల్ ప్రకారం ఆ వ్యక్తి ఆరు నెలల సమయంలో పార్లమెంటులో ఏదో ఒక సభలో సభ్యుడు కావాల్సిన ఆవశ్యకత ఉంటుంది ?
ఎ. 74 బి. 73 సి. 75(5) డి. 76

37. 1971లో లోకాయుక్త చట్టాన్ని చేసిన తొలిరాష్ట్రం ఏది ?
ఎ. ఒరిస్సా బి. మధ్యప్రదేశ్ సి. కర్ణాటక డి. మహారాష్ట్ర

38. రాష్ట్రపతికి అతని విధులు నిర్వహించడానికి, సలహాలు ఇవ్వడానికి ప్రధానమంత్రి అధ్యక్షుడుగా గల మంత్రి మండలి ఏర్పాటు చేయబడి ఉంటుంది అని ఏ అధికరణలో పేర్కొనబడింది?
ఎ. 74 బి. 110 సి. 75 డి. 77

39. భారత రాష్ట్రపతి రాజ్యాంగంలో ఏ నిబంధన ప్రకారం ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం కలిగి ఉన్నారు ?
ఎ. 123 బి. 124 సి. 126 డి. 136

40. హైకోర్టు న్యాయమూర్తి పదవీ విరమణ వయస్సు ?
ఎ. 65 సంవత్సరాలు బి. 62 సంవత్సరాలు
సి. 58 సంవత్సరాలు డి. 55 సంవత్సరాలు

41. 'మార్షల్‌లా' అమలులో ఉన్న ప్రాంతాలలో ప్రాథమిక హక్కులు ఏ విధంగా అమలు జరగాలో ఏ నిబంధన ప్రకారం పార్లమెంట్ నిర్ణయిస్తుంది ?
ఎ. 31 బి. 33 సి. 34 డి. 32

42. ప్రాథమిక హక్కులపై ఆదేశ సూత్రాలకు ఆధిక్యం కలదని మొట్టమొదటి సారిగా పేర్కొన్న రాజ్యాంగ సవరణ ఏది ?
ఎ. 42 బి. 44 సి. 26 డి. 25

43. కింది వాటిని జతపరచండి ?
ఎ. 40వ అధికరణం 1. కార్మికులకు కనీస వేతనం
బి. 41వ అధికరణం 2. పని హక్కు, విద్యా హక్కు, ప్రజా సహాయపు హక్కు
సి. 42వ అధికరణం 3. గ్రామ పంచాయితీల ఏర్పాటు
డి. 43వ అధికరణం 4. సరి అయిన పని పరిస్థితులు స్త్రీలకు ప్రసూతి సౌకర్యాల కల్పన
ఎ. ఎ–3, బి–2, సి–4, డి–1
బి. ఎ–4, బి–3, సి–2, డి–1
సి. ఎ–2, బి–3, సి–4, డి–1
డి. ఎ–1, బి–2, సి–4, డి–3

44. 86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భారత రాజ్యాంగానికి చేర్చిన 11వ ప్రాథమిక విధి ఏది ?
ఎ. ప్రజల ఆస్తులను సంరక్షించాలి
బి. శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించాలి
సి. పురాతన కట్టడాలను సంరక్షించాలి
డి. 6–14 ఏళ్లలోపు పిల్లలందరికీ తండ్రి లేదా సంరక్షకుడు విద్యావకాశాలు కల్పించాలి

45. కింది వారిలో తాత్కాలిక భారత రాష్ట్రపతిగా వ్యవహరించిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ?
ఎ. జస్టిస్ మెహర్‌చంద్ మహాజన్ బి. జస్టిస్ హిదయతుల్లా
సి. జస్టిస్ పి.ఎన్.భగవతి డి. జస్టిస్ వై.వి చంద్రచూడ్

46. షెడ్యూల్డ్ ప్రాంతాలలో అమలు చేసే 'పైసా' చట్టం చేసిన సంవత్సరం ?
ఎ. 1986 బి. 1993 సి. 1996 డి. 1997

47. డబుల్ జియోపార్టీ గురించి పేర్కొన్న రాజ్యాంగ నిబంధన ?
ఎ. 19 బి. 20 సి. 21 డి. 22

48. అశోక్‌మెహతా కమిటీ ఎన్ని అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సూచించింది ?
ఎ. 1 బి. 2 సి. 3 డి. 4

49. జిల్లా పరిషత్తులో స్థాయి సంఘాల సంఖ్య ?
ఎ. డి బి. 5 సి. 6 డి. 7

50. అఖిల భారత సర్వీసులను రద్దు చేయాలని సూచించిన కమిటీ ?
ఎ. సంతానం బి. బల్వంతరాయ్
సి. రాజమన్నార్ డి. సర్కారియా

సమాధానాలు : 1.డి, 2.డి, 3.ఎ, 4.డి, 5.ఎ, 6.డి, 7.సి, 8.బి, 9.బి, 10.డి, 11.బి, 12.ఎ, 13.డి, 14.సి, 15.డి, 16.డి, 17.సి, 18.బి, 19.సి, 20.సి, 21.డి, 22.ఎ, 23.డి, 24.ఎ, 25.సి, 26.డి, 27.బి, 28.బి, 29.సి, 30.సి, 31.డి, 32.సి, 33.సి, 34.బి, 35.సి, 36.సి, 37.ఎ, 38.ఎ, 39.ఎ, 40.బి, 41.సి, 42.ఎ, 43.ఎ, 44.డి, 45.బి, 46.సి, 47.బి, 48.బి, 49.డి, 50.సి. ★

పోర్టు వారోత్సవాల్లో భాగస్వాములు కండి

మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్

పోర్టు వారోత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా బందరు మండలం కరగ్రహారం గ్రామంలోని ఫరీద్‌బాబా దర్గాలో శనివారం ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చైతన్య యాత్రను ప్రారంభించి మాట్లాడారు. పోర్టు ప్రాధాన్యత కోసం ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అన్ని గ్రామాలతోపాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో చైతన్య బస్సు యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు.

దీక్షల్లో కూర్చున్న నాయకులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వరికెపుడిశెల ప్రాజెక్టు కోసం దీక్ష

ప్రజాశక్తి - వినుకొండ (గుంటూరు జిల్లా)

పల్నాడు ప్రజల సాగు, తాగు నీటి అవసరాలు తీర్చే వరికెపుడిశెల ప్రాజెక్టు నిర్మాణ సాధన కోసం జలసాధన సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వినుకొండలో శనివారం ఒక్కరోజు దీక్ష చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ప్రాజెక్టును టిడిపి హయంలోనే నిర్మిస్తామని, జులైలో పనులు చేపడతామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 5న సాధన సమితి నాయకులతో కలిసి సిఎం చంద్రబాబుతో సమావేశమవుతామని ప్రకటించారు. సిపిఎం గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి గద్దె చలయమ్య మాట్లాడుతూ నీరందుతాయనే ఆశలు సన్నగిల్లేలా ప్రభుత్వాల తీరుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌లో వరికెపుడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తూ జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తలచుకుంటే ప్రాజెక్టు నిర్మాణం కష్టమేమీ కాదన్నారు. సీనియర్ న్యాయవాది సిహెచ్‌ఎస్‌ఎల్ మూర్తి మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నుండి మిగులు జలాలు దమ్మర్లగొంది వద్ద నిలుస్తాయని, అక్కడ ప్రాజెక్టు నిర్మించి వజ్రాల చెరువు ద్వారా బొల్లాపల్లి, దుర్గి, వెల్దుర్తి, ప్రకాశం జిల్లా పులల్లచెరువు మండలాల్లోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు, తాగునీరు ఇవ్వొచ్చని వివరించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వైపిపి అధికారంలోకి వస్తే ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని, ఇక్కడి ఎమ్మెల్యేకు దీనిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

లింగ వివక్షతపై పోరాటం

- 'ప్రరవే' సమాలోచన సదస్సులో సాహితీవేత్త సతీష్‌చందర్

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

సమాజంలోని స్త్రీలు ప్రధానంగా కుల, మార్కెట్ వ్యవస్థల మధ్య నలిగిపోతూ వేదనకు గురవుతున్నారని, కులాన్ని పక్కన పెట్టకుండా స్త్రీలకు విముక్తి లభించదని ప్రముఖ సాహితీవేత్త కె.సతీష్ చందర్ పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ హిందీ శాఖలోని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సెమినార్ హాల్లో శనివారం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'సమాలోచన, వార్షిక సదస్సు' నిర్వహించారు. సదస్సులో తెలుగు రాష్ట్రాల రచయిత్రులు పాల్గొన్నారు. నాటి నుంచి నేటి వరకు సమాజంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా 'బోల్షివిక్ సదస్సు పత్రాల' పుస్తక సంకలనాన్ని ఎం.లక్ష్మి ఆవిష్కరించారు. ప్రరవే జాతీయ అధ్యక్షులు అనిశెట్టి రజిత అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త కె.సతీష్‌చందర్ మాట్లాడారు. దేశంలో కులమతాలతో లింగ బేధం ముడిపడి ఉందని పేర్కొన్నారు. పురుషులు ఎంపిక చేసుకోవడం, స్త్రీలు ఎంపిక కాబడటం అనే సంప్రదాయం నేటికీ కొనసాగుతుందన్నారు. పురుషులను ఆస్తికి వారసులుగా చేస్తూ స్త్రీని స్టేటస్ సింబల్‌గా చూస్తున్నారన్నారు. ఇటువంటి ఆలోచనా విధానాలతోనే పరువు హత్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సాహిత్యంలో కవులు, రచయితలతో పాటు విమర్శకుల పాత్ర ఎంతైనా అవసరమని స్పష్టం చేశారు. ప్రముఖ రచయిత వివి మూర్తి మాట్లాడుతూ భేదాలు లేని సమాజం ఏర్పడాలన్నారు. స్త్రీలకు బయట, అంతర్గతంగా ఎదురవుతున్న అవరోధాలను అన్వేషించుకుంటూ ముందుకు సాగాలని చెప్పారు. సదస్సులో 'పితృస్వామిక సంప్రదాయాలు-లైంగిక ఆధిపత్య ధోరణులు' అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రరవే అధ్యక్షులు డాక్టర్ తిరునగరి దేవకీదేవి, వివక్షల సాంస్కృతిక వ్యక్తీకరణ వ్యవస్థలు, రూపాలు అనే అంశంపై కొండవీటి సత్యవతి, సింగిల్ ఉమెన్ జీవితం-సామాజిక సాంస్కృతిక సమస్యలు అనే అంశంపై సజయ, లైంగిక దాడులు-వేధింపుల సాంస్కృతిక మూలాలు అనే అంశంపై ఐలా బందగీ, పితృస్వామిక సాంప్రదాయాలు-రాజకీయ కోణం అనే అంశంపై ఆచార్య ఎం.నళిని ప్రసంగించారు. కుల వ్యవస్థ-అంతర బాహ్య సాంస్కృతిక సవాళ్ళు అనే అంశంపై ఐద్వా నగర కార్యదర్శి జి.ప్రియాంక, మత వ్యవస్థ-అంతర బాహ్య సాంస్కృతిక సవాళ్ళు అనే అంశంపై జహారా, ఆదివాసీ మహిళ-సామాజిక సాంస్కృతిక సవాళ్ళు పద్దం అనసూయ, ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణం-స్త్రీల ప్రాతినిధ్యం అనే అంశంపై బి.అనురాధ ప్రసంగించారు.

'వాక్ విత్ రైటర్స్' పేరిట ప్రదర్శన

అంతకుముందు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన రచయిత్రులు 'వాక్ విత్ రైటర్స్' పేరిట ప్రదర్శన నిర్వహించారు. ఎయు హిందీ విభాగం నుంచి సిరిపురం సెంటర్ వరకు ప్రదర్శనగా వెళ్ళి తిరిగి అక్కడికే చేరుకున్నారు. ర్యాలీని కృష్ణాబాయి, జి.సీతామహలక్ష్మి, అనిల్ డ్యాని ప్రారంభించారు. ప్రాంగణంలో ప్రరవే జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అనిశెట్టి రజిత, కెఎన్.మల్లీశ్వరి జెండావిష్కరణ చేసి సదస్సును ప్రారంభించారు.



'బోల్షివిక్ సదస్సు పత్రాల' పుస్తక సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న సతీష్‌చందర్, లక్ష్మి తదితరులు

జనసేనలో డిప్యూటీ సిఎం సోదరుడు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం (తూర్పుగోదావరి)

ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప సోదరుడు బాపూజీ శనివారం జనసేనలో చేరారు. చినరాజప్ప స్వగ్రామమైన తూర్పుగోదావరి ఉప్పలగుప్తం మండలం పెదగాడవెల్లిలో జనసేన పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో బాపూజీ చేరారు. ఆ పార్టీ నాయకులు యర్ర నాగబాబు, ఇటుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఏడిద శ్రీను, శెట్టిబత్తుల రాజబాబు తదితరుల సమక్షంలో బాపూజీ జనసేనపార్టీ కండువా కప్పుకున్నారు. రాజప్పకు ముగ్గురు సోదరులున్నారు. వీరిలో మొదటి సోదరుడు బాపూజీ, రెండో సోదరుడు సత్తిబాబు వీరిద్దరూ వ్యవసాయ పనులను చూస్తుంటారు. మూడో సోదరుడు జగ్గయ్యనాయుడు ప్రస్తుతం పెదగాడవెల్లి సహకార సొసైటీ అధ్యక్షులుగా కొనసాగుతూ టిడిపి క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా కొనసాగుతున్నారు. ఇన్నాళ్లూ రాజకీయాలకు దూరంగా ఉన్న మంత్రి సోదరుడు బాపూజీ తాజాగా జనసేనలో చేరడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

'మధ్యాహ్న' కార్మికుల రాయబార ర్యాలీ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

తమకు నెలకు రూ.ఐదు వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు విజయనగరం ఎంపి పి.అశోక్‌గజపతిరాజు ఇంటివరకూ శనివారం రాయబార ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం ఆధ్వర్యాన కార్మికులు స్థానిక ఎల్‌బిజి భవనం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సు, మయూరి జంక్షన్, ఎత్తుబ్రిడ్జి మీదుగా ర్యాలీగా అశోక్ ఇంటికి చేరుకున్నారు. ఎంపి అందుబాటులో లేకపోవడంతో ఆయన పిఎకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సుధారాణి మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతను జిల్లాలో పలుచోట్ల నవప్రయాస్ సంస్థకు అప్పగించడం వల్ల విద్యార్థులు నాసిరకమైన భోజనం తినలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే ఈ పథకాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ స్కీమ్‌లోని కార్మికులకు గ్యాస్ సబ్సిడీపై ఇచ్చే మెనూ ఛార్జీలు, బకాయి బిల్లులు, వేతనాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపి జోక్యం చేసుకొని తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.


విశాఖలో ఆర్టీసీ కార్మికుల ప్రదర్శన

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు, ఎస్‌డబ్ల్యుఎఫ్ ఎన్‌ఎంయు, ఎఐటియుసి ఆధ్వర్యాన ఆర్‌టిసి కార్మికులు శనివారం పలు జిల్లాల్లో 'చలో ఆర్‌ఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగరంలో ఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సమ్మె సన్నాహకంలో భాగంగా శ్రీకాకుళంలోని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 50 శాతం ఫిట్‌మెంట్ వెంటనే అమలు చేయాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించకుండా ఈ నెల ఐదో తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలో వెళతామని నాయకులు స్పష్టం చేశారు. సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్‌ఎంయు రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. జిల్లాలోని 11 డిపోల నుంచి కార్మికులు పాల్గొన్నారు. ఎన్‌ఎంయు జోనల్ కార్యదర్శి శ్రీనివాసరాజు తదితరులు ప్రసంగించారు. కర్నూలులో ఆర్‌టిసిలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

జిఒ 25ను అమలు చేయాలి

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

సమాజంలో అట్టగుడు వర్గాల అభివృద్ధి కోసం నిర్దేశించిన జీవో 25ను ఎస్‌సి ఉపకులాలకు లబ్ధిచేకూర్చే విధంగా అమలు చేయాలని నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కవలకుంట్ల గోవింద ప్రసాద్ డిమాండ్ చేశారు. మాదిగ, దాని ఉపకులాల డిమాండ్ల సాధన కోసం సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద శనివారం దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తోళ్ల పారిశ్రామిక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దీక్షలను ఎస్‌సి, ఎస్‌టి, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలేటి అమృత ప్రారంభించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాతపూడి ప్రభుదాస్‌తో పాటు చిత్తూరు జిల్లా నాయకులు దీక్షలో కూర్చున్నారు.

పట్టాల కోసం సాగుదారుల ధర్నా

ప్రజాశక్తి- ఎచ్చెర్ల (శ్రీకాకుళం)

అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేసి, వాస్తవ సాగుదారులకు పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సాగుదారులు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. చిలకపాలెం జంక్షన్ నుంచి ర్యాలీగా వచ్చి నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఈనాందారీ ఎబాలిషన్ యాక్ట్ ప్రకారం సాగులో ఉన్న భూమికి రైత్వారీ పట్టా మంజూరు చేసేటప్పుడు, ఎవరైతే ఆ భూమిలో సాగుదారులుగా ఉన్నారో వారికి 1/3వ వంతు భూమికి పట్టాలిచ్చి హక్కుదారుడిగా ప్రకటించాల్సి ఉందన్నారు. నారాయణపురం భూములకు రైత్వారీ పట్టాలు ఇచ్చినప్పుడు దీన్ని ఉల్లంఘించారని విమర్శించారు. బంజరు భూమిలో ఎవరికైనా ఐదెకరాలకు మించి పట్టా ఇవ్వకూడదని తెలిపారు. అప్పటి తహశీల్దార్ ఏకంగా 127 ఎకరాల బంజరు భూమిని అంధవరపు గోవిందరాజులు కుటుంబీకులకు పట్టాలు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. చట్టవ్యతిరేకంగా పెత్తందారులకు మంజూరు చేసిన పట్టాలను రద్దు చేసి, తరతరాలుగా సాగులో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 15 నుంచి తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నిమ్జ్ హామీ ఏమైందో చెప్పాలి

- పరిశ్రమ పేరుతో భూములు లాగేశారు
- వామపక్షాలు, జనసేన సభలో వక్తల డిమాండ్



కనిగిరి సభలో మాట్లాడుతున్న రామకృష్ణ, వేదికపై వి.శ్రీనివాసరావు, కదిరి భవాని తదితరులు

ప్రజాశక్తి-కనిగిరి (ప్రకాశం)

పరిశ్రమల పేరుతో భూములు లాగేశారని, కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వాన్ని వక్తలు ప్రశ్నించారు. సిపిఎం, సిపిఐ, జనసేన కూటమిని బలపరచాలని కోరుతూ శనివారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహం నుంచి ఎంఎస్‌ఆర్ రోడ్డు వరకు ఆ పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎంఎస్‌ఆర్ రోడ్డులోని సుగుణావతమ్మ సెంటర్‌లో సిపిఎం కనిగిరి ప్రాంతీయ కమిటీ నాయకులు పీసీ కేశవరావు, సిపిఐ నాయకులు సయ్యద్ యాసిన్ అధ్యక్షత వహించిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. కిడ్నీ వ్యాధుల బారిన పడి ప్రజలు అల్లాడు తున్నారన్నారని, కనిగిరి ప్రాంతం మరో ఉద్దానంగా మారిపోయిందనీ అన్నారు. వెలుగొండను పూర్తి చేసి పశ్చిమ ప్రకాశంను సస్యశ్యామలం చేస్తానని సిఎం చంద్రబాబు మూడు సార్లు చెప్పారన్నారు. సంక్రాంతి వస్తూ పోతుందని ప్రాజెక్టు మాత్రం పూర్తి కావటం లేదని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి అయ్యేది లేదని నీరు వచ్చి కరువు తీరే పరిస్థితి లేదన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటు చేస్తామని చెప్పి రైతులు భూమలు తీసుకుకోవటమే తప్ప ఆ హామీ ఆచరణకు నోచుకోలేదన్నారు. ఉపాధి కరువై ప్రజలు వలసలు పోతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమలు స్థాపించకపోవటానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనిగిరికి 100 పడకల వైద్యశాల కూడా లేదని, కనీసం మత్తు వైద్యునిని కూడా నియమించలేని దుస్థితిలో పాలన సాగుతోందని విమర్శించారు. జనసేన కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి భవాని మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అభివృద్ధి శూన్యమని, ఇసుకమాఫియా పెరిగి పోయిందని, పాలన అధ్వానంగా ఉందని, ఎమ్మెల్యే పట్టించుకోకపోవటంతోనే అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఈ పరిస్థితుల నుంచి బయట పడాలంటే వామపక్ష, జనసేన కూటమిని బలపరచాలని కోరారు.

ప్రజ్ఞ జవాబులు

1.హర్యాన
2.రాజీవ్ చోప్రా
3.మథాలిరాజ్
4.చైనా
5.ఖతార్

అండ్రూ మైనింగ్‌పై ఐటి శాఖ దాడులు



ప్రజాశక్తి - ప్రత్తిపాడు (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ మైనింగ్ ఆండ్రూ మినరల్స్ మైనింగ్ సంస్థపై ఐటిశాఖ అధికారులు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ తనిఖీలు నిర్వహించారు. కొన్ని లారీలను, కీలకమైన పత్రాలను, కంప్యూటర్ బిల్లులను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. రావికంపాడు, డంపింగ్‌యార్డు వద్దకు కూడా కొంతమంది అధికారులు చేరుకుని లారీలను నిలిపివేసి, బిల్లులను స్వాధీనం చేసుకుని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మైనింగ్ యాజమాన్యం వచ్చేసరికే ఐటిశాఖ అధికారులు కొన్ని గదుల తాళాలు బద్దలకొట్టి రికార్డులను, బిల్లులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. లారీలు ఎక్కడికక్కడ నిలిపివేయడంతోపాటు మైనింగ్ సంస్థలో పనిచేసే కొంతమంది ఉద్యోగులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

మీడియాకు వివరాలు చెప్పేందుకు అధికారులు నిరాకరించారు. ఈ సందర్భంగా మైనింగ్ మేనేజర్ రామస్వామి మాట్లాడుతూ ఐటి శాఖాధికారులు ఎక్కడి నుంచి వచ్చారో కూడా తెలియదని, సుమారు 10 మంది వరకు ఉంటారని తెలిపారు.

సిపిఎం పోరాటం, పవన్ సందర్శన నేపథ్యంలోనే దాడులు

రెండు నెలల క్రితం తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్ మైనింగ్ అవినీతిపై విరుచుకుపడ్డారు. వంతాడ ప్రాంతాన్ని సందర్శించి, వివరాలు తెలుసుకున్నారు. వంతాడ మైనింగ్‌లో అవినీతిపై సిపిఎం పలు పోరాటాలు నిర్వహించింది. మూడేళ్లుగా ఆండ్రూ మినరల్స్ సంస్థ మైనింగ్ నిర్వహిస్తున్నప్పటికీ పట్టించుకోని ఐటి శాఖాధికారులు ఇటీవలి పరిణామాల నేపథ్యంలోనే దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది.

వ్యాట్‌ను రద్దు చేయాలి

ఎపి టెక్స్‌టైల్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి - భవానీపురం (విజయవాడ)

తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా ఉన్న 2011-13 సమయంలో వస్త్రాలపై విధించిన వ్యాట్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని ఎపి టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. వన్‌టౌన్ పంజా సెంటర్‌లోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో ఎపి టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, కోశాధికారి వెలంపల్లి రామచంద్రరావు మాట్లాడారు. వ్యాట్ ట్యాక్స్‌ను అప్పటి ముఖ్యమంత్రి రద్దు చేసినా, తిరిగి తెలుగుదేశం ప్రభుత్వంలో సంబంధిత కమర్షియల్ ట్యాక్స్ అధికారులు వస్త్ర వ్యాపారులకు నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే జోక్యం చేసుకుని వ్యాట్స్ ట్యాక్స్‌ను రద్దుచేసేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే వస్త్ర వ్యాపారులు మరోసారి ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఎపి టెక్స్‌టైల్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బిజెపి శ్రీనివాస్, సెక్రటరీ బచ్చు ప్రసాద్, పొట్టి ఆంజనేయులు, వల్లంకొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

'కోట్ల' టిడిపిలో చేరితే బిసిలకు నష్టం లేదు

డిప్యూటీ సిఎం కెఇ కృష్ణమూర్తి - కర్నూలు వైద్యశాలలో అభివృద్ధికి పనులకు శంకుస్థాపన


కర్నూలు ప్రభుత్వ వైద్య శాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉపముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి, మంత్రి ఎన్‌ఎండి.ఫరూఖ్ తదితరులు.

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/జిల్లా పరిషత్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిడిపిలో అందరికీ న్యాయం చేస్తారని ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా విజన్-2024 యాక్షన్ ప్లాన్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి టిడిపిలో చేరుతారనే ఊహాగానాలపై కెఇ మీడియాతో మాట్లాడారు. పార్టీలో కోట్ల చేరితే బిసిలకు ఎలాంటి నష్టం జరగదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో కర్నూలు జిల్లాలో అనేక కొత్త ప్రాజెక్టులను చేపట్టిందని తెలిపారు. ఓర్వకల్లు వద్ద ప్రతిష్టాత్మకమైన సోలార్‌పార్కు, వెయ్యి ఎకరాలలో విమానాశ్రయం చేపట్టామన్నారు. ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. హంద్రీనీవా వెంట ఉండే 68 చెరువులను నీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.6.18 కోట్లతో చేపడుతున్న ప్రాంతీయ కంటి ఆసుపత్రి శిలాఫలకాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూఖ్‌తో కలిసి ఆవిష్కరించారు. మెడికల్ కళాశాలలో డైమండ్ జూబ్లీ ఉత్సవాలకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, జడ్పీ ఛైర్మన్ మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ కెఇ.ప్రభాకర్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హిందూపురంలో అభివృద్ధి పనులు

ఆటో నడిపిన బాలయ్య

ప్రజాశక్తి- హిందూపురం



ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి చెందాలనేదే టిడిపి లక్ష్యమని, ఆ దిశగా పథకాలు ప్రవేశపెట్టి ముందుకెళ్తున్నామని హిందూ పురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం అనంతపురం జిల్లా హిందూ పురానికి వచ్చిన ఆయన తొలుత సూగూరు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఆటో ర్యాలీని ప్రారంభించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సూరప్ప కుంటలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎకో పార్క్, ఎంజిఎం మైదానంలో పసుపు, కుంకుమ-2 కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్న మార్కెట్‌లో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. బాలకృష్ణ మాట్లాడుతూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన కాంగ్రెస్‌కు ఎలాంటి గుణపాఠం చెప్పామో బిజెపికి అదే గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బాలకృష్ణ భార్య వసుంధర, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి, అంబికా లక్ష్మినారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జెఇ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి నిరంకుశ పోకడలు

ఆనంద్ తెల్తుంబ్డె అరెస్టుపై సిపిఎం

ఇండియా న్యూస్ నెట్‌వర్క్-న్యూఢిల్లీ : భీమా కోరేగావ్ అల్లర్ల కేసులో ఆనంద్ తెల్తుంబ్డెను పూణే పోలీసులు అరెస్టు చేయడాన్ని సిపిఎం పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. దీనిని ప్రభుత్వ నిరంకుశ దాడిగా అభివర్ణించింది. ఈ కేసులో ఆనంద్ తెల్తుంబ్డెను అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు నాలుగు వారాల రక్షణ కల్పించింది. ఈ గడువు ఈ నెల 11 వరకూ ఉంది. అయినా ఆనంద్‌ను అరెస్టు చేయడం బిజెపి ప్రభుత్వ ప్రతీకార ధోరణిని సూచిస్తోందని పొలిట్ బ్యూరో పేర్కొంది. మానవ హక్కులు, లౌకిక, ప్రగతిశీల కార్యకర్తలపై 'అర్బన్ నక్సల్స్' పేరుతో సంఘ పరివార్ దాడులకు దిగుతోందని విమర్శించింది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై అప్రజాస్వామిక, నిరంకుశ దాడిని ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ తీవ్రంగా ప్రతిఘటించాలని పొలిట్ బ్యూరో పిలుపునిచ్చింది.

ఫాస్టెట్ ట్రైన్‌పై రాళ్ల దాడి



దేశంలో అత్యంత వేగవంతమైన రైలు ట్రైన్ 18కి ఇటీవల ఢిల్లీ- ఆగ్రా మధ్య నిర్వహించిన ట్రైయిల్ రన్‌లో గుర్తు తెలియని దుండగులు రాళ్ల దాడికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ-రాజధాని రూట్‌లో ఈ రైలు గంటకు 180 కిమీల వేగం అందుకుని రికార్డు నెలకొల్పింది.

అహ్మద్ పటేల్ ఎన్నికను సవాలు చేస్తూ.. దాఖలైన పిటిషన్ అదృశ్యం

దర్యాప్తునకు ఆదేశించిన హైకోర్టు

అహ్మదాబాద్ : కాంగ్రెస్ నాయకుడు అహ్మద్‌పటేల్ రాజ్యసభకు ఎన్నికైన విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌కు సంబంధించిన కాపీ.. కోర్టు రికార్డుల నుంచి మిస్సైంది. దీనితో గుజరాత్ హైకోర్టు.. ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. 2017 ఆగస్టులో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బల్వంత్‌సిన్హా రాజ్‌పూత్‌పై అహ్మద్ పటేల్ గెలిచారు. అయితే కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు పొందడానికి అహ్మద్ పటేల్ వారికి లంచం ఎర చూపాడన్నది రాజ్‌పూత్ ఆరోపణ. ఈ విషయంలో ఆయన గుజరాత్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు జస్టిస్ బేల త్రివేది ముందు రాజ్‌పూత్ క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్న సమయంలో పిటిషన్ మిస్ అయినట్టు వెలుగులోకి వచ్చింది. దీనితో ఈ ఘటనపై దర్యాప్తు జరపాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ హెచ్‌డీ సుతార్‌ను త్రివేది ఆదేశించారు. నివేదికను ఫిబ్రవరి 8లోగా సీల్డు కవర్‌లో సమర్పించాలని తెలిపారు. అలాగే రాజ్‌పూత్ క్రాస్ ఎగ్జామినేషన్‌ను కూడా ఆ రోజు వరకు న్యాయస్థానం నిలిపేసింది.



అమెరికాలో విద్యార్థుల నిర్బంధంపై భారత్ ఆందోళన

న్యూఢిల్లీ : అమెరికాలో బోగస్ యూనివర్సిటీ వలలో చిక్కుకున్న విద్యార్థులను నిర్బంధించడం పట్ల భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. నిర్బంధంలోఉన్నవారిని విడుదల చేసేందుకు సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయాన్ని అమెరికా దౌత్య కార్యాలయం కూడా ధ్రువీకరించింది. ఫేక్ యూనివర్సిటీ అధికారుల చేతిలో మోసపోయిన విద్యార్థుల విడుదలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని భారత్ కోరింది. ఈ కేసుకు సంబంధించి గురువారం వరకూ అరెస్టయిన 130 మంది విద్యార్థుల్లో 129 మంది భారతీయులు ఉన్నారని యుఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు వెల్లడించారు. అరెస్టయిన వారిలో విద్యార్థులను దౌత్య అధికారులు కలిసారని, మిగతా వారిని కూడా కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు భారత్ తెలిపింది.

మోడీ పర్యటనకు నిరసనగా బంద్

- గృహ నిర్బంధంలో హురియత్ నేత



శ్రీనగర్ : ఆదివారం జమ్ముకాశ్మీర్‌లో జరపతలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు నిరసనగా వేర్పాటువాదులు బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో హురియత్ కాన్ఫరెన్స్ చైర్మన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్‌ను పోలీసులు గృహ నిర్బంధంలో వుంచారు. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాక్ ప్రభుత్వంతో మిర్వాయిజ్ సత్సంబంధాలు నెలకొల్పుతున్నాడని అధికారులు ఆరోపించారు. 'నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టంచేసింది. నిరసనకారులపై ఉక్కు పాదం మోపుతూ భయానక వాతావరణం సృష్టించింది. లాల్ చౌక్‌లో సైతం కూంబింగ్, సోదాలు చేపట్టింది. శనివారం ఉదయం నుండి తనను గృహ నిర్బంధంలో ఉంచారంటూ మిర్వాయిజ్ ట్వీట్ చేశారు.

ప్రయాణికుడి లగేజీ బ్యాగులో 'చిరుత పిల్ల'

అదుపులోకి తీసుకున్న అధికారులు



చెన్నై : సాధారణంగా బంగారం, మాదకద్రవ్యాలు వంటి వాటిని స్మగ్లింగ్ చేయడం చూస్తుంటాం. కానీ ఒక ప్రయాణికుడు ఏకంగా ఒక చిరుత పిల్లను థాయ్‌లాండ్ నుంచి చెన్నైకు విమానంలో తీసుకువచ్చాడు. శనివారం ఉదయం ఎయిర్‌పోర్టు ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆ ప్రయాణికుడి లగేజీని కస్టమ్స అధికారులు పరిశీలి ంచగా ఒక బ్యాగులో చిరుత పిల్ల ఉంది. వెంటనే అతన్ని, చిరుత పిల్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఖాజా మొయిద్దీన్‌గా అధికారులు గుర్తించారు. అనంతరం తదుపరి విచారణ కోసం తమిళనాడు అటవీ అధికారులకు అప్పగించారు. థాయ్‌లాండ్ నుంచి అటవీ జంతువులను అక్రమరవాణా చేయడంపై ఇప్పటికే నిషేదం ఉంది.

నల్లధనం కేసులో గౌతమ్ కస్టడీ పొడిగింపు



న్యూఢిల్లీ : నల్లధనం, మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన న్యాయవాది గౌతమ్ ఖైతన్ రిమాండ్‌ను ఢిల్లీ హైకోర్టు మరో ఆరు రోజుల పాటు పొడిగించింది. అక్రమంగా పలు విదేశీ బ్యాంకుల్లో ఖాతాలు కలిగివున్నారన్న ఆరోపణలపై గౌతమ్‌ను గతవారం ఇడి కస్టడీకి హైకోర్టు అప్పగించింది. బ్లాక్ మనీ(అస్పష్టమైన విదేశీ ఆదాయం, ఆస్తులు), ఇంపోజిషన్ ఆఫ్ టాక్స్ యాక్ట్ 2015లోని సెక్షన్ 51 కింద ఆదాయపన్ను శాఖ కేసు నమోదు చేయగా దీని ఆధారంగా మనీలాండరింగ్ నిరో ధక చట్టం కింద తాజా మరో కేసును ఇడి దాఖలు చేసింది. వివిఐపి చాపర్ కుంభకోణంలో కూడా ఆయన హస్తం ఉందని వెల్లడైంది. ఐడిఎస్ ఇన్ఫోటెక్ అనే సంస్థకు కీలక మధ్యవర్తిగా వ్యవహరించాడని, మరో నిందితుడైన రాజీవ్ సక్సే నాకు పెద్ద మొత్తాలను ఈ సంస్థ ద్వారా చెలించాడన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైంది.

రాబర్ట్ వాద్రాకు ముందస్తు బెయిల్



న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ కేసులో సోనియా గాంధీ అల్లుడు, వ్యాపార వేత్త రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ హైకోర్టు శనివారం ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. ఆయనకు ఈనెల 16వ వరకు అరెస్టు నుండి తాత్కాలిక రక్షణ కల్పించింది. లండన్‌లో స్థిరాస్తి కొనుగోలు వ్యవహారంలో వాద్రా అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఇడి మనీలాండరింగ్ కేసు నమోదుచేసింది. అయితే ముందస్తు బెయిల్‌ను కోరుతూ శుక్రవారం వాద్రా కోర్టును ఆశ్రయించారు. తమ క్లయింట్ లండన్‌లో ఉన్నారని, ఈ నెల 6న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు సహకరిస్తారని ఆయన తరుపు న్యాయవాది కెటి తులసి తెలిపారు. వాద్రా పిటిషన్‌పై తదుపరి విచారణకు తేదీలను వెల్లడించాలని ఇడికి కోర్టు సమన్లు జారీ చేసింది. అదేవిధంగా లక్ష రూపాయల పూచీకత్తు వాద్రా చెల్లించాలని ఆదేశించింది. మరో నిందితుడు, వాద్రాకు అత్యంత సన్నిహితుడు మనోజ్ అరోరాకు ఇప్పటికే బెయిల్ పొందారు.

బీహార్‌లో నితీష్‌కు షాక్

జెడి(యు)కి రిషిమిశ్రా గుడ్‌బై

పాట్నా : బీహార్‌లో జెడి(యు) అధినేత నితీష్‌కుమార్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన రిషిమిశ్రా శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ బీహార్ శాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్‌ఝా అయన్ను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ గత ఎన్నికల్లో బిజెపిపై పోటీ చేసిన తాను ఇప్పుడు అదే పార్టీతో కలిసి పనిచేయడం కుదరదని, దీనిని తన నియోజకవర్గ ప్రజలు హర్షించరని తెలిపారు. ఈ కారణంలో పార్టీని వీడానన్నారు. మిశ్రా 2015 ఎన్నికల్లో దర్భంగా జిల్లాలోని జెల్ అసెంబ్లీ స్థానంలో ఓటమి పాలయ్యారు.

కర్ణాటకలో బిజెపి మరో డ్రామా



ప్రజాశక్తి ప్రతినిధి- బెంగళూరు : కర్ణాటకలో బిజెపి మరో రాజకీయ డ్రామాకు తెగబడుతోంది. ఈ నెల 8న కుమార స్వామి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టడానికి అవకాశం లేదని, ఈ లోగానే కుప్పకూలుతుందని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది, షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6న అసెంబ్లీని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉంటుంది. అయితే దీనికి ముందుగానే అంటే ఈ నెల 4న కనీసం 18 మంది జెడిఎస్ ఎమ్మెల్యేలు గవర్నర్‌ను కలిసి ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకున్నట్లు ప్రకటిస్తారని, దీంతో బడ్జెట్ ప్రతిపాదనకు ముందే బలం నిరూపించుకోవాలని కుమారస్వామిని గవర్నర్ ఆదేశిస్తారని బిజెపి వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తోంది. ఇప్పటికే 20 నుంచి 25 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కుమారస్వామితో 'టచ్'లో లేరని కూడా అభూతకల్పనలు చేస్తోంది.

అయితే ఈ ప్రచారాన్ని కాంగ్రెస్, జెడిఎస్ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. తమ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టడం ఖాయమని వారు చెబుతున్నారు. కుట్ర పూరిత రాజకీయాల్లో భాగంగానే బిజెపి ఇలాంటి ప్రచారం చేస్తోందని విమర్శించారు. అలాగే కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్, జెడిఎస్ నేతలు విమర్శలు గుప్పించారు.

బెంగాల్‌లో నేడు ప్రజా కవాతు : సూర్యకాంత్ మిశ్రా

ప్రజాశక్తి ప్రతినిధి-కోల్‌కతా : సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం కోల్‌కతాలో జరిగే పీపుల్స్ బ్రిగేడ్ (ప్రజా కవాతు)ను అంచనాలకు మించి అత్యంత భారీగా నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంత మిశ్రా తెలిపారు. ఈ ప్రజా కవాతును ప్రజలే నిర్వహించారని అంటూ, ప్రభుత్వాలు నిర్వహించే ర్యాలీకి, ప్రజలు నిర్వహించే ర్యాలీకి వున్న తేడాను గమనించవచ్చునని అన్నారు. ప్రజా కవాతు కోసం ప్రతీ ఇంటికి ఇంటికి తిరిగి ప్రచారం చేశామని వెల్లడించారు. కాగా, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను బిజెపి ఎన్నికల 'ప్రచార బడ్జెట్'గా ఆయన అభివర్ణించారు. నిజమైన బడ్జెట్‌ను లోక్‌సభ ఎన్నికల అనంతరమే కొత్త ప్రభుత్వం ప్రవేశపెడుతుందని తెలిపారు సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో ప్రభుత్వానికి తెలియదని అన్నారు.

'బెంగాల్‌లో ప్రజాస్వామ్యం లేదు'

- మమతపై మోడీ ధ్వజం
- ర్యాలీలో తొక్కిసలాట : పలువురికి గాయాలు



దుర్గాపూర్/తకూర్‌నగర్/కోల్‌కతా : తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ బెంగాల్‌లో ప్రజాస్వామ్యం గొంతు నులుముతున్నారని ప్రధాని మోడి శనివారం ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో ప్రారంభించిన మోడీ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారని అన్నారు. మమత బెనర్జీకి ఎన్నికల భయం పట్టుకుందని, అందుకే తమ పార్టీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాల కూటమి ఏర్పాటుకు యత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. 'టోల్‌బాజి పన్ను'తో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న తృణమూల్ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు విఘాతం కలిగించిందని, తృణమూల్ కార్యకర్తలు తరుచూ తమ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి దశాబ్దాలు గడిచిన తరువాత కూడా రాష్ట్రంలోని గ్రామాలు నిర్లక్ష్యానికి గురికావడం దురదృష్టకరమన్నారు. అంతకుముందు ఉత్తర 24 పరగణాల జిల్లాలోని మతువా కమ్యూనిటి ప్రాబల్యం గల తకూర్‌నగర్‌లో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ముస్లిమేతర మైనార్టీలకు భారత పౌరసత్వం కల్పించే ఉద్దేశంతోనే పౌరసత్వ బిల్లు తెచ్చామని, స్వాతంత్ర్యానంతరం ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ (తూర్పు పాకిస్తాన్)లలో స్థిరపడ్డ హిందువులు, సిక్కులు, జైనులు, పార్సీలు కోసమే ఈ బిల్లు తీసుకు వచ్చామన్నారు. రాజ్యసభలో ఈ బిల్లుకు మద్దతివ్వాలని తృణమూల్ కాంగ్రెస్‌ను కోరారు. రైతులు, కూలీలు, మధ్యతరగతి వర్గాలతో సహా అందరికి కేంద్ర బడ్జెట్ వల్ల మేలు జరగుతుందన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రకటించిన రుణమాఫీ తీరును ఆక్షేపిస్తూ, కష్టాల్లో ఉన్న రైతులను వన్‌టైమ్ రుణమాఫీ పేరుతో ప్రతిపక్షాలు పక్కదోబ పట్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇటువంటి పథకాల వల్ల రైతులకు ప్రయోజనం చేకూరదన్నారు..కాగా మోడీ పాల్గొన్న ర్యాలీలో తొక్కిసలాట జరగడంతో బ్యారికేడ్లు ధ్వంసమై మహిళలు, పిల్లలతో సహ పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.

సిమిపై మరో ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ : స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)పై కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ మరో ఐదేండ్ల పాటు నిషేధాన్ని పొడిగించింది. ఈ మేరకు ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశంలో పలు ఉగ్రకార్యకలాపాలకు పాల్పడిన సిమిని చట్టవ్యతిరేకమైన సంస్థగా కేంద్రం ప్రకటించింది. ఆ సంస్థ చట్టవ్యతిరేక కార్యకలాపాలను తక్షణమే నియంత్రించకపోతే దేశంలో అనేక చర్యలకు అంతరాయం కలిగిస్తూ, అజ్ఞాతంలో ఉన్న కార్యకర్తలను మళ్లీ ఉగ్రకార్యకలాపాలకు పురిగొల్పుతూ దేశంలో లౌకికవాదానికి భంగం కలిగిస్తుందని పేర్కొన్నది. తన కార్యకలాపాలతో మతతత్వం ద్వారా ప్రజల మెదళ్లను సిమి సంస్థ కలుషితం చేస్తోందని తెలిపింది. అలాగే ఆ సంస్థ సభ్యులు పాల్గొన్న ఉగ్రకార్యకలాపాలకు సంబంధించిన 58 కేసులను కేంద్రం వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు గురువారం నుంచి అమలులోకి రానున్నాయి. కాగా, సిమిపై కేంద్రం విధించిన నిషేధాన్ని ట్రిబ్యునల్ ధ్రువీకరించాల్సి ఉంటుంది.

ప్రియాంకపై దుష్ప్రచారానికి వ్యతిరేకంగా... ఎఫ్ఐఆర్‌ల నమోదు

న్యూఢిల్లీ : క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్న ప్రియాంక గాంధీ వాద్రాను లక్ష్యంగా చేసుకుంటూ జరుగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం సిద్దమైంది. ప్రియాంకపై బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రేపు(సోమవారం) దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయనున్నట్టు ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుష్మితా దేవ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆమె ట్విట్టర్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. గత కొన్ని రోజులుగా ప్రియాంకపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు తనకు బాధను కలిగించాయన్నారు. ప్రియాంకపై జరుగుతున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా తాను ఢిల్లీలో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులు తమతమ రాష్ట్రాల్లోని రాజధానుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆమె కోరారు. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ తూర్పు యూపీ ఇంచార్జ్‌గా ప్రియాంక పేరు తెరపైకి రావడంతో బీజేపీ నాయకులు ఆమెపై అమర్యాదకరంగా వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ప్రియాంకకు అందం తప్ప రాజకీయాల్లోకి రావడానికి వేరే యోగ్యత లేదని బీజేపీ నాయకుడు వినోద్ నరైన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే.

తమిళనాడు పిసిసి చీఫ్‌గా అళగిరి

న్యూఢిల్లీ : తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షుడిగా కరుణానిధి పెద్ద కుమారుడు కేఎస్ అళగిరిని నియమించారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్లుగా హెచ్. వసంత కుమార్, కె. జయకుమార్, ఎంకే విష్ణు ప్రసాద్, మయూర జయకుమార్‌లను నియమించారు. ఈ మేరకు శనివారం రాత్రి కాంగ్రెస్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటి వరకూ తమిళనాడు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన తిరునవక్కరసర్ పార్టీకి చేసిన సేవలను కాంగ్రెస్ ఈ ప్రకటనలో ప్రశంసించింది.

జమ్మూకాశ్మీర్‌కు ఈసీ బృందం!

న్యూఢిల్లీ : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిర్ణయం తీసుకునేముందు రాష్ట్రంలో పరిస్థితిని సమీక్షించాలని ఈసీ నిర్ణయంచింది. ఈ మేరకు వచ్చేవారం ఈసీ బృందం ఆ రాష్ట్రంలో పర్యటించనున్నట్టు ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరా చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లో ప్రస్తుతం రాష్ట్రపతిపాలన వున్న విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్ తొలుత హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఏ)తో సమావేశమవుతుందనీ, ఆ తర్వాత జమ్మూలో పర్యటించి లోక్‌సభ ఎన్నికలతోపాటు, అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అరోరా తెలిపారు.

బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిసిలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలు అడగకున్నా 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. బిసి కమీషన్‌కు జాతీయ హోదా కల్పించాలని 40 ఏళ్ల నుంచి పోరాడుతున్నా పట్టించుకోవటం లేదు విమర్శించారు. కానీ అగ్రకులాలకు రిజర్వేషన్ బిల్లు మాత్రం హడావిడిగా రెండు రోజుల్లో ఆమోదించుకున్నారని కృష్ణయ్య దుయ్యబట్టారు. దేశంలోని అందరికీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో 14 శాతం, ఉద్యోగాల్లో 9శాతం, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఒక శాతం మాత్రమే బిసిలకు ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. బిసిలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని, స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా బిసిలకు తమ వాటా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

ఏడేళ్ల బాలిక కిడ్నాప్.. సామూహిక లైంగికదాడి

- హర్యానాలో ఘాతుకం
- రైల్వే స్టేషన్ సమీపంలో రక్తపుమడుగులో బాలిక



రోహ్‌తక్ : హర్యానాలోని రోహ్‌తక్‌లో ఏడేండ్ల బాలికను కిడ్నాప్ చేసి రైల్వే స్టేషన్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్ళి దుర్మార్గానికి ఒడిగట్టారు ముగ్గురు దుర్మార్గులు. కూతురు కనిపించక పోవడంతో వెతకడం ప్రారంభించిన తండ్రి రైల్వే వాషింగ్ లైన్ సమీపంలో తీవ్ర రక్తస్రావంతో అచేతన స్థితిలో పడివున్న బాలికను గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్టు చెప్పారు. ఘటన గురించి రైల్వే పోలీసులకు సమాచారం అందించి బాలికను స్థానిక పీజీఐఎంఎస్ ఆస్పత్రికి తరలించామన్నారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

పాఠశాలల 'డ్రైవర్లు'గా మహిళలు..!

బెంగుళూరు : రవాణా సౌకర్యాలను అందించే పాఠశాలల వాహనాలను త్వరలో మహిళలు నడపనున్నారు. పాఠశాల వాహనాల డ్రైవర్లను, సహాయకులను మహిళలను నియ మించాలని, అందుకోసం చర్యలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి మేనకా గాంధీ చేసిన సిఫారసులననుసరించి అన్ని పాఠశాలల్లో దానిని అమలుచేయాలని కర్నాటక ప్రభుత్వం నిర్ణయించింది. ఇది చిన్న పిల్లలలో విశ్వాసాన్ని పెంచుతుందని మంత్రిత్వశాఖ భావిస్తున్నది. ' కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ తీసుకున్న నిర్ణయాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు రాష్ట్ర ప్రాథమిక, మాధ్యమిక విద్య శాఖలకు లేఖలురాశాం' అని మహిళా, పిల్లల సంక్షేమ శాఖ రాష్ట్ర సీనియర్ అధికారి తెలిపారు.

ప్రత్యేకం

హెచ్ఆర్డీ అడిగింది 4200 కోట్లు.. ఇచ్చింది 2100 కోట్లు

10శాతం కోటా అమలుకు అరకొర నిధులు



న్యూఢిల్లీ : పార్లమెంట్ సమావేశాల్లో అగ్రవర్ణ పేదలకు 10శాతం కోటా కోసం మోడీ సర్కారు చేసిన హడావుడి.. ఆ రిజర్వేషన్ అమలుకు నిధులు కేటాయించడంలో మాత్రం చేయడం లేదని తెలుస్తున్నది. కేంద్ర విద్యాసంస్థల్లో ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్‌ను ప్రకటించిన రోజుల వ్యవధిలోనే ఇందుకు సంబంధించి తాత్కాలిక బడ్జెట్‌లో రూ. 2100 కోట్లను కేటాయించింది. అయితే కేంద్ర విద్యాసంస్థల్లో ఈ కోటాను అమలు చేయాలంటే రూ. 4200 కోట్లు అవసరమవుతాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ(హెచ్ఆర్డీ) కోరినట్టు సమాచారం. అంటే హెచ్ఆర్డీ కోరిన మొత్తానికి బడ్జెట్‌లో కేటాయించింది సగం మేరకేనని తెలుస్తున్నది. కేంద్ర విద్యాసంస్థల్లో ఈ కోటాను అమలు చేసేందుకు అదనంగా 25శాతం లేదా సుమారు రెండు లక్షల సీట్లు అదనంగా పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఈ విద్యాసంస్థల్లో 16.8లక్షల సీట్లకు ప్రవేశాలు జరుగుతుండగా ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయనుండటంతో అదనంగా 2.32లక్షల సీట్లు పెంచాల్సి ఉంది. దీనికోసం సుమారు రూ. 4200 కోట్ల అదనపు నిధులను హెచ్ఆర్డీ కోరింది. దేశవ్యాప్తంగా అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల పెంపు, అందుకు కావాల్సిన అదనపు నిధులను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం.

2019-2020 విద్యా సంవత్సరంలో జూలై నుంచి అన్ని విద్యాసంస్థల్లో ఈ కోటాను అమలులోకి తీసుకొచ్చేందుకు హెచ్ఆర్డీ సన్నద్ధమవుతోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలతోనూ సంప్రదింపులు జరిపింది. ప్రస్తుతం మొత్తం 84లక్షల సీట్లుండగా ఈ కోటా అమలుకు అదనంగా 21లక్షల సీట్లను పెంచాల్సి ఉండగా, ఇందుకు రూ. 20, 981 కోట్లు అవసరమున్నట్టు హెచ్ఆర్డీ అంచనా వేసింది. ఈ పెంపుతో కేంద్రంతోపాటు రాష్ట్రాలు ఈ భారాన్ని మోయాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని విద్యాసంస్థల్లోని మొత్తం 67లక్షల సీట్లకు అదనంగా 18.6లక్షల సీట్లు చేర్చాల్సి ఉంటుంది. దీని కోసం అవసరమయ్యే రూ. 16,781కోట్ల నిధులు రాష్ట్రాలే భరించాలని హెచ్ఆర్డీ సూచించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

బీఫ్ తీసుకెళ్తున్నారన్న అనుమానంతో.. ముగ్గురు చైనీయులు సహా ఐదుగురి అరెస్ట్

ముంబయి : బీఫ్ తీసుకెళ్తున్నారన్న అనుమానంతో ముగ్గురు చైనీయులు సహా ఐదుగురిని నాగ్‌పూర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 18న ఈ ఐదుగురు ఖాపాలోని గుంగావ్ మైన్స్‌కు చెందిన ఒక కారులో మాంసాన్ని తీసుకెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న కారును పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆ కారులో 10 కేజీల మాంసాన్ని పోలీసులు కనుగొన్నారు. డ్రైవర్ అఫ్రోజ్ షేక్(29), దేవేంద్ర నగ్రాలే(31) సహా ముగ్గురు చైనీయులు లీ చు చుంగ్(55), లు వెంగ్ చుంగ్(51), లు వాంగ్ కాంగ్(53)లను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వారి వద్ద నుంచి తగిన సమాధానం రాలేదు. దీనితో మాంసాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు అది ఆవు మాంసామా కాదా అని తెలుసుకోవడానికి పరీక్షల నిమిత్తం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. ఆ ఐదుగురిపై మహారాష్ట్ర జంతు సంరక్షణ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ఐదుగురిని పోలీసులు కోర్టు ముందు ప్రవేశపెట్టగా వారికి ఫిబ్రవరి 14 వరకు జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం విధించింది. వైద్య చికిత్సల నిమిత్తం లీ-చు-చుంగ్‌ను ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన పోలీసులు మిగతవారిని నాగ్‌పూర్ కేంద్ర కారాగారానికి తరలించారు. ఆ ముగ్గురు చైనీయులు గుంగావ్‌లోని చైనా కోల్ ఇండియాలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు.

మాజీ ఎంపి షహబుద్దీన్ మేనల్లుడి హత్య

పాట్నా : రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) మాజీ ఎంపి మహ్మద్ షహబుద్దీన్ మేనల్లుడు యూసఫ్ బీహార్‌లోని శివాన్‌లో హత్యకు గురయ్యారు. ప్రతాప్ గ్రామానికి చెందిన యూసఫ్‌ను శుక్రవారం రాత్రి అతి సమీపం నుండి దుండగులు కాల్చి అనంతరం రోడ్డుపై పడేశారని పోలీసులు తెలిపారు. అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని అన్నారు. యూసఫ్ పలు వ్యాపారాలు చేస్తున్నాడని, ప్రస్తుతం జైలు జీవితాన్ని అనుభవిస్తున్న షహబుద్దీన్ కుమారుడు ఒసామాకు అతను స్నేహితుడని వెల్లడించారు. యూసఫ్ హత్య అనంతరం ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు తలెత్తడంతో శాంతి, భద్రతలకు పరిరక్షణకు పోలీసులను మోహరించినట్లు ఎస్పి తెలిపారు. హత్యా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిరాయుధీకరణకు కృషి కొనసాగిస్తాం

రష్యా వెల్లడి

మాస్కో : ఆయుధ నియంత్రణ, నిరాయుధీకరణ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధ రంగాల్లో విధ్వంస చర్యలను తాము తిప్పి కొడతామని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రష్యాతో కుదుర్చుకున్న చారిత్రక అణు నియంత్రణ ఒప్పందం నుండి వైదొలగతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై రష్యా వెంటనే స్పందించింది. అణ్వస్త్ర నియంత్రణ ఒప్పందాన్ని అమెరికా రద్దు చేసుకున్న నేపథ్యంలో అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నిర్మాణాత్మకమైన ఎజెండాతో రష్యా ముందుకెళ్తుందని విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. అంతకుముందు అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో ఒక ప్రకటన చేస్తూ అణు నియంత్రణ ఒప్పందాన్ని రష్యా ఉల్లంఘిస్తున్నందువల్లే తాము ఈ ఒప్పందం నుంచి వైదొలగుతున్నామని చెప్పారు. ఆ ఆరోపణలను రష్యా తోసిపుచ్చింది. ఆయుధ నియంత్రణ, నిరాయుధీకరణ విషయంలో రష్యా నిబద్ధతను ప్రశ్నించేలా అమెరికా నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

శుభాకాంక్షలు



మంగళవారం నుంచి ప్రారంభం కానున్న లూనార్ నూతన సంవత్సర వేడుకలకు ముందే బీజింగ్‌లోని పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేస్తున్న చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్.

వాణిజ్య చర్చల్లో పురోగతి

చైనా ప్రతినిధి బృందం వెల్లడి

వాషింగ్టన్ : ఆర్థిక, వాణిజ్య సమస్యల పరిష్కారానికి తాజాగా జరిపిన ఉన్నత స్థాయి చర్చల్లో చైనా, అమెరికా నేతలు కీలకమైన పురోగతి సాధించారు. తదుపరి చర్చలకు పునాది వేశారని ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న చైనా ప్రతినిధి బృందం పేర్కొంది. చైనా ఉప ప్రధాని లియూ హె నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధ, గురువారాల్లో ఉమ్మడి ఆందోళనకు సంబంధించిన అంశాలపై అమెరికా బృందంతో రహస్య, నిర్మాణాత్మక చర్చలు జరిపింది. తదుపరి స్థాయిలో జరిగే చర్చల నిమిత్తం ప్రణాళికను, టైం టేబుల్‌ను నిర్ణయించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో లియూతో భేటీ అయ్యారు. సాధ్యమైనంత త్వరలో ఇరు పక్షాల మధ్య మెరుగైన ఒప్పందం కుదరగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు. గత నెల ఒకటవ తేదీన బ్యూనస్ ఎయిర్స్‌లో ట్రంప్, జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయాన్ని సరైన రీతిలో అమలుపరిచే విషయమై ఇరు పక్షాలు గట్టిగా కృషి చేసిన ఫలితమే ఈ పురోగతి. ఇరు పక్షాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలకు స్వస్తి పలకడానికి పరస్పరం ప్రయోజనకరంగా వుండే, సమాన అవకాశాలు కలిగిన ఒప్పందాన్ని 90రోజుల్లోగా కుదుర్చుకోవడానికి ఉభయ పక్షాలు ప్రయత్నించాలని ఇరువురు నేతలు అంగీకరించారు. వాణిజ్య సమతుల్యత, సాంకేతిక బదిలీ, మేథో సంపత్తి హక్కుల రక్షణ, టారిఫ్‌యేతర అడ్డంకులు, సేవా రంగ, వ్యవసాయం, అమలు యంత్రాంగం ముఖ్యంగా నిర్దిష్ట అంశాల పట్ల చైనాకు వుండే ఆందోళనలు వీటన్నింటి గురించి రెండు రోజుల చర్చల్లో ఉభయ పక్షాలు చర్చించాయి. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా అభివృద్ధిపరచడానికి సమర్ధవంతమైన చర్చలు తీసుకోవడానికి కూడా అంగీకారం కుదిరింది.



అమెరికా సృష్టించిన తిరుగుబాటుకు వంత పాడిన మీడియా

వాషింగ్టన్: అంతర్గత రాజకీయాల్లో పరస్పరం కత్తులు దూసుకునే ట్రంప్ సర్కార్, అమెరికన్ ప్రధాన స్రవంతి మీడియా వెనిజులాలో జోక్యం విషయానికొచ్చేసరికి ఆ విభేదాలన్నిటినీ పక్కన పెట్టి అంతా ఏకమయ్యాయని అమెరికాకు చెందిన ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు లీ క్యాంప్ పేర్కొన్నారు. 'మా ప్రభుత్వం వెనిజులాలో తిరుగుబాటు రేపింది. దీనికి అమెరికాలోని ఎంఎస్ఎన్‌బిసి నుంచి ఫాక్స్ న్యూస్ దాకా ప్రధాన స్రవంతి మీడియా యావత్తూ కూడబలుక్కున్నట్లు వంత పాడుతోంది' అని ఆర్‌టి చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదం, కయ్యానికి కాలుదువ్వే దాని వైఖరితో సమస్య మరింత జటిలమవుతుందే తప్ప పరిష్కారానికి అది ఎంతమాత్రమూ దోహద పడదని లీ క్యాంప్ పేర్కొన్నారు. స్వప్రయోజనాల కోసమే అమెరికా మానవీయ సంక్షోభాలను సృసిస్తోందని, ఇరాక్, లిబియా, సిరియాల్లో ఇదే పని చేసిందని ఆయన తెలిపారు. వెనిజులాలో బొలివేరియన్ సోషలిజాన్ని కూలదోసి, అక్కడి అపారమైన చమురు నిల్వలను కొల్లగొట్టాలన్నది అమెరికన్ సామ్రాజ్యవాదుల పన్నాగమని ఆయన వివరించారు. విదేశీ జోక్యాన్ని వెనిజులా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరని లీ క్యాంప్ చెప్పారు. తనకు తాను అధ్యక్షుడుగా ప్రకటించుకున్న ప్రతిపక్ష నేత గైడోకి, అమెరికాకు, ఐఎంఎఫ్‌కు మధ్య గట్టి సంబంధాలున్నాయని ఆయన విశ్లేషించారు.

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడతా

- పునరుద్ఘాటించిన మదురో
- సైనిక విన్యాసాలను పర్యవేక్షించిన అధ్యక్షుడు



సాయుధ బలగాల పరేడ్‌లో పాల్గొన్న అధ్యక్షుడు మధురో

కారకస్ : దేశ ప్రజల సార్వభౌమాధికార పరిరక్షణకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో పునరుద్ఘాటించారు. శుక్రవారం జరిగిన బొలివేరియన్ జాతీయ సాయుధ బలగాల (ఎఫ్ఎఎన్‌బి) పరేడ్‌లో ఎఫ్ఎఎన్‌బి కమాండర్ ఇన్ చీఫ్ హోదాలో మదురో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగాన్ని, వెనిజులా హక్కులను రక్షించేందుకు తన ప్రభుత్వం దృఢ నిశ్చయంతో వుందన్నారు. వెనిజులాలో హింసను రెచ్చగొట్టాలన్నది అమెరికా ప్రభుత్వ పన్నాగమని, దానిని ఎట్టి పరిస్థితుల్లోను సాగనివ్వబోమని ఆయన చెప్పారు. దేశ సార్వభౌమాధికారానికి ఎఫ్ఎఎన్‌బి వెన్నెముక వంటిదని మదురో పేర్కొన్నారు.

గత 200ఏళ్ళ కాలంలో ఎన్నడూ లేని విధంగా బొలివేరియన్ విప్లవం తీవ్ర రాజకీయ, ఆర్థిక సవాలును ఎదుర్కొంటోందని, వాటిల్లో వెనిజులా గెలిచి తీరుతుందని అన్నారు. ఎవరికీ తలవంచని బొలీవర్లకు మాతృభూమి వెనిజులానే అని పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల విశ్వాసాన్ని, సైనిక నాయకత్వం పట్ల సంపూర్ణ ఐక్యతను ప్రకటించాలని ఎఫ్ఎఎన్‌బికి మదురో పిలుపిచ్చారు.

అమెరికా, బ్రిటన్‌ల జోక్యాన్ని ఖండించిన కార్బిన్

వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా, బ్రిటన్ జోక్యాన్ని బ్రిటన్ లేబర్ పార్టీ నేత జెరిమీ కార్బిన్ ఖండించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలంటూ అన్ని వర్గాలకు పిలుపివ్వడం సరైన చర్య కాదని విమర్శించారు. తమ భవితవ్యం ఎలా వుండాలో నిర్ణయించుకోవాల్సింది వెనిజులన్లే అని స్పష్టం చేశారు. వెనిజులాపై మరిన్ని ఆంక్షలు విధించాలంటూ బ్రిటన్ విదేశాంగ మంత్రి జెరిమీ హంట్ పిలుపివ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈ మేరకు కార్బిన్ ట్వీట్ చేస్తూ, వెలుపలి నుండి జోక్యాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.



భయంతో వీధుల్లోకి పరుగులు తీసిన మెక్సికన్లు

మెక్సికో, సెంట్రల్ అమెరికన్ దేశాల్లో భూకంపం

మెక్సికో సిటీ : దక్షిణ మెక్సికో, సెంట్రల్ అమెరికన్ దేశాలు కొన్నింటిలో శుక్రవారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.6గా నమోదైంది. అయితే ఎటువంటి ప్రాణ, ధన నష్టం జరిగినట్లు వార్తలందలేదు. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చియాపాస్ రాష్ట్రంలో ప్యూర్టో మదెరోకు ఈశాన్యంగా భూ గర్భంలో 14కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం నమోదైందని అమెరికా భౌగోళిక సర్వే (యుఎస్‌జిఎస్) కార్యాలయం తెలిపింది. గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్‌ల్లో పలు ప్రాంతాల్లో చాలాసేపు ప్రకంపనలు కొనసాగినా, అంత తీవ్రంగా వున్నట్లు అనిపించలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మెక్సికో నగరంలో కూడా ఈ ప్రభావం కనిపించిందని, చాలామంది ఇళ్ళు, కార్యాలయాలు వదిలి బయటకు పరుగులు తీశారని అధికారులు తెలిపారు. 2017 సెప్టెంబరులో రెండు శక్తివంతమైన భూకంపాలు వచ్చి 470మందికి పైగా మృతి చెందారు.

బ్రెజిల్‌లో డ్యామ్ కూలిన ఘటనలో 115కు చేరిన మృతులు

మినాస్ గెరయిజ్ (బ్రెజిల్) : బ్రెజిల్ రాష్ట్రమైన మినాస్ గెరయిస్‌లో ఇటీవల డ్యామ్ కూలిపోయిన దుర్ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 115కు చేరుకుందని రాష్ట్ర పౌర రక్షణ ప్రాంతీయ డిప్యూటి కో ఆర్డినేటర్ ఫ్లావియో గాడిన్హో శుక్రవారం తెలిపారు. ఈ సంఘటనలో 248 మంది గల్లంతైనట్లు ఆయన చెప్పారు. బ్రుమాడిన్హో మున్సిపల్ ఏరియాలో జనవరి 25న డ్యామ్ కుప్పకూలిన సంగతి తెలిసిందే.

పాలస్తీనాకు అన్ని రకాల సాయం నిలిపివేత

- అమల్లోకి వచ్చిన వివాదాస్పద ఎటిసిఎ
- ఖండించిన పాలస్తీనా

బీజింగ్ : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్, గాజాల్లోని పాలస్తీనియన్లకు అన్ని రకాల సాయం అందించడాన్ని నిలిపివేసినట్లు అమెరికా ధృవీకరించింది. తీవ్రవాదంపై పోరుకు సంబంధించి తీసుకువచ్చిన కొత్త చట్టం వల్ల ఈ సాయం ఆగిపోయిందని పేర్కొంది. దీంతో పాలస్తీనా భద్రతా సేవలకు అందించే 60మిలియన్లకు పైగా డాలర్ల వార్షిక నిధులు నిలిచిపోయాయి. పాలస్తీనియన్లకు అందించే నిధుల్లో గతంలో కోత విధించినా మద్దతిచ్చిన ఇజ్రాయిల్ ఈసారి ఈ చర్య పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల ఇజ్రాయిల్ బలగాలతో సహకారం దెబ్బతింటుందని భావిస్తున్నారు. గతేడాది అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించిన తీవ్రవాద నిరోధక వివరణ చట్టం (యాంటీ టెర్రరిజం క్లారిఫికేషన్ యాక్ట్-ఎటిసిఎ)పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడంతో జనవరి 31 నుండి అమల్లోకి వచ్చింది. దీంతో దాదాపు 1,90,000 మంది పాలస్తీనియన్లకు నిధుల కొరత కారణంగా ఆహార సాయంలో కోత విధించాల్సి వచ్చింది. సాయం నిలిపివేయడం వల్ల కీలకరంగాలైన ఆరోగ్యం, విద్య వంటి వాటిపై ప్రతికూల ప్రభావం పడుతుందని, అస్థిరత పెరుగుతుందని పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ ప్రతినిధి నబిల్ అబూ రుడెన్ వ్యాఖ్యానించారు. ఇన్ని కోతలు విధించినా పాలస్తీనా భూభాగాల్లోని అమెరికా సాయానికి సంబంధించిన కేంద్రాలను మూసివేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. హమస్ ప్రతినిధి ఇస్మాయిల్ రుద్వాన్ ఈ చర్యను ఖండిస్తూ, నిధులను కూడా రాజకీయం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

లూటీపై నోరుమెదపరేం?

ఆందోళన వ్యక్తం చేశారు. దీని కారణంగా వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఇప్పటికి 600 మందికి పైగా బాధితులు ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. చట్టాలను కఠిన తరం చేసి నిందితులు తప్పించుకోకుండా చూడాలని డిమాండ్ చేశారు.

అఖిల భారత కిసాన్ సభ(ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా మాట్లాడుతూ చిట్‌ఫండ్ మోసాలపై ప్రభుత్వాల చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని, తమ అధికారాన్ని కాపాడుకునేందుకు మోసగాళ్ల పట్ల ఉదాశీనంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ అధికారంలో వచ్చిన వెంటనే శారదా స్కాంపై విచారణ వేగవంతం చేస్తే బాధితులకు న్యాయం జరిగేదని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మమత, మోడీ సర్కార్‌లకు వ్యతిరేకంగా తాము దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. "జై జవాన్..జై కిసాన్..జై సంవిధాన్" నినాదంతో తాము పోరాడుతున్నామని వివరించారు. సామాజిక కార్యకర్త, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ మాట్లాడుతూ చిట్‌ఫండ్ బాధితులకు తాము అండగా ఉంటామన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఈ విషయంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతామని వివరించారు. ఈ ధర్నాలో చిట్‌ఫండ్ బాధిత సంఘాలు, దళిత ఉద్యమ నేతలు విక్రమ్ సింగ్,రిటైర్డ్ మేజర్ జనరల్ సాబ్బీర్ సింగ్, ఎంపి సంతోష్ రాయ్, దినోష్ అబ్రోయ్, రామ్ నివాస్ యాదవ్, ఆర్‌డి శర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి మోడీ అడ్డు

చెప్పాలన్నారు. రాష్ట్రాన్ని దగా చేసిన బిజెపి ఆగడాలను సాగనీయబోమన్నారు. జగన్ రాష్ట్రంలో చేసిన పాదయాత్ర నీతిలేనిదని విమర్శించారు. అవినీతిపరులున్న పార్టీలకు చరమ గీతం పాడాలని, పారదర్శక పాలన అందిస్తున్న టిడిపికి మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బందరు ఎంపి కొనకళ్ల నారాయణ, జెడ్‌పి చైర్‌పర్సన్ గద్దె అనురాధ, గన్నవరం ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపివివిపి స్పెషలిస్ట్ పోస్టులకు 4న సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏపి వైద్యవిధాన పరిషత్ (ఏపివివిపి)లో ఖాళీగా ఉన్న 89 స్పెషలిస్ట్ పోస్టులలో నియామకాలకు 4న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తామని ఏపివివిపి కమిషనర్ దుర్గాప్రసాదరావు శనివారం ప్రకటనలో తెలిపారు. వైద్య విధాన పరిషత్‌లో 155 స్పెషలిస్ట్ పోస్టులకుగాను గతేడాది డిసెంబర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించగా 66 మంది మాత్రమే ఆ పోస్టుల్లో చేరినట్లు తెలిపారు. మిగిలిన పోస్టులను భర్తీ చేసేందుకు అభ్యర్థులు మరోసారి గొల్లపూడి ఏపివివిపి కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సిందిగా పేర్కొన్నారు. 5న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, పూర్తి వివరాలు www.cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వాస్తవాలను కప్పి పుచ్చిన కేంద్ర బడ్జెట్

టిడిపి ఎంపి కనకమేడల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్ వాస్తవాలను కప్పిపుచ్చుతోందని టిడిపి ఎంపి కనకమేడ రవీంద్ర కుమార్ అన్నారు. ఉండవల్లిలోని సిఎం గ్రీవెన్స్‌హాల్ మీడియా పాయింట్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఐదు లక్షల రూపాయల వరకు ఆదాయ పన్ను మినహాయించినట్లు చెప్పడం ఇటువంటిదేనన్నారు. 5 లక్షలకు మించి ఒక్క రూపాయి అదనంగా వచ్చినా రూ.13వేలు చెల్లించాలనే వాస్తవాన్ని కప్పి పుచ్చారని టిడిపి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. ఈ బడ్జెట్ కొంత మంది ఉన్నత వర్గాలవారు రుణాలు ఎగ్గొట్టేందుకు దారి చూపుతోందన్నారు. అసంఘటిత కార్మికులకు పింఛన్ అనేది ఎండమావి లాంటిదని ఆచరణలో ఇది సాధ్యం కాదన్నారు. కేంద్ర బడ్జెట్‌ను ఎన్నికల గారడీగా కనకమేడల అభివర్ణించారు.

చదువుతోనే మార్పు

- ఎన్‌టిఆర్ మోడల్ వార్షికోత్సవంలో బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



చదువుతోనే మంచి జీవితంతో పాటు, సమాజంలోనూ మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం నేర్చుకోవాల్సిందేనని, సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడానికే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని, పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చామా? అనే ధోరణి నుంచి...ఎంత మంచి చదువు చెప్పించామా అన్న ఆలోచనా వచ్చారని అన్నారు. శనివారం గండిపేటలో ఎన్టీఆర్ మోడల్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చంద్రబాబునాయుడు, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ...దేశంలో పేదల కోసం తొలిసారి గురుకుల పాఠశాలలను తెచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకే దక్కుతుందని కొనియాడారు. ప్రస్తుత ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రాంగణం గతంలో టీడీపీ రాజకీయ శిక్షణా తరగతులకు అడ్డాగా ఉండేదని, తాను కూడా ఇక్కడ రోజులు తరబడి ఉండి రాజకీయ పాఠాలు నేర్చుకున్నానని గుర్తుకు చేసుకున్నారు.

క్లాసుల్లో యాంత్రికంగా బోధించడం వల్ల చదువుల్లో నాణ్యత కొరవడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడియో, వీడియోల ద్వారా బోధిస్తూనే క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్తేనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, విభిన్నంగా ఆలోచిస్తారని అన్నారు. ఎన్. భువనేశ్వరి మాట్లాడుతూ..ప్రతి ఒక్క విద్యార్థికీ లక్ష్యం ఉండాలని సూచించారు. విద్యార్థులు సైనికులవలె కష్టపడాలని, లక్ష్యాన్ని చేరుకుంటే ఎంతో సంతోషంగా ఉంటుందని అన్నారు. వచ్చిన అవకాశాలను వినియోగించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తాము నేర్చుకున్నది ఇతరులకు పంచాలని కోరారు. అందరి జీవితాల్లో వెలుగులు నింపేది టీచర్లేనని కొనియాడారు. వార్షికోత్సవంలో భాగంగా సాసంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వార్షికోత్సవ సభ అనంతరం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు పాఠశాలలోని తరగతి గదుల్లో తిరుగుతూ గత స్మృతులను గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేడ్ ఫుడ్స్ అధ్యక్షులు సాంబశివరావు, ట్రస్ట్ సీఈఓ విష్ణువర్ధన్, సీవోఓ మోహన్‌రావు, ఎన్టీఆర్ మోడల్ స్కూల్ డైరెక్టర్ ఎస్ఎస్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'షర్మిల' కేసులో ఇద్దరు అరెస్టు

నిందితుల్లో గుంటూరు విద్యార్థి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి, హైదరాబాద్ బ్యూరో



నిందితుడ్ని తీసుకెళ్తున్న పోలీసులు

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోదరి వైఎస్ షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యకమైన పోస్టులు పెట్టి ప్రచారం చేసిన కేసులో సిసిఎస్ పోలీసులు పురోగతి సాధించారు. ఫేస్‌బుక్, యూట్యూబ్ సంస్థలు ఇచ్చిన ఐపీ అడ్రస్‌ల ఆధారంగా ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో గుంటూరుకు చెందిన ఓ విద్యార్థిని, మంచిర్యాలకు చెందిన మరో వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గుంటూరు ఆర్‌విఆర్ కళాశాలలో ఎంసిఎ చదువుతున్న పెద్దిసెట్టి వెంకటేష్ సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టింగ్‌లు ఉంచినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. తనపై అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెడుతున్నారని షర్మిల ఇటీవల సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన క్రమంలో పోలీసులు గుంటూరులో దర్యాప్తు చేపట్టారు. గూగుల్ సంస్థ సహకారంతో పోలీసులు నిందితులను గుర్తించారు. యూట్యూబ్‌తో పాటు పలు వెబ్‌సైట్‌లలో షర్మిలపై అసభ్యపదజాలం వినియోగిస్తున్నారని దర్యాప్తు చేసే క్రమంలో గుంటూరు విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు. వెంకటేష్‌తో పాటు మరికొందరి అనుమానితులనూ సిసిఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని హైదరాబాద్ తరలించినట్లు తెలిసింది. నిందితులపై ఐపిసి 509, ఐటి చట్టం సెక్షన్ 67 కింద కేసు నమోదు చేశారు. మరోవైపు మంచిర్యాలకు చెందిన మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరినీ కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ఈ కేసుతో సంబంధం ఉన్నట్లుగా భావిస్తున్న మరికొందరి కోసం కూడా పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. గూగుల్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా మొత్తం ఏడుగురు వ్యక్తులను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.త్వరలోనే కీలక సూత్ర దారులను కూడా అరెస్ట్ చేస్తామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

పసుపు కుంకుమ పథకానికి ఎస్సీ,ఎస్టీ నిధులను మళ్ళించొద్దు

ఎఐడిఆర్ఎఫ్ అధ్యక్షుడు కె.ఆనందరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ ప్రవేశపెట్టిన పసుపు కుంకుమ పథకానికి ఎస్సీ, ఎస్టీ నిధులను కేటాయించడాన్ని అడ్డుకోవాలని అఖిల భారత దళిత హక్కుల సమాఖ్య(ఎఐడిఆర్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కె. ఆనందరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయనిక్కడ ఒక ప్రకటన చేస్తూ, పసుపు కుంకుమ పేరుతో టిడిపి ప్రభుత్వం అత్యంత దారుణంగా ఎస్సీ, ఎస్టీలకు చెందిన స్పెషల్ కంపోనెంట్ ప్లాన్ నిధులను మళ్ళిస్తోందని, ఎవరూ అడ్డుకోలేరని భావిస్తూ, నిధులను అడ్డగోలుగా ప్రక్క దారి పట్టిస్తున్నారని విమర్శించారు.

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తాయిలాల కోసం అణగారిన వర్గాల నిధులను పంచడానికి టిడిపి సిద్ధపడిందని విమర్శించారు. ఎస్సీ నిధులు రూ.1,678.60 కోట్లు, ఎస్టీ నిధులు రూ.469 కోట్లు దారి మళ్లించారని, అలాగే ఎన్నికల ప్రచారం కోసం రూ.31.6 కోట్లు కేటాయించారని దుయ్యబట్టారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, అప్రజాస్వామిక చర్య అని, టిడిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. దీనికి నిరసనగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆందోళన చేపట్టాలని, అన్ని జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపు నిచ్చారు. అలాగే ఈ చర్యను చట్ట ప్రకారం అడ్డుకోవాలని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులకు సూచించారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేసేలా సిఎంతో చర్చిస్తా

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ అన్నారు. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మాలమహానాడు జాతీయ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు చేయడంలో దేశంలోని ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రికార్డు నెలకొల్పారన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ధనరాజ్ శ్యామ్ సుందర్, తెలంగాణ రాష్ట్ర విభాగం అధ్యక్షులు పసుల రామ్మూర్తి, ఇతర నేతలు బొల్లుపల్లి జోని కుమారి, తిరిగటి శివ, తుమ్మల తాతారావు పాల్గొన్నారు.



ఉద్యాన పంటలకే ప్రాధాన్యం

అధికారులకు సిఎస్ పునేఠా ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యానపంటలకు ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఫుడ్‌ప్రాసెసింగ్ రాష్ట్రస్థాయి సాధికారత కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల విషయంలో ఉద్యానవనశాఖ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన ఫుడ్ పార్కులను, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టులను స్థాపించే సంస్థలు, ఉత్పత్తులు, ప్రాజెక్టు వ్యయం, ప్రాజెక్టులకు ఇచ్చే గ్రాంటు, ఉపాధి కల్పన, ప్రాజెక్టు స్థాపన కాల వ్యవధి తదితర అంశాలపై అధికారులతో సిఎస్ చర్చించారు. ఈ. సమావేశంలో పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, ఫిషరీస్‌శాఖ ముఖ్య కార్యదర్శి కె.దమయంతి, పరిశ్రమలు, వాణిజ్యశాఖలోని ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం కార్యదర్శి ఎం గిరిజాశంకర్, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కెవివి సత్యనారాయణ, ఎపి ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ సిఇఓ వైవి ప్రసాద్ తదితరులున్నారు.

కష్టపడి తెలుగు నేర్చుకున్నా

'యాత్ర' ప్రీ రిలీజ్ వేడుకలో మమ్ముట్టి



'వైఎస్ఆర్‌ను ఎంతో మంది తమ గుండెల్లోపెట్టుకుని ఉన్నారు. అలాంటి వారి గుండెల్లో నన్ను కూడా కాస్త పెట్టుకుంటారని భావిస్తున్నా. ఆయన్ను ప్రేమించిన దానిలో నన్ను ఒక శాతం ప్రేమిస్తే చాలు' అని నటుడు మమ్ముట్టి అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్ర ఆధారంగా రూపొందించిన సినిమా 'యాత్ర'. మమ్ముట్టి వైఎస్ పాత్రలో నటించారు. 70 ఎం.ఎం.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి నిర్మించారు. ఈనెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి ప్రీ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు.

మమ్ముట్టి మాట్లాడుతూ 'తెలుగు మాట్లాడలేను. కానీ అర్థం చేసుకుంటా. కానీ సినిమా కోసం కష్టపడి నేర్చుకున్నాను. నాకు తెలుగు భాష అంటే చాలా ఇష్టం. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని తెలుగు భాషను పిలుస్తారు. కవితాత్మకమైన భాష. ఇలాంటి సినిమా చేసిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. నాతో ఓ సినిమాను డైరెక్ట్ చేస్తున్న స్నేహితుడు శ్యామ్ దత్ ఈ సినిమా కథ గురించి చెప్పారు. సరేనని కథ విన్నాను. 21 ఏళ్ల తర్వాత తెలుగులో సినిమా చేయడానికి చాలా ఎగ్జయిట్ అయ్యాను. రాజశేఖర్ రెడ్డిగారి చేసిన పాదయాత్ర అనే ఘటనకు సంబంధించిన కథ. ఆయన స్క్రిప్ట్‌తో కన్విన్స్ అయ్యాను. సినిమా ప్రారంభానికి ముందుగానే డైలాగ్స్ తీసుకుని నేర్చుకుని చేశాను. తప్పులున్నా కరెక్ట్ చేసుకుని నటించాను. తెలుగులో నేను నటించిన మూడో స్ట్రయిట్ మూవీ ఇది' అని అన్నారు.

సుధీర్ బాబు మాట్లాడుతూ 'విజయ్, విష్ణు, శశి నా క్లోజ్ ఫ్రెండ్స్. వారు, నేను ఇండస్ట్రీలోకి వస్తామని అనుకోలేదు. ఇప్పుడు అందరం బయోపిక్స్ చేస్తున్నాం. నేను పుల్లెల గోపీచంద్‌ది, విష్ణు 'యన్.టి.ఆర్' విజయ్, శశి 'వైఎస్ఆర్' బయోపిక్ చేస్తున్నారు. ఇదొక స్ఫూర్తిదాయకమైన చిత్రం. వైఎస్ఆర్ ఫ్యాన్స్‌కే కాదు.. ఇతర ప్రేక్షకులకు కూడా తప్పకుండా నచ్చుతుంది. మమ్ముట్టిగారికి నేను చాలా పెద్ద ఫ్యాన్‌ని' అని పేర్కొన్నారు.

ఆశ్రిత మాట్లాడుతూ 'విజయమ్మగా మీ ముందుకు వచ్చానంటే బ్రిలియంట్ టీం వర్క్ కారణం. మమ్ముట్టిగారితో నటించడం చాలా గర్వంగా, గొప్పగా భావిస్తున్నాను. నా సినీ యాత్ర ఇప్పుడిప్పుడే ప్రారంభం అయ్యింద'ని తెలిపారు.

నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ 'వారం రోజులుగా స్నేహితుడు శశి యు.ఎస్‌లో సినిమాను ప్రమోట్ చేస్తూ బిజీగా ఉన్నారు. శ్యామ్ దత్‌గారి వల్లే ఈ సినిమా చేస్తున్నాం. ఆయనే ఈ సినిమా కథను మమ్ముట్టిగారి వద్దకు తీసుకెళ్లారు. సీతారామశాస్త్రి ఐదు పాటలను ఐదు సన్నివేశాలకు తగ్గట్టు రాశారు. పెంచలదాస్ ఆలపించారు. ప్రతి కుటుంబమూ చూడొచ్చు' అని చెప్పారు.

మహి.వి.రాఘవ్ మాట్లాడుతూ.. నాకు వైఎస్ఆర్‌కి ఏ సంబంధమూ లేదు. ఇలాంటి కథలను ఎందరో ఎన్నో రకాలుగా చెప్పి ఉండొచ్చు. అలాంటి కథలను వినడం వల్లనే నేను రాజశేఖర్‌రెడ్డిగారి కథ చేద్దామని అనుకున్నాను. మా అమ్మగారిది కడప దగ్గర చిన్న ఊరు. అక్కడ పుట్టడం వల్ల ఓర్చుకునే బలం, ఓపిక మరొకరికి ఉండదు. సినిమా మొత్తం పూర్తయిన తర్వాత ట్రైలర్ చూడమంటే జగనన్న చూసి బావుందన్నార'ని తెలిపారు.



పాయల్ రాజ్‌పుత్



నాగార్జున

'మన్మథుడు'కి ప్రియురాలు

పాయల్ రాజ్‌పుత్ మెగా ఆఫర్‌ను చేజిక్కించుకుంది. అగ్రహీరో నాగార్జునతో నటించబోతుంది. నాగ్ హీరోగా గతంలో 'మన్మథుడు' వచ్చింది. మంచి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇప్పుడు దానికి సీక్వెల్ రాబోతుంది. దానికి 'మన్మథుడు2' అనే టైటిల్ ఖరారు చేయబోతున్నారు. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. 'చి.ల.సౌ' చిత్రంలో దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన రాహుల్‌కి ఇది రెండో చిత్రం. ఈ సినిమాలో 'ఆర్ఎక్స్ 100' చిత్రం కథానాయిక పాయల్ రాజ్‌పుత్‌ను కథానాయిక ఎంపిక చేశారని తెలిసింది. అయితే ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

ఆకాశంలో యోగా



రకుల్ ప్రీత్‌సింగ్



కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ఫిట్‌నెస్‌పై ఉన్న ప్రేమ అంతా ఇంతా కాదు. తనను నిత్యం ఒత్తిడి నుంచి తగ్గించేది ఫిట్‌నెసే అని రకుల్ చెబుతూ ఉంటుంది. అందులో ఫిట్‌నెస్ వ్యాపారంలోకి కూడా అడుగుపెట్టింది. హైదరాబాద్, వైజాగ్ వంటి చోట్ల ఫిట్‌నెస్ కేంద్రాలను ప్రారంభించింది కూడా. తాజాగా ఈ కథానాయిక ఏరియల్ యోగా సెషన్ కూడా ప్రారంభించింది. సాధారణంగా నేలపై కూర్చొనో, పడుకొనో యోగా చేస్తాం. కానీ ఆకాశంలో తేలియాడుతూ యోగా చేయడం ఎలా అన్నదానిపై రకుల్ ప్రమోషన్ చేస్తుంది. దీనిపై అవగాహన తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తుంది. దీనికి సంబంధిచిన కొన్ని వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. దీంతో ఆమె త్వరలో నటించబోయే సినిమాలో కూడా యోగా పాత్రలే ఉంటుందని సమాచారం. ఈ సందర్భంగా రకుల్ మాట్లాడుతూ ' ఏరియల్ యోగా అనేది రెగ్యులర్ యోగాకి విభిన్నమైంది. సవాల్‌తో కూడుకున్నది కూడా. నేను దృఢపడానికి సహాయపడుతుంది. నన్ను గ్లామర్‌గా చూశారు. కానీ ఫిట్‌గా ఉండడం కోసం ఇటువంటివి సవాల్‌గా స్వీకరించి చేస్తుంటా' అని చెప్పింది.

సుకుమార్ రైటింగ్స్‌లో నాగశౌర్య



భారీ చిత్రాలను తెరకెక్కిస్తోన్న దర్శకుడు సుకుమార్ తన నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో నాగశౌర్య నటించనున్నాడు. తన దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న యువ దర్శకులను ఎంకరేజ్ చేస్తూ ఇతర ప్రముఖ నిర్మాణ సంస్థలతో కలిసి సినిమాలను రూపొందిస్తున్నారు. తాజాగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై సుకుమార్, నార్త్ స్టార్ ఎంటర్‌టైన్మెంట్ శరత్ మరార్ కలయికలో ఓ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో నాగశౌర్య హీరోగా నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న కాశీ విశాల్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రకటిస్తారు.

విభిన్నమైన క్లాసిక్ హారర్



సచిన్ జోషి

సచిన్‌జోషి, నర్గీస్ ఫక్రీ కాంబినేషన్‌లో 'రాగిణి ఎంఎంస్' ఫేం భూషణ్ పటేల్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'అమావాస్'. మోనా జస్బీర్ సింగ్, అలీ అస్గర్ అగా, నవ్‌నీత్ కౌర్ దిల్లాన్, వివన్ బతేనా ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ వచ్చిన సచిన్ జోషి శనివారం విలేకరులతో మాట్లాడారు. విభిన్నమైన సినిమా చేయాలని ఎదురుచూస్తున్న తరుణంలో మా డైరెక్టర్ భూషణ్ పటేల్ చెప్పిన ఈ స్టోరీ బాగా నచ్చి చేశాను. నా గత సినిమాలకి ఇది చాలా భిన్నంగా ఉంటుంది. ఇది పూర్తిగా హారర్ నేపథ్యంలోనే సాగుతుంది. కొన్ని హారర్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. అలాగే డైరెక్టర్ భూషణ్ పటేల్ స్క్రీన్ ప్లే కూడా చాలా బాగుంటుంది. సింగిల్ వర్డ్‌లో చెప్పాలంటే.. అమావాస్ ఒక క్లాసిక్ హారర్ ఫిల్మ్. రెగ్యులర్‌గా వచ్చే హారర్ సినిమాలా ఉండదు. మెయిన్‌గా సినిమాలో కనిపించే వి.ఎఫ్.ఎక్స్ చాలా కొత్తగా, వైవిధ్యంగా ఉంటాయి. ఇది హిందీ, తెలుగు భాషల్లో చేశాం. కాకపోతే తెలుగులో క్లోజ్ షాట్స్ వరకు సెపెరేట్‌గా తీశాం' అని తెలిపారు.

ఆరు నెలలు సహకరించొద్దు

అలోక్‌నాథ్ విషయంలో ఎఫ్‌డబ్ల్యూఐసీఈ నిర్ణయం



లైంగిక వేధింపులు ఆరోపణలు ఎదుర్కొంటున్న సినిమా, టీవీ నటుడు అలోక్‌నాథ్‌కు ఆరు నెలల పాటు ఎవరూ సహకరించొద్దని ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయిస్ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) ఆదేశించింది. ఇండియన్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీడీఏ)కు ఇది మాతృసంస్థ సంస్థ. గత ఏడాది నవంబర్ 22న ఈ నటుడిపై స్క్రీన్ రైటర్, దర్శకురాలు వింతా నందా లైంగిక వేధింపుల ఆరోపణలు చేసింది. ఈ కేసులో భాగంగా అలోక్ బెయిల్‌పై బయటకొచ్చారు. అనంతరం ఈయనపై వచ్చిన ఆరోపణలపై ఐఎఫ్‌టీడీఏ ఏర్పాటు చేసిన కమిటీ విచారణ చేపట్టింది. ఇందులో మూడుసార్లు అతన్ని విచారణకు హాజరుకావాలని ఆ కమిటీ కోరినా దానికి అలోక్ సహకరించలేదు. దీంతో ఆయనకు ఎవరూ సహకారం అందించొద్దని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ నిర్ణయించింది.

నేనే ముఖ్యమంత్రి



వైష్ణవి ఫిలింస్, ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. దేవిప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో మోహన్ రావిపాటి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల 8న గ్రాండ్‌గా విడుదలవుతోంది. అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ ఏసమకాలీన రాజకీయ అంశాల గురించి చర్చించాం. అన్ని వర్గాలకు నచ్చే అంశాలతో పాటు అందర్నీ ఆలోచింపజేసేలా సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి. దేవిప్రసాద్, వాయుతనయ్, శశి, సుచిత్ర అద్భుతమైన నటన ప్రదర్శించారు. సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉన్న చిత్రం. కాన్సెప్ట్ నచ్చి ఈ సినిమా నిర్మించాం. ప్రేక్షకులకు కూడా నచ్చుతుందన్న నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు. ఆలూరి సాంబశివరావు మాట్లాడుతూ 'నేటి రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతూ నిర్మించిన చిత్రం" అని తెలిపారు.

కోర్టుకెళ్లయినా విడుదల చేస్తాం



బెనర్జీ, వెంకట్, ముమైత్ ఖాన్, సంజీవ్‌కుమార్, సుమా రంగనాథన్ కీలక పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'దండుపాళ్యం 4'. కె.టి.నాయక్ దర్శకత్వం వహించారు. వెంకట్ నిర్మాత. చిత్రీకరణ పూర్తి చేసుకుని ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాల్లో ఉంది. మార్చిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి 'దండుపాళ్యం' ట్రయాలజీకి ఎలాంటి సంబంధం లేదు. ఈ 'దండుపాళ్యం-4'లో జైలులో ఉన్న తమ సహచరులను తప్పించడానికి ఓ దండు ఎలాంటి వ్యూహాలు రచించింది? వారి వ్యూహాలు ఫలించాయా? పోలీసుల ఎత్తుగడకు వీరు చిత్తయ్యారా? లేక విజయం సాధించారా? అన్న ఆసక్తికరమైన అంశాలతో రూపొందింది. ఇందులో ఏడుగురు గ్యాంగ్‌కు నాయకురాలిగా సుమా రంగనాథన్ నటించారు.

ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాత వెంకట్ మాట్లాడుతూ 'ఇటీవల సెన్సార్ అప్లై చేశాను. కంటెంట్ పరంగా సినిమాలో ఏదన్నా సమస్య ఉంటే ఆ సన్నివేశాన్ని, డైలాగ్‌ని తొలగిస్తాం. సినిమా చూసిన సెన్సార్ బోర్డ్ ఆఫీసర్ సినిమాలో కొన్ని సీన్లు తొలగించాలి. లేదంటే రిజక్ట్ చేస్తానని చెప్పారు. సినిమాలో సమస్య ఏంటో చెప్పకుండా సినిమాను రిజెక్ట్ చేస్తామనడం మొదటిసారి చూశా. రివైజ్ కమిటీకి వెళ్లండన్నాడు. ప్రస్తుతం నేను అదే పని మీద ఉన్నా. రివైజ్ కమిటీనే కాదు.. కోర్టు ఎక్కడానికి కూడా సిద్ధంగా ఉన్నా. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చిలో సినిమా విడుదల చేస్తాం' అని తెలిపారు. 'ఇంతకన్నా క్రైమ్ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని విజయవంతంగా ఆడి థియేటర్స్ నుంచి కూడా వెళ్లిపోయాయి. మా సినిమాతో సెన్సార్ బోర్డు ఇబ్బంది ఏంటో అర్థం కావడం లేదు' అని దర్శకుడు చెప్పారు. కన్నడలో 'దండుపాళ్యం'లో నటించడం వల్ల అక్కడ మరో రెండు సినిమాల్లో అవకాశం వచ్చిందని డి.ఎస్.రావు చెప్పారు. ముత్యాల రాందాసు, బెనర్జీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేనే దర్శకత్వం వహించా

- క్రిష్ వ్యాఖ్యపై స్పందించిన కంగనా



'మణికర్ణిక'పై మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ సినిమా ప్రారంభానికి ముందూ వివాదమే, విడుదలయ్యాకా గొడవలే. తాజాగా క్రిష్ చేసిన వ్యాఖ్యపై కంగనా రనౌత్ స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్రిష్ దర్శకత్వంలో ఉన్న పాత్ర కంగనా డైరెక్ట్ చేసినప్పుడు తగ్గిపోయిందని చెబుతున్న వారందరికీ సమాధానం ఇచ్చింది. ఈ చిత్రం టైటిల్ రోల్ పోషించింది కంగనా. మొదట క్రిష్ దర్శకత్వం వహించారు. ఎన్టీఆర్ బయోపిక్ పనులు వల్ల ఆ సినిమా ప్యాచ్ వర్క్ చేయకుండా మధ్యలోనే వచ్చేశారు క్రిష్. తర్వాత ఆ బాధ్యతలను కంగనా రనౌత్ తన భుజాలపై వేసుకుంది. ఇప్పుడు సినిమా విడుదలయ్యాక 'మణికర్ణిక'ను 70శాతం చిత్రానికి ఆమె డైరెక్షన్ చేయలేదని వంటి విమర్శలు క్రిష్ కంగనాపై చేస్తున్నారు. దీనిపై ఈ చిత్రం నిర్మాత కమల్ జైన్ స్పందించారు. మణికర్ణికకు నష్టం కలిగించడానికే క్రిష్ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. తాజాగా కంగనా ముంబాయి ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ 'క్రిష్ నామీద మాటల దాడి చేయడం సరికాదు. ఒకవేళ ఆయన చెప్పింది నిజమైతే నిరూపించమనండి. మీడియాతో మాట్లాడడం వల్ల ఉపయోగం ఉండదు. అదృష్టమో, దురదృష్టమో 'మణికర్ణిక' సినిమా విడుదలైంది. ఈ సినిమాకు నేనే దర్శకత్వం వహించాను. ఈ విషయంలో అన్ని కీలక నిర్ణయాలూ నేనే తీసుకున్నా. ఈ సినిమా తమ పాత్రను కట్ చేసిననిగానీ, ఉండాల్సి సన్నివేశాన్ని ఎడిట్ చేశానని గానీ చెబుతున్న వారందరికీ ఒకటే చెబుతున్నా.. ఒకటి నటిగా, మూడుసార్లు అవార్డు గ్రహీతగా లేదా ఫిల్మ్ మేకర్‌గా ఈ స్థాయికి చేరుకున్నా. నాకు నేనుగా ఈ స్థాయికి ఎదిగాను. మా నాన్న ద్వారా ఈ స్థానం రాలేదు. మీరు స్వంతంగా ఈ స్థాయికి రండి. ఏడవడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు' అని చెప్పింది కంగనా.

' మొదట్లో ఐదు నిమిషాలు పాటు ఉండే పాత్రా చేశాను. చివరి నిమిషంలో కొన్ని చిత్రాల నుంచి గెంటివేతకు గురయ్యాను. కానీ ఈ స్థాయికి చేరుకున్నా. క్రిష్ ఈ సినిమా నుంచి తపుకున్నాక, అది నాచేతికొచ్చాక అంతిమంగా దర్శకురాలిగా ఆ చిత్రాన్ని ఎలా తెరకెక్కించాలన్న నిర్ణయం తీసుకునే హక్కు నాకుంటుంది. వచ్చిన అవకాశాన్ని దర్శకురాలిగా, నటిగా ఎలా ఉపయోగించుకోవాలో కూడా నిర్ణయం తీసుకోవచ్చు. ఇప్పుడు జీవితంలో ఇబ్బందులు పడుతున్న వారంతా నా నుంచి స్ఫూర్తి పొందొచ్చు. నాపై ఈర్ష్యను ప్రదర్శిస్తూ దాడి చేయడం వల్ల ప్రయోజనం ఉండదు' అని చెప్పింది రనౌత్.

షారుఖ్, సల్మాన్‌తో మల్టీస్టారర్!



షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్‌ను మళ్లీ ఒకే తెరపై చూడబోతున్నాం. దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించనున్న చిత్రంలో వీరిద్దరూ కలసి నటించనున్నారు. చాలా కాలం తర్వాత వీరిద్దరి కలసి నటిస్తుండడంతో అంతటా ఆసక్తి నెలకొంది. గతంలో సల్మాన్, షారుఖ్ 'హమ్ దిల్ డీ చుకే సనమ్', 'దేవదాస్' చిత్రాల్లో నటించారు. ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద కోట్లు కురిపించాయి. ఇటీవల విడుదలైన షారుఖ్ ఖాన్ చిత్రం 'జీరో'లో ఓ గీతంలో ఈ అగ్రహీరోలిద్దరూ కనిపించారు. 'పద్మావత్' తర్వాత సంజయ్‌లీలా పెద్ద ప్రాజెక్టు చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో వీరిద్దరి పాత్రలపై బలమైన స్క్రిప్ట్ తయారు చేశారట. సల్మాన్ ప్రస్తుతం 'భరత్' చేస్తున్నారు. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్నారు. కత్రినా కైఫ్ కథానాయిక. దీంతో పాటు 'దబాంగ్ 3' కూడా చేయనున్నాడు. షారుఖ్ ఖాన్ 'జీరో' అపజయం తర్వాత నిరాశపడ్డారు. 'సారే జహాసే అచ్చా' చిత్రాన్ని కూడా వదులుకున్నారు. త్వరలో కరణ్ అర్జున్‌తో కలసి కొత్త చిత్రం చేయబోతున్నాడు.

జోష్



కూలీల కొరత సాగు రంగానికి గుదిబండలా మారింది. ముఖ్యంగా చిన్న కమతాలకు సరిపోయే యంత్రాలు అందుబాట్లో లేక చిన్న, సన్నకారు రైతులు కూలీల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. దేశానికి వెన్నెముక అయిన అన్నదాతలు పడే కష్టాన్ని కళ్లారా చూసిన ఓ యువకుడు ఎలాగైనా వారికి సాయం చేయాలి అనుకున్నాడు. తానేమీ పెద్దపెద్ద చదువులు చదవలేదు. అయినా తనకు తెలిసిన వైండింగ్, వెల్డింగ్ పనిద్వారా వారి కష్టాన్ని తీర్చాలని అనుకున్నాడు. అందుకోసం రెండు సంవత్సరాలు కష్టపడ్డాడు. ఎట్టకేలకు రైతులకు ఉపయోగపడే కలుపు యంత్రాలను తక్కువ ఖర్చుతో తయారుచేసి పలువురి మన్ననలు పొందుతున్నాడు. కృషి, పట్టుదల ఉంటే మనిషి ఏ రంగంలోనైనా రాణించవచ్చని నిరూపించాడు తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కొడుముంజ ప్రవీణ్‌కుమార్. ఎందరో యువకులకు ఆదర్శంగా నిలుస్తున్న అతని గురించి నేటి జోష్‌లో..

కలుపు కష్టాలకు చెల్లు

తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగడపల్లి మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామంలో సత్తయ్య, సత్తవ్వల ఏకైక సంతానం కొడుముంజ ప్రవీణ్ కుమార్. తండ్రి వడ్రంగి పని, తల్లి బీడీ కార్మికురాలు. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం వారిది. చిన్నప్పుడు అతని తండ్రి మద్యపానానికి బానిసై ఇంటి బాధ్యతలు పట్టించుకునేవాడు కాదు. ఆ సమయంలో నాలుగేళ్లు నోట్లోకెళ్లడమే కష్టమయ్యేది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో 7వ తరగతిలోనే చదువు ఆపేశాడు ప్రవీణ్. 'మా మేనమామ నువ్వు ఇలాగే ఉంటే ఎలా? మీ నాన్న చూస్తే బాధ్యత లేకుండా ఉన్నాడు. ఈ సమయంలోనే నీవు అమ్మకు అండగా ఉండాలని సిరిసిల్లలో తెలిసిన వారి వెల్డింగ్, వైండింగ్ షాపులో పనికి కుదిర్చాడు. అలా నాలుగు సంవత్సరాలు సేట్ దగ్గర పని నేర్చుకున్నా' అని చెప్పుకొచ్చాడు ప్రవీణ్.

ఎవరూ నమ్మేవారు కాదు

'సేట్ దగ్గర పనికి కుదిరిన తర్వాత వాళ్ల అన్న కొడుకు రూములోనే ఉంచారు. ఉదయం 8 గంటలకల్లా షాపు దగ్గర ఉండాలి. ఆ లోపే రూములో వంటచేసి, అంట్లుతోమి, బట్టలు ఉతికి, ఒక్కోరోజు అతనికి బాడీ మసాజ్ చేసి పనికి వెళ్లాలి. అలా చేయనంటే ఎక్కడ సేట్‌కు చెప్పి పనిలోనుంచి తీయించేస్తారోనని భయపడేవాడిని. అందుకే కిక్కురుమనకుండా ఏ పని చెప్పినా చేసేవాడిని. అలా నాలుగు సంవత్సరాలు ఎంతో కష్టపడి పని నేర్చుకుని తర్వాత మా సొంతూరు వెళ్లా. కానీ చిన్నపిల్లోడు వాడేమి చేస్తాడులే అని ఎవరూ పనికి పిలిచేవారు కాదు. మా ఊరికి దగ్గరలోనున్న ఇల్లంతకుంట మండలంలో మరో సంవత్సరం రోజులు వెల్డింగ్, వైండింగ్‌లలో మెళకువలతో పాటు కరెంటు పనిలోనూ పట్టు సాధించాను. 2014లో జిల్లెల అడ్డరోడ్డులో అప్పు చేసి షాపు పెట్టాను. అక్కడి ప్రజల నమ్మకం కుదుర్చుకోవడానికి సుమారు సంవత్సరం పట్టింది' అంటున్నాడు ప్రవీణ్. అది మెట్ట ప్రాంతం కాబట్టి పంటలు పెద్దగా పండేవి కావు. నెలలో వారం రోజులు కూడా పని ఉండేది కాదు. ఇక లాభం లేదనుకుని అప్పుల ఊబిలోనుంచి బయటపడటం కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. కానీ అక్కడకు వెళ్లిన దగ్గర నుంచి ఆరోగ్యం సరిలేక ఇంటిదారి పట్టాడు. అలా పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయాడు.



రైతుల బాధ చూడలేకే..

ట్రాక్టర్‌తో అంతర సేద్యం చేయడం కుదరదు. పత్తిచేను, కూరగాయల తోటల్లో కలుపు తీయలేక రైతులు పడే బాధను కళ్లారా చూసిన ప్రవీణ్ మొదట రైతుల సలహా మేరకు 'సైకిల్ డౌరా'ను తయారుచేశాడు. ఇది రైతులకు కొంతవరకు మాత్రమే ఉపయోగపడింది. కానీ తను అధైర్యపడకుండా మరో అడుగు ముందుకేసి ఇంజన్‌తో నడిచే కలుపు నివారణ యంత్రాన్ని తయారుచేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం పాత చేతక్ ఇంజన్, ఆటో హ్యాండిల్, రెండు ఇనుప చక్రాలు, మరికొన్ని సామగ్రిని ఉపయోగించి డీజిల్‌తో నడిచే కలుపు యంత్రాన్ని తయారుచేశాడు. దానికి 'ప్రవీణ్ వీడర్' అని పేరు పెట్టాడు. మామూలుగా పొలం దున్నేటప్పుడు రైతు ఎలా నడవగలడో అంతే వేగంతో ఈ యంత్రం పనిచేసేలా నియంత్రించాడు. రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటూ వారికి అనుకూలంగా ఉండేలా మార్పులు, చేర్పులు చేశాడు. దీనితో పత్తి, మామిడి, చెరకు తోటల్లో అవలీలగా కలుపు తియ్యడంతోపాటు 30 నుంచి 36 ఇంచ్‌లలోనున్న ఏ పంటలోనైనా దీనిని వాడుకోవచ్చు. ఇది ఐదు లీటర్ల డీజిల్ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. మామూలుగా ఎకరా పొలంలో కలుపు తీయాలంటే కూలీలతోపాటు అధిక సమయం పడుతుంది. కానీ ఈ యంత్రంతో కేవలం లీటర్ డీజిల్‌తోనే ఒక వ్యక్తి ఎకరా పొలంలో గంటలోనే కలుపు తీయవచ్చు. తర్వాత కొంతమంది రైతులు నిలబడి పనిచేయాలంటే చాలా కష్టంగా ఉంది. కూర్చుని కలుపు తీసేలా ఏదైనా పరికరం కనిపెట్టమని అడిగారట. అలా ప్రవీణ్ ఆలోచనల్లో నుంచి వచ్చిన మరొక యంత్రమే 'మినీ ట్రాక్టర్'. ఇదీ ఐదు లీటర్ల డీజిల్ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. రెండు లీటర్ల డీజిల్‌తోనే ఎకరా పొలంలో కలుపు తియ్యవచ్చు. దీనిని పొలంలో వెనుకకు, ముందుకు తిప్పడానికి అనుకూలంగా తయరుచేశాడు. ఇద్దరు కూర్చొని పనిచేసే ఈ యంత్రం తయారు చేయడానికి ముగ్గురు వ్యక్తులకు 15 రోజుల సమయం పడుతుంది. .



భవిష్యత్తులో.. కొన్ని!

కలుపు యంత్రంలోనే రొటావెటర్ (గుండ్రంగా తిరుగుతూ గడ్డిని పిండిచేసే యంత్రం)ను, వీటి ద్వారానే మందు పిచికారి చేసేలా యంత్రాన్ని తయారు చేయాలనుకుంటున్నా. ఇంకా మినీ ట్రాక్టర్‌కు వెనుక వైపు చిన్న ట్రాలీ పెట్టాలనీ చూస్తున్నా.

- కొడుముంజ ప్రవీణ్ కుమార్
ఫోన్ : 63016 25399

ఎన్నో అవమానాలు

'అసలే చదువులేదు. అతికష్టం మీద వెల్డింగ్, వైండింగ్ పని నేర్చుకున్నావు. అది చేసుకోక యంత్రాలంటూ సమయాన్ని వృథా చేసుకోవడం అవసరమా? అన్నవాళ్లు ఉన్నారు. అలాగే నేను చేసిన యంత్రాన్ని కొన్న జమ్మూ- కాశ్మీర్ రైతు వాళ్ల ఊరికి నన్ను తీసుకెళ్లి మీటింగ్ పెట్టి మరీ దానిని ఎలా ఉపయోగించాలో చెప్పించాడు. అవి నా జీవితంలో ఆనంద క్షణాలు. ప్రస్తుతం వెల్డింగ్, వైండింగ్ పని తగ్గించేసి, ఎక్కువగా ఈ పనిలోనే నిమగ్నమయ్యా. ప్రస్తుతం నేను ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నా. సీజన్‌లోనైతే ఐదారుగురికి ఉపాధి ఇవ్వగలుగుతున్నా' అంటున్నాడు ప్రవీణ్.

ప్రస్తుతం సిరిసిల్ల జిల్లాలోని రైతులకు ప్రవీణ్ సుపరిచితుడే. ఇప్పటివరకు 40 నుంచి 50 వరకు ప్రవీణ్ వీడర్స్‌ను విక్రయించాడు. గతంలో వీటిని రూ.38 వేలకు అమ్మేవాడు. 'ప్రస్తుతం కొంతమంది డీలర్స్ హోల్‌సెల్ రేటుకే సామగ్రిని ఇస్తున్నారు. కాబట్టి ఇకమీదట రైతులకు 35 వేలకే వీడర్‌ను ఇవ్వాలని నిర్ణయించుకున్నా. ఇలాంటి యంత్రమే మార్కెట్లో లక్ష వరకు పలుకుతుంది. అలాగే మినీ ట్రాక్టర్‌నూ లక్ష రూపాయలకే అమ్మాలని అనుకుంటున్నా. అది మార్కెట్లో రెండు నుంచి నాలుగు లక్షల వరకు ధర పలుకుతుంది' అంటున్నాడు ప్రవీణ్. ఇప్పటివరకు ఉత్తరప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్, ఆంధ్ర, తెలంగాణలో రైతులు వీటిని ఉపయోగిస్తున్నారు. ప్రవీణ్‌కు లహితతో ఈ మధ్యే వివాహం జరిగింది.

నేటి యువత ఒకప్పటిలా లేరు. సమాజం గురించీ ఆలోచిస్తున్నారు. కొందరు టెక్నాలజీ పరంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుంటే, ప్రవీణ్‌లాంటి యువకులు రైతుల కోసం ఏదో ఒకటి చేయాలని ఆలోచించడం అభినందించదగ్గ విషయం.

- స్వర్ణలత నూకరాజు

14 దేశాల్లో సైకిల్ సవారీ



చదువుతోపాటు ప్రతి విషయంలోనూ నేడు పోటీతత్వం పెరిగింది. క్లిష్ట పరిస్థితులను సైతం అనుకూలంగా మార్చుకుంటున్నారు నేటి యువత. అంతే కాదు; మరిన్ని విజయాలను సొంతం చేసుకునే ఆరాటంలో ముందుకు దూసుకుపోతున్నారు. ఈ కోవలోకే వస్తుంది వేదంగీ కులకర్ణి. ఈమెకిప్పుడు 19 సంవత్సరాలు. 2018 తనకొక ప్రత్యేక సంవత్సరంగా మిగలాలని ఆరాటపడింది కులకర్ణి. దీనిలో భాగంగానే సైకిల్‌పై సుదీర్ఘ ప్రయాణం చేస్తూ ప్రపంచమంతా తిరిగి రావాలనుకుంది. అందుకే 130 రోజుల్లో 29 వేల కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలని లక్ష్యంగా పెట్టుకుంది.

యుకెలోని బోర్న్‌మౌత్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఈమె. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చదువుతోంది. దాదాపు రెండు సంవత్సరాల క్రితమే ఈ సైకిల్ రైడ్‌కు సంబంధించిన కసరత్తు ప్రారంభించింది. మొట్టమొదట ఆస్ట్రేలియా నుంచి బ్రిస్బేన్ చేరుకుని, విల్లింగ్‌టన్, న్యూజిలాండ్ మీదుగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. సైకిల్‌పై భారానికి మించిన లగేజి. పైగా దారి తెలియని ఒంటరి ప్రయాణం. ఈమెకు 80 శాతం రూట్ తెలియనప్పటికీ అణువణువూ ఆత్మవిశ్వాసాన్ని నింపుకుని ముందుకు సాగింది. అక్కడి నుంచి కెనడా వాంకూవర్ చేరడానికి మరోవిమానంపై హాలిఫాక్స్ పోర్ట్ సిటీ నుంచి తన ప్రయాణం మొదలుపెట్టింది. ఇస్‌లాండ్ నుంచి ఐరోపా, స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం, డెన్మార్క్, స్వీడన్, ఫిన్లాండ్, రష్యాను కలుపుకుంటూ యూరప్ చేరుకుంది. అక్కడి నుంచి రష్యా వెళ్లి 4,000 కిలోమీటర్లు చివరి మైలు రాయిని చేరడానికని ఇండియా తిరిగి వచ్చింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో −20నుంచి 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకుంటూ ముందుకు సాగింది కులకర్ణి.



సైకిల్ మీద ప్రపంచమంతా తిరిగి రావాలనే సాహసం కొంతమంది మాత్రమే చెయ్యగలరని, అలాంటి అరుదైన వ్యక్తుల్లో తన కూతురు ఉన్నందుకు ఒకింత గర్వంగా ఉందనీ ఈమె తండ్రి వివేక్ కులకర్ణి అంటున్నారు. తను ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు మరిన్ని విజయాలను దక్కించుకుంటుంది అని ఎంతో ఆనందంగా చెప్పారాయన. గత ఏడాది (2018) 124 రోజుల్లో సైకిల్‌పై ప్రపంచమంతా తిరిగి మొదటి స్థానంలో నిలిచిన బ్రిటిష్ ఎడ్వెంచరర్ జెన్నీ గ్రాహం (38) రికార్డు బద్దలు కొట్టాలనుకుంది కులకర్ణి.

అయితే అనుకున్న టార్గెట్‌కు అదనంగా నాలుగు వారాలు అంటే మొత్తం 159 రోజులు పట్టింది. ప్రతిరోజు 300 కిలోమీటర్లు చొప్పున ప్రయాణం చేసింది. ఈ విధంగా తన సాహోసోపేతమైన యాత్రలో భాగంగా మొత్తం 14 దేశాలను చుట్టేసింది ఈమె. 'అమ్మానాన్న నా చిన్నతనం నుంచే అవసరమైన మానసిక స్థైర్యంతోపాటు తగిన ప్రోత్సాహాన్నీ అందించారు. బైట ప్రపంచంలోకి వెళ్లినప్పుడు ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన మానసిక దృఢత్వంతో పాటు తగిన ఆత్మస్థైర్యాన్ని నేర్పారు' అని ఎంతో గర్వంగా చెప్పింది కులకర్ణి.

ఈ విధంగా సైకిల్‌పై అతి వేగంగా ప్రపంచాన్ని చుట్టేసిన తొలి ఏసియన్‌గా అద్భుత సాహసాన్ని ప్రదర్శించింది కులకర్ణి. జులై నెల 2018లో ఈ యాత్రకు శ్రీకారం చుట్టింది. కెనడా వెళ్లినప్పుడు ఎలుగు బంటి తన వెంట పడింది. స్పెయిన్‌లో కొందరు దుండగులు తనపై తుపాకితో దాడి చేసారు. ఈ ప్రయాణంలో ఇలాంటి ఎన్నో ప్రమాదకరమైన అనుభవాలనూ చవిచూసింది కులకర్ణి. రష్యాలో ఎన్నో మంచు రాత్రులు ఒంటరిగా గడపాల్సి వచ్చింది. వీసా సమస్యలనూ ఎదుర్కొంది. ఇలా ఎన్నో మానవసంబంధిత అనుభవాలను ఆమె ఎదుర్కొంది. 'ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల సమాజంలో లోటుపాట్లతో పాటు నాలో ఉన్న మంచిచెడులూ నాకు తెలిశాయి' అని ఎంతో నిజాయితీగా చెప్పింది కులకర్ణి. ★

చిన్నారి

పొడుపు కథ

చూస్తే చూస్తుంది గానీ కళ్లు లేవు,
నవ్వితే నవ్వుతుంది గాని పళ్లు
నోరు లేదు,
తంతే తంతుంది గాని కాళ్ళు లేవు

జవాబు : అద్దం

జోక్:

తండ్రి : ఏంట్రా చింటూ ఆ రాళ్ళన్ని తీసి వెనక వేస్తున్నావు ఎందుకు?

చింటూ : మొన్న నానమ్మ నాలుగురాళ్ళు వెనకెయ్యరా.. అని నీతో చెప్తుంది కదా అందుకే వేస్తున్నా...!

చుక్కలు కలపండి!

పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కల్ని కలిపి.. బొమ్మను పూర్తిచేయండి!!



ఆకు కూరలు




ఆకు కూరలు తింటే మేలు
రోజుకు కొన్ని తింటే చాలు
ఒంటికి బలాన్ని ఇస్తాయి
కంటికి మేలు చేస్తాయి
ఆకుకూర, తోటకూర,
చుక్కకూర, మెంతికూర,
గొంగూర, బచ్చలకూర,
కొత్తిమీర, పాలకూర,
ఆకుకూరలు రకరకాలు
ఆకుకూరలతో ఎన్నో లాభాలు



మల్లికార్జున,
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల
మెయిన్,హెచ్.మురవణి,
కర్నూలుజిల్లా

దారి కనుక్కోండి!


పిల్లలూ! ఇక్కడున్న ఎలుక బోనులో చిక్కకుండా కలుగులోకి వెళ్ళే దారిని కనుక్కోండి



నేను గీసిన బొమ్మ



బి. అశోక్ నాయక్
6వ తరగతి
ఎ.పి.టి.డబ్ల్యు.ఆర్ స్కూల్
టి. సుండుపల్లి
వైయస్‌ఆర్ కడప



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

రేపటి నుంచి విశాఖ టీ20 టిక్కెట్ల అమ్మకాలు

(ప్రజాశక్తి- స్పోర్ట్స్ బ్యూరో)
భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ 24న విశాఖపట్నంలో జరగనుంది. ఈ మ్యాచ్‌కు పోతినమల్లయ్యపాలెంలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియం వేదిక కానుంది. ఈ మ్యాచ్ టిక్కెట్ల ధరలను రూ.500, రూ.1200, రూ.1600, రూ.2వేలు, రూ.4వేలుగా నిర్ణయించారు. వీటిని రేపటి (ఫిబ్రవరి 4) ఉదయం 8గంటల నుంచి www.eventsnow.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఫిబ్రవరి 15 నుంచి ఆఫ్‌లైన్‌లో కూడా విశాఖ కేంద్రంగా 10 కౌంటర్లలో టిక్కెట్లను నేరుగా కొనుగోలు చేసుకోవచ్చు.





మంధాన @1

- బౌలింగ్‌లో గోస్వామికి నాల్గో స్థానం
- ఐసిసి వన్డే ర్యాంకులు విడుదల

ముంబయి : అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసిసి) తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత మహిళాజట్టు ఓపెనర్ స్మృతి మంధాన టాప్ ర్యాంక్‌కు చేరింది. కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో మంధాన బ్యాటింగ్‌లో రాణించడంతో మూడు స్థానాలు ఎగబాకి అగ్రస్థానానికి చేరుకుంది. తొలివన్డేలో 105, రెండో వన్డేలో 90 పరుగులు చేసి సిరీస్ గెలుపులో కీలక పాత్ర పోషించింది. ఇక బౌలింగ్ విభాగంలో స్పిన్నర్లు పూనమ్ యాదవ్, దీప్తిశర్మ ఐదు స్థానాలు మెరుగు పరుచుకుని ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో నిలిచారు. ఏక్తా బిస్త్ 13వ స్థానంలో నిలవగా, ఝులన్ గోస్వామి టాప్-5లో చోటు దక్కించుకుంది. ఆమె బౌలర్ల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచింది.

ఆత్మవిశ్వాసానికి పరీక్ష



రికార్డు విజయంపైనే టీమిండియా గురి
నేడు కివీస్‌తో చివరి వన్డే
ఉదయం 7.30 ని.ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా టీమిండియా తొలి మూడు వన్డేల్లో భారీ విజయాలను నమోదు చేసుకుంది. విరాట్‌కు విశ్రాంతి, గాయం కారణంగా ధోనీ టీమిండియాకు దూరం కావడంతో నాల్గో వన్డేలో ఘోర పరాజయాన్ని చవిచూసింది. భారీస్కోర్‌లను కివీస్‌పై అలవోకగా ఛేదించిన జట్టు ఒక్కసారిగా మూడంకెల స్కోర్‌కు చేరుకోలేకపోయింది. దీంతో భారత్ జట్టు నిలకడపై మళ్లీ అనుమానాలు మొదలయ్యాయి. అయితే న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగే ఐదో వన్డేలో గెలిచి 52 ఏళ్ల రికార్డును సమం చేయాలని టీమిండియా భావిస్తోంది. నేటి మ్యాచ్‌లో భారత్ మరో భారీ విజయాన్ని నమోదు చేస్తుందో లేక 2008లో 3-1 రికార్డును సమం చేస్తుందో చూడాలి. ఈ తరుణంలో నేటి చివరి వన్డేమ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. మునుపటి మ్యాచ్‌లాగే టాప్ ఆర్డర్ చేతులెత్తేసి మరిన్ని చెత్త రికార్డులను మూటగడతారో లేక ఈ మ్యాచ్‌ను గెలిచి ప్రపంచకప్‌కు ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుందో వేచిచూడాల్సిందే.


అరంగేట్రం మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ నిరాశపరిచాడు. దీంతో ఈ వన్డేలో అతని ప్రదర్శనపైనా ఆసక్తి నెలకొంది. ఎందుకుంటే నాల్గో వన్డేలో కేవలం తొమ్మిది పరుగులు మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో ఐదోవన్డేలో ఖచ్చితంగా రాణించాల్సిన అవసరమెంతైనా ఉంది. గాయం కారణంగా మూడు, నాల్గో వన్డేలకు దూరమైన ధోని ఐదో వన్డేలో ఆడే అవకాశముంది. ఇంకోవైపు రోహిత్ శర్మ సారథ్యం కూడా తన కెరీర్‌కు బాసటగా ఈ వన్డే నిలవనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి టీ20ల్లోనూ సత్తా చాటాలని అభిమానులు ఆశపడుతున్నారు.

టీమిండియా జట్టు : రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, అంబటి రాయుడు, కేదర్ జాదవ్, ధోనీ(కీపర్), దినేష్ కార్తీక్, హర్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమి, సిరాజ్, జడేజా, ఖలీల్ అహ్మద్.

న్యూజిలాండ్ జట్టు : విలియమ్సన్(కెప్టెన్), గుప్తిల్, మాన్రో, టేలర్, లూథమ్(కీపర్), నికోల్స్, నీషమ్, సాంట్నర్, అస్టిల్, ఫెర్గుస్సన్, బౌల్ట్, గ్రాంథోమ్, టిమ్ సౌథీ, హెన్రీ.

ప్రతిష్టాత్మకం.. పర్యవేక్షణా లోపం

పూర్తి స్థాయిలో ప్రోత్సాహం లభించలేదు



టోర్నమెంటుల పేరుతో ప్రభుత్వం వందల కోట్లు ఖర్చుపెడుతోంది. కానీ వాటికి తగ్గట్టుగా ఫలితం మాత్రం రాలేదు. హడావుడిగా ఆటలను అప్పుడికప్పుడే ప్రారంభిస్తారు. ముందుకాని, తర్వాత కాని ఎటువంటి అభివృద్ధి చేయరు. ప్రోత్సాహం అందించరు. అయినా ఇప్పుడు ఈ పోటీలు పెట్టడం వల్ల కొంతమంది ఉద్యోగార్హత పరీక్షలు, అకడమిక్ పరీక్షలు రాస్తున్నారు. వారు పూర్తి స్థాయిలో ఈ టోర్నీలో పాల్గొనలేరు.

- ప్రసాదరావు, సీనియర్ సిటిజన్

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ బ్యూరో)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని అంటున్న అధికార నాయకుల మాటలు ఎన్నికల హామీలగానే మిగిపోతున్నాయి. విద్యార్థులలో వున్న ప్రతిభను వెలికితీసే ప్రయత్నం జరుగుతున్నా ఫలితం మాత్రం కనబడలేదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఉన్న క్రీడా ప్రతిభను వివిధ రూపాలలో బయటకు తేవాలని ప్రభుత్వం చేస్తున్న చిన్న ప్రయత్నమే సిఎమ్ కప్. ఇందులో గ్రామస్థాయి, మండలస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి విద్యార్థులలో ఉన్న ప్రతిభను జాతీయ స్థాయిలో చాటి చెప్పించి రాష్ట్రానికి మంచిపేరు తెప్పించి, క్రీడాకారుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చదిద్దడమే దీని లక్ష్యం. అయితే క్రీడాపోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహం కాని, తదనంతరం భవిష్యత్తును నిర్దేశించడంలో పర్యవేక్షణ అనేది కొంత లోపంగానే కనిపిస్తోంది.

సిఎం కప్ ఉద్దేశం...

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో శాప్ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత, కాలేజి స్థాయిలలో ఈ ఆటల పోటీలను నిర్వహిస్తారు. మండల, జిల్లా స్థాయిలుగా నిర్వహించే ఈ ఆటలలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో ఆడిస్తారు. ముఖ్యంగా తొమ్మిది రకాల ఆటలపోటీలను ఈ సిఎంకప్‌లో నిర్వహిస్తారు. ఇందులో కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, రోప్, క్రికెట్‌తో పాటు గ్రామీణస్థాయి 26 ఆటలను పరిశీలించి వాటిలో తొమ్మిది క్రీడలను ఎంపిక చేసి మొత్తం 18 క్రీడలను ఈ సిఎంకప్‌లో ఆడిస్తారు.

ఈ కప్‌లో క్రీడాకారులను మూడు దశలుగా విభజిస్తారు. అండర్-14, అండర్-17, అండర్-19 బాలురు, బాలికలుగా విడదీసి ఆడిస్తారు. ఈ క్రీడల్లో ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులు.

సీనియర్ ఇంటర్ క్వార్టర్ ఫైనల్స్...

గత ఏడాది ఆగష్టు నుంచి ప్రారంభించిన సిఎంకప్ టోర్నీలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కలిపి సుమారు 10 లక్షల మంది పాల్గొన్నారు. దశలవారీగా జరుగుతూ వస్తున్న ఈ పోటీలు ఇప్పుడు సీనియర్ ఇంటర్ క్వార్టర్ ఫైనల్స్‌లో జిల్లాల స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చూపిన ఎనిమిది పురుషుల టీమ్‌లు, ఎనిమిది మహిళల టీమ్‌లను ఎంపిక చేసి ఫిబ్రవరి రెండోవారంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ దశలో 5 ఆటలను ఆడిస్తారు. కబడ్డీ పోటీలు గుంటూరుజిల్లా చిలకలూరిపేటలో, వాలీబాల్ నరసరావు పేటలో, బాల్‌బాడ్మింటన్ కృష్ణాజిల్లా మైలవరంలో, త్రైక్వాండో కర్నూలు వేదికలుగా నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.



పరుగు పందెంలో పరుగు తీస్తున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న పురుషులు

క్రీడా అకాడమీలు...

రాష్ట్రంలోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి మరిన్నిమెళుకువలు నెర్పించడమే ఈ అకాడమీల కర్తవ్యం. అయితే రాష్ట్రం మొత్తం ఈ అకాడమీలు ఏర్పాటుచేయాల్సి ఉన్నా అనంతపురం, నెల్లూరు, నరసరావుపేట, కాకినాడ, గుడివాడ, విశాఖపట్నం ప్రాంతాలలో ప్రారంభించింది. వీటి సౌకర్యాలు తదితర సంబంధింత అంశాల గురించి కోసం ప్రభుత్వం వందల కోట్లు నిధులు కేటాయిస్తుంది. ఇంతటి వరకూ బాగానే వున్నా కిందటి ఏడాది అక్టోబర్ నెలలో ప్రారంభించిన ఈ సిఎం కప్ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో అంటే సరిగ్గా అకడమిక్ పరీక్షలు మొదలవ్వడానికి నెల రోజుల ముందు మళ్లీ కొనసాగి స్తున్నారు. అయితే క్రీడాకారులకు పరీక్షలు, తదితర వాటికి ఇబ్బంది కలుగకుండా ఈ పోటీలను నిర్వహిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

వైఫల్యాలు..

అయినా ప్రభుత్వం సిఎం కప్ అని, ఇంటర్ కాలేజి టోర్నమెంటులు, యూనివర్శిటిల టోర్నీలు, కిందటి నెలలో గురుకుల సొసైటీ ఆటలపోటీలు, ఇలా అనేక రకాలుగా విద్యార్థులలో ఉన్న ప్రతిభను బయటకు తీసుకురావాలని చేస్తున్న ప్రయత్నం అందరూ గర్వించదగ్గ విషయమే. ఎందుకుంటే ఇలాంటి టోర్నీలు జరపడం వల్ల క్రీడలపట్ల విద్యార్థులకు మక్కువ పెరుగుతుంది. దీంతో పాటు ఒకరికొకరికి పరిచయాలు పెరిగి వారిలో క్రియాశీలత పెరుగుతుంది. ఇప్పటి వరకూ బాగానే ఉన్నా టోర్నమెంటులు ముగిసిన తరువాత ప్రతిభ చూపిన విద్యార్థుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. రాష్ట్ర స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహం లభించినప్పుటికీ జిల్లాస్థాయిలో ఉన్న వారు ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో క్రీడల్లో కొనసాగించలేక మధ్యలోనే ప్రయాణాన్ని ఆపేస్తున్నారు. ఇలాంటివారి సంఖ్యే ఎక్కువగా వుంది. ఇలాంటి వారికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తే వారి క్రీడా జీవితానికి మరింత ఆదరణ లభిస్తుంది.

ఇలాంటి టోర్నీలు చాలా అవసరం



గ్రామీణస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సిఎం కప్ లాంటి టోర్నమెంటులు చాలా అవసరం. దీని ద్వారా ఎంతో మంది ప్రతిభను సమాజానికి పరిచయం చేశాము. అంతే కాకుండా క్రీడాకారులు ఇలాంటి వేదిక లపై కలుసుకోవడం వల్ల వారి మధ్య ఉన్న అంతర్యం తగ్గి ఒకరికొకరు ఆలోచనలు పంచుకుంటారు. ఇప్పటి వరకూ జరిగిన టోర్నీ లలో నగదు ప్రోత్సాహం మాత్రమే ఇచ్చాము. ఇకనుంచి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి ఆలోచన చేస్తున్నాం.

- అంకమ్మ చౌదరి, శాప్ ఛైర్మన్



గాయపడిన కరుణ రత్నేను స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది

కరుణ రత్నేకు తప్పిన ముప్పు

కష్టాల్లో లంక • ఆసీస్ 534/5 డిక్లేర్డ్

కాన్‌బెర్రా : రెండో టెస్టులో ఆస్ట్రేలియా పరుగుల వరద పారించింది. ఓవర్‌నైట్ స్కోరు నాలుగు వికెట్ల నష్టానికి 384 పరుగులతో శనివారం బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ ఐదు వికెట్ల నష్టానికి 534 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. బర్న్స్ 180, హెడ్ 161 పరుగుల వద్ద ఔట్‌కాగా.. పీటర్సన్ (114 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కాడు. లంక బౌలర్లు ఫెర్నాండో మూడు, రజిత, కరుణరత్నే చెరో వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక రెండోరోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. కరుణరత్నే 46(రిటైర్డ్‌హర్ట్), తిరుమన్నే 41, మెండీస్ 6, కెప్టెన్ చండీమాల్ 15 పరుగుల వద్ద ఔటయ్యారు. పెరీరా (11), డిసిల్వ(1) క్రీజ్‌లో ఉన్నారు. కమిన్స్, స్టార్క్, లియాన్‌లకు తలా ఒక వికెట్ దక్కాయి.

కరుణరత్నేకు గాయం

శ్రీలంక ఓపెనర్ కరుణరత్నేకు పెను ప్రమాదం తప్పింది. కమిన్స్ వేసిన 31.4 ఓవర్ బంతి కరుణరత్నే తల వెనుక భాగంలో బలంగా తాకింది. దీంతో కరుణరత్నే మైదానంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు తేల్చారు. దీంతో ఇరుజట్ల ఆటగాళ్లు ఊపిరి పీల్చుకున్నారు.



విశాఖలో క్రికెట్ ఆడుతున్న అంధులు

సెమీస్‌కు ఆంధ్రా జట్టు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో
భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) గుర్తింపు పొందిన నాగేష్ జాతీయ క్రికెట్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్స్‌లో అంధుల ఆంధ్రా జట్టు గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. విశాఖ పోర్టు స్టేడియం వేదికగా శనివారం జరిగిన టి20 మ్యాచ్‌లో తమిళనాడుపై ఆంధ్రా జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లకు గాను 19.3 ఓవర్లు ఆడిన తమిళనాడు జట్టు 122 పరుగులకు ఆలౌటయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 13.1 ఓవర్లలో కేవలం నాలుగు వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. రంజీ ట్రోఫీ మాదిరిగా ఆంధుల క్రికెట్‌కు సంబంధించి ఈ ఏడాది బిసిసిఐ అధికారంగా ప్రవేశపెట్టిన నాగేష్ జాతీయ క్రికెట్ టోర్నీ దేశవ్యాప్తంగా జరుగుతోంది. క్వార్టర్‌ఫైనల్స్ దశకు చేరడంతో విశాఖలో నిర్వహించడానికి గురుదేవ ఛారిటబుల్ ట్రస్టు ముందుకు వచ్చింది. భారత క్రికెట్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ ఆంధ్రప్రదేశ్, గురుదేవ ఛారిటబుల్ ట్రస్ట్‌లు ఈ మ్యాచ్‌ను నిర్వహించాయి.

డబుల్స్‌లో గెలుపు

ఇటలీ చేతిలో 3-1 ఓటమి • డేవిస్‌కప్ పోరు



కోల్‌కతా : డేవిస్ కప్ మెయిన్ డ్రాకు ఇటలీ అర్హత సాధించింది. శుక్రవారం రెండు సింగిల్స్‌లో ఓడిన భారత జట్టు శనివారం డబుల్స్ మ్యాచ్‌లో గెలుపొందింది. దివిజ్-బొప్పన్న జోడీ 4-6, 6-3, 6-4 సెట్ల తేడాతో బెల్లెల్లి-బెర్రెట్టిని జోడీతో గంటా 43 నిమిషాలసేపు పోరాడి గెలిచారు. ఇటలీ ఆధిక్యతను 2-1కు తగ్గించారు. కానీ రివర్స్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో గుణేశ్వరన్ 6-1, 6-4 సెట్ల తేడాతో కేవలం 62 నిమిషాల్లోనే 37వ సీడ్ అంద్రెస్ సిప్పి(ఇటలీ) చేతిలో ఓడాడు. దీంతో డేవిస్ కప్ అర్హత టోర్నీలో భారత్ కథ ముగిసినట్టైంది. దీంతో రెండో సింగిల్స్ మ్యాచ్ రద్దైంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68